

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

శ్రీకాకుళం : fb.com/vaartha Digital

Published from Srikakulam ,Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem

6-10-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 247 పేజీలు: 16 వెల: 6.50


ఆహార సంక్షోభంలో నప్రపంచ దేశాలు

జర్మనీలో మ్యూనిచ్ లీడర్ల సమావేశంలో కేంద్ర ఆర్థికమంత్రి సీతారామన్ 5

## మొగుడు కావాలి..

ఓ అమెరికా యువతి వినూత్న ప్రకటన



## మెదడు మిస్టరీపై అధ్యయనం

ముగ్గురికి నోబెల్

న్యూరోసైన్స్‌లో కొత్త ఆవిష్కరణలకు అత్యున్నత పురస్కారం

**ఓస్లో, అక్టోబరు 5:** ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ పురస్కారాల ప్రకటన ప్రారంభమైంది. 2026 సంవత్సరానికి గాను వైద్యశాస్త్రంలో (ఫిజియాలజీ/మెడిసిన్) ముగ్గురు శాస్త్రవేత్తలు సంయుక్తంగా ఈ అత్యున్నత పురస్కారానికి ఎంపికయ్యారు. అమెరికాకు చెందిన కార్ల్ డీస్సెరోత్ (స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ), జర్మనీకి చెందిన >>2

## 15యేళ్లలో 100 బి.డాలర్ల స్విస్ పెట్టుబడులు

పది లక్షల ప్రత్యక్ష ఉద్యోగాల కల్పన లక్ష్యం

రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించిన భారత్- స్విస్

ప్రధాని మోడీ, స్విస్ అధ్యక్షుడు గై పార్మెలిన్ భేటీ

వాణిజ్య, ఎఐ, రక్షణ ఉత్పత్తి, అణుశక్తి, టెక్నాలజీ అంశాలపై చర్చలు

ఉక్రెయిన్ యుద్ధం, యుఎన్ సంస్కరణలపై ఒకే మాట



**న్యూఢిల్లీ, అక్టోబరు 5:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, స్విస్ అధ్యక్షుడు గై పార్మెలిన్ సోమవారం న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో భారత్- స్విట్జర్లాండ్ సంబంధాల పూర్తి స్థాయిని సమీక్షిస్తూ విస్తృత చర్చలు జరిపారు. సుస్థిర మౌలిక సదుపాయాల అభివృద్ధి, యువ నిపుణుల మార్పిడి, ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, వ్యవస్థాపకత వంటి పలు రంగాలలో తమ సహకారాన్ని మరింతగా పెంపొందించుకోవడానికి భారత్, స్విట్జర్లాండ్ పలు అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశాయి. వాణిజ్యం, పెట్టుబడులు, ఆవిష్కరణలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైనిక మార్పిడులు, రక్షణ ఉత్పత్తి, అణుశక్తి, సైన్స్ అండ్ టెక్నాలజీ, ప్రజల మధ్య సంబంధాలలో సహకారాన్ని మరింతగా పెంపొందించే మార్గాలపై నాయకులు చర్చించారు. భారత్ ఇఎఫ్‌టిఎ వాణిజ్య, ఆర్థిక భాగస్వామ్య ఒప్పం >>2

# ప్రతి ఇంటికీ స్వచ్ఛజలం



సోమవారం ప్రొద్దుటూరులో 'జల జీవన్ మిషన్-అమరజీవి జలధార'ను ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్, మంత్రులు, తదితరులు

ప్రొద్దుటూరులో 'అమరజీవి జలధార్ల పనులకు శ్రీకారం

రూ.30,156 కోట్లతో 27 లక్షల కుటుంబాలకు సురక్షిత తాగునీరు

సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్, బిజెపి చీఫ్ మాధవ్ చేతుల మీదుగా పైలాన్ ఆవిష్కరణ

రాయలసీమ రైజింగ్‌ను ఎవరూ అడ్డుకోలేరు: సిఎం చంద్రబాబు

గోదావరి పుష్కరాల లోపు పోలవరం పూర్తి

వైసిపి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు.. గొడ్డలి పార్టీకి ప్రజలు బుద్ధిచెప్పారని వ్యాఖ్య

రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదు..అభివృద్ధి: డి.సిఎం పవన్

**ప్రొద్దుటూరు(క్రైం), అక్టోబరు 5 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రతి గ్రామీణ కుటుంబానికి సురక్షితమైన, నాణ్యమైన తాగునీటిని ఇంటింటికీ అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జల జీవన్ మిషన్-అమరజీవి జలధార' బృహత్తర కార్యక్రమానికి వైఎస్ఆర్ కడప జిల్లా ప్రొద్దుటూరులో శ్రీకారం చుట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ చేతుల మీదుగా ప్రొద్దుటూరులో పైలాన్, శిలా ఫలకాలు ఆవిష్కరించి రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న తాగునీటి అభివృద్ధి పనులను లాంఛనంగా ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు రాబోయే మూడు దశాబ్దాల నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ ప్రణాళిక ద్వారా రాష్ట్రంలోని కోట్లాది ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందుబాటులోకి రానుంది. రూ.30,156 కోట్ల భారీ అంచనా వ్యయంతో చేపట్టిన ఈ కార్యక్రమం రాష్ట్ర గ్రామీణ నీటి సరఫరా వ్యవస్థలో సమూల మార్పునకు నాంది పలకనుంది. జల జీవన్ మిషన్-అమరజీవి జలధార'లో భాగంగా రాష్ట్రంలోని గ్రామీణ కుటుంబాలకు స్థిరమైన నీటివనరుల ద్వారా తగినపరిమాణంలో, >>3





## సస్పెండ్ చేయలేం

సిఇసి జ్ఞానేశ్ విధులకు ఆటంకం కలిగించలేమన్న సుప్రీంకోర్టు

నిర్ణయాలు చట్టవిరుద్ధమని తేలితే రద్దు చేస్తాం

కేంద్రం, ఇసికి నోటీసులు జారీ

వారంలో వివరణ ఇవ్వాలని ఆదేశం

**న్యూఢిల్లీ, అక్టోబరు 5:** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అధికారాల వినియోగంపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు నేడు విచారణ చేపట్టింది. ఇతర కమిషనర్లతో సంప్రదించకుండా సీఈసీ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్లను స్వీకరించిన సర్వోన్నత న్యాయస్థానం, ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వానికి, భారత ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. వారం రోజుల్లోగా తమ స్పందన తెలియజేయాలని ఆదేశించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ జరిపింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఫారం 6లో మార్పులు వంటి పలు కీలక నిర్ణయాలను సీఈసీ జ్ఞానేశ్ కుమార్ మిగతా ఇద్దరు కమిషనర్ల ఆమోదం లేకుండా ఏకపక్షంగా తీసుకున్నారని పిటిషనర్లు ఆరోపించారు. ఎన్నికల సంఘం వంటి బహుళ సభ్యుల కమిషన్‌లో నిర్ణయాలు ఏకగ్రీవంగా లేదా మెజారిటీ ప్రాతిపదికన జరగాలని, కానీ ఇక్కడ అలా జరగలేదని వారు కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, ఈసీ తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తామని స్పష్టం చేసింది. "రాజ్యాంగబద్ధమైన సంస్థలు చట్టానికి లోబడి పనిచేయాలి. ఒకవేళ తీసుకున్న నిర్ణయాలు చట్టవిరుద్ధమని తేలితే, వాటిని రద్దు చేస్తాం అని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. అయితే, సీఈసీగా జ్ఞానేశ్ కుమార్ విధులకు ఆటంకం కలిగించేలా లేదా ఆయనను సస్పెండ్ చేసేలా ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడానికి కోర్టు నిరాకరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికల సంఘానికి ఉన్న అధికారాలను సీఈసీ ఒక్కరే >>2

## మలేరియా మాత్రలు వికటించి చిన్నారి మృతి ఘటనపై సుమోటోగా సుప్రీం విచారణ

దర్యాప్తు ప్రక్రియ నిశితంగా పర్యవేక్షించాలి

ఎపి హైకోర్టుకు సిజె ధర్మాసనం ఆదేశం

**అమరావతి, అక్టోబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** పోలవరంలో యాంటీ మలేరియా మాత్రలు వికటించిన ఘటనపై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. గత నెల 1న ఏజెన్సీలో చిన్నారి మడివి జమున (7) మృతి మృతిచెందడంపై సిజెఐ ధర్మాసనం సుమోటోగా విచారణ చేపట్టింది. దర్యాప్తు ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించాలని ఎపి హైకోర్టుకు సూచించింది. ఏపీ ప్రభుత్వం తరఫున తెలిపిన సీనియర్ న్యాయవాది లూథ్రా హాజరై ఘటనకు >>2

## ప్రభుత్వ పాఠశాలల్లో 4స్టార్ మౌలిక సదుపాయాలు

ఏజెన్సీ, వెనుకబడిన ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

స్కిల్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యతనివ్వాలి: మంత్రి లోకేష్

కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు ఆదేశాలు



సోమవారం స్కిల్ డెవలప్‌మెంట్, స్కూళ్లలో మౌలిక సదుపాయాలపై అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి లోకేష్

**విజయవాడ, సెప్టెంబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేలా మంత్రి లోకేష్ కీలక లక్ష్యాలు నిర్దేశించారు. 2029 నాటికి అన్ని ప్రభుత్వ పాఠశాలలను 4స్టార్ స్థాయికి, కనీసం వెయ్యి స్కూళ్లను 5స్టార్ స్థాయికి తీసుకెళ్లాలని ఆదేశించారు. ఏజెన్సీ, వెనకబడిన ప్రాంతాల పాఠశాలలతోపాటు స్కిల్ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

**మౌలిక వసతులపై ప్రత్యేక శ్రద్ధ:** పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై మంత్రి లోకేష్ సమీక్ష నిర్వహించారు. ఈ విద్యా సంవత్సరంలో జీరోస్టార్ పాఠశాలలన్నింటినీ వన్‌స్టార్ స్థాయికి చేర్చాలని ఆదేశించారు. యేడాదిలోగా వన్‌స్టార్ స్కూళ్లను టూస్టార్‌కు అప్‌గ్రేడ్ చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1685 స్కూళ్లు వన్‌స్టార్, 15,618 పాఠశాలలు టూస్టార్, 19,099 స్కూళ్లు త్రీస్టార్, 7,172 పాఠశాలలు ఫోర్‌స్టార్ పాఠశాలలు >>2

## పెద్దిరెడ్డికి సుప్రీంలో చుక్కెదురు



బుగ్గమఠం భూముల వ్యవహారంలో జోక్యం చేసుకోం

హైకోర్టు తీర్పును సమర్థించిన ద్విసభ్య ధర్మాసనం

**విజయవాడ, అక్టోబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** వైఎస్సార్‌సిపి నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. బుగ్గమఠం భూముల వ్యవహారంలో హైకోర్టు తీర్పుపై జోక్యానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ వ్యవహారంలో హైకోర్టు తీర్పును సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది. హైకోర్టు తీర్పు ప్రకారం దేవదాయ, ధర్మాదాయ ట్రిబ్యునల్‌కు వెళ్లాల్సిందేనని జస్టిస్ విశ్వనాథన్, జస్టిస్ అరుణ్ పల్లిల ధర్మాసనం స్పష్టం చెప్పింది. వైఎస్సార్‌సిపి ప్రభుత్వ హయాం లో పెద్దిరెడ్డి, ఆయన అనుచరగణం పుంగనూరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల పరిధిలోని అటవీ భూములను >>2

## తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు

రైతుకు సాంకేతికతను చేరువ చేస్తాం

మారుతున్న ఆహార అలవాట్లకు అనుగుణంగా పంటలు-వంగడాల అభివృద్ధి

బాపట్లలో సీఫెట్, వ్యవసాయ యంత్ర పరికరాల వర్క్‌షాప్, శిక్షణ కేంద్రాల ప్రారంభోత్సవ సభలో మంత్రి అచ్చెన్నాయుడు

విద్యార్థులు క్షేత్రస్థాయిలో రైతులకు సలహాలు అందించాలి




సోమవారం బాపట్లలో 'అగ్రికల్చర్ బియాండ్ ఫార్మింగ్' పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి అచ్చెన్నాయుడు

**బాపట్ల, అక్టోబరు 5 ప్రభాతవార్త:** రైతులకు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, పాడి అభివృద్ధి, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, యాంత్రీకరణ, కృత్రిమ మేధ ఆధారిత సేవలు, పంటలకు విలువ జోడింపును సమన్వయం చేసి రైతులకు సాగును లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. సాధారణ రైతులు, చదువుకోని రైతులు సైతం సులభంగా సలహాలు, సహాయ సహకారాలు పొందగలిగేలా సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో బాపట్లలో నూతనంగా ఏర్పాటైన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ పోస్ట్ హార్వెస్ట్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (సిఇపిహెచ్ఇటి-సీఫెట్) ప్రధాన భవనాన్ని, వ్యవసాయ యంత్ర పరికరాల వర్క్‌షాప్, శిక్షణ కేంద్రాన్ని సోమవారం మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. సీఫెట్ ప్రధాన భవనం, వర్క్‌షాప్, శిక్షణ కేంద్రంలోని సౌకర్యాలను పరిశీలించారు. ఇంక్యుబేషన్ సెంటర్‌ను, ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫార్మ్ మెషినరీ అండ్ ఇంప్లిమెంట్స్, పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. అనంతరం బాపట్ల వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన సమావేశంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా 'ఏఎన్‌జిఆర్ఏయు ఇన్నోవేటివ్ కిసాన్ నెట్‌వర్క్‌గా రూపొందించిన ఆంగ్రూ వినూత్న రైతుల నెట్ వర్క్ (ఎఐకెఎన్)ను మంత్రి ప్రారంభించి, దానికి 'రైతు కోసం' అని నామకరణం చేశారు. రైతులకు వ్యవసాయ సలహాలు, సహాయ సహకారాలను సులభంగా అందించేందుకు 'రైతు కోసం' యాప్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. 'రైతు మిత్ర సలహావాణి' ఆర్ఐఏఏ కృత్రిమ మేధ ఆధారిత వాయిస్ ఏజెంట్‌ను, 'అగ్రికల్చర్ బియాండ్ ఫార్మింగ్' పుస్తకాన్ని కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఒకే పట్టణంలో వ్యవసాయ రంగానికి సంబంధించిన మూడు కీలక కళాశాలలు ఉండటం బాపట్లకు గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు. వ్యవసాయ కళాశాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, నేల సారం, చీడపీడల నివారణ, ఆధునిక వంగడాలు, అధిక దిగుబడులపై శాస్త్రవేత్తలు రైతులకు సలహాలు అందిస్తున్నారని వివరించారు. డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల విత్తనం వేసే దశ నుంచి పంట కోత వరకు సాంకేతికత, యాంత్రీకరణ, ఆధునిక పరికరాల రూపకల్పనలో తోడ్పడుతోందన్నారు. >>2

## కదిరిలో దారుణ హత్య

- కుమారుడిని గొడ్డలితో హతమార్చిన తండ్రి
- కొడుకును చంపానని పోలీసులకు ఫోన్
- శ్రీసత్యసాయి జిల్లా పందులకుంటలో ఘటన

3లో

దివ్యాంగురాలిపై అత్యాచారయత్నం

## నిందితుడికి పదేళ్లు జైలు

- రూ.5 వేల జరిమానా విధింపు
- బాధితురాలికి రూ.5 లక్షల ఆర్థిక సాయం
- ఒంగోలు అదనపు జిల్లా సెషన్స్ కోర్టు తీర్పు

## స్థానిక పోరుపై సుప్రీంలో వైసిపి పిటిషన్

అత్యవసర విచారణకు నిరాకరణ

శుక్రవారం విచారణకు వచ్చే అవకాశం

**విజయవాడ, అక్టోబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ వైఎస్సార్సీపీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. "సర్" ప్రక్రియ పూర్తయిన తర్వాతే ఎన్నికల నిర్వహణ ప్రక్రియ చేపట్టాలని పిటిషన్‌లో పేర్కొంది. వార్డుల విభజన చేసుకోవచ్చని అక్టోబరు 1న తీర్పు ఇచ్చిన హైకోర్టు స్థానిక ఎన్నికల నిర్వహణ ప్రక్రియకు అనుకూలంగా తీర్పు ఇచ్చిన >>2

6-10pg2exHMNWJQE.qxd:6-10pg2exHMNWJQE.qxd 1/1/02 8:12 AM Page 1



# మెదడు మిస్టరీపై అధ్యయనం

>> పీటర్ హెగెమాన్ (హంబోల్ట్ యూనివర్సిటీ), జార్జ్ నాజెల్ (వుర్జ్‌బర్గ్ యూనివర్సిటీ) ఈ గౌరవాన్ని దక్కించుకున్నారు. కాంతి ఆధారిత అయాన్ చానెళ్లు, ఆప్టోజెనెటిక్స్‌పై వారు చేసిన అద్భుతమైన ఆవిష్కరణలకు గాను నోబెల్ కమిటీ వారిని ఎంపిక చేసినట్లు సోమవారం ప్రకటించింది. ఈ ఆవిష్కరణ న్యూరోసైన్స్ (నాడీశాస్త్రం) రంగంలో ఒక కొత్త శకానికి నాంది పలికింది. మన మెదడు జ్ఞాపకాలను, భావోద్వేగాలను, ప్రవర్తనలను ఎలా నియంత్రిస్తుందనేది ఎన్నో శతాబ్దాలుగా ఒక పెద్ద మిస్టరీ. 20వ శతాబ్దంలో శాస్త్రవేత్తలు మెదడులోని ఏయే ప్రాంతాలు ఏయే పనులను ప్రభావితం చేస్తాయో పరిశోధించడం మొదలుపెట్టారు. అప్పటి పద్ధతులతో కచ్చితమైన కారణాలను నిర్ధారించడం సాధ్యపడలేదు. వారి వద్ద ఉన్న మెదడు చిత్రం, ఎన్నో ప్రశ్నలతో, ఖాళీలతో నిండిన ఒక చిత్తుపటంగానే మిగిలిపోయింది. అయితే, ఆప్టోజెనెటిక్స్ రాకతో ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. "ఒకప్పుడు కల అనుకున్న మెదడును మ్యాపింగ్ చేసే అవకాశాన్ని ఆప్టోజెనెటిక్స్ సాకారం చేసింది" అని నోబెల్ కమిటీ ఛైర్మన్ పెర్ స్వెన్నింగ్‌సన్ వ్యాఖ్యానించారు. ఈ అద్భుత ఆవిష్కరణకు పునాది వేసింది పీటర్ హెగెమాన్ జిజ్ఞాస. క్లామిడోమోనాస్ అనే ఒకే కణం కలిగిన నాచు (ఆల్గే) కాంతి ఉన్నవైపు ఎలా ఈదగలుగుతోందని ఆయన ఆలోచించారు. 2000ల ప్రారంభంలో, ఆయన తన సహచరుడు జార్జ్ నాజెల్‌తో కలిసి ఆ నాచు కణం ఉపరితలంపై ఛానెల్‌రోడోప్సిన్‌అనే ఒక ప్రత్యేకమైన ప్రొటీన్‌ను కనుగొన్నారు. దీనిపై నీలి రంగు కాంతి పడినప్పుడు, ఆ ప్రొటీన్‌లో ఒక మార్గం (ఛానెల్) తెరుచుకుని, అయాన్లు కణం లోపలికి ప్రవహించి ఒక విద్యుత్ సంకేతాన్ని సృష్టిస్తాయని వారు గుర్తించారు. ఈ ప్రొటీన్‌ను ఏ కణంలో ప్రవేశపెట్టినా, ఆ కణం కాంతికి స్పందించేలా మారుతుందని నిరూపించారు. ఈ పరిశోధనను కార్ల్ డీస్సెరొత్ మరో స్థాయికి తీసుకెళ్లారు. ఆయన ఛానెల్‌రోడోప్సిన్ జన్యువును ఎలుకల మెదడులోని నరాల కణాలలోకి ప్రవేశపెట్టారు. ఆ తర్వాత వాటిపై నీలి కాంతిని ప్రసరింపజేసి, నరాల సంకేతాలను విజయవంతంగా ప్రేరేపించగలిగారు. 2005లో ఆయన ఈ ప్రయోగాన్ని ప్రచురించగా, రెండేళ్ల తర్వాత 2007లో బతికున్న ఎలుకల మెదడులో ఈ కాంతి ఆధారిత స్విచ్ పనిచేసేలా చేసి సంచలనం సృష్టించారు. ప్రస్తుతం ఆప్టోజెనెటిక్స్ అని పిలుస్తున్న ఈ పద్ధతి ప్రపంచవ్యాప్తంగా వేగంగా ప్రాచుర్యం పొందింది. దీనిని ఉపయోగించి పరిశోధకులు నిర్దిష్ట జ్ఞాపకాలు, భయం, ఆనందం వంటి భావోద్వేగాలు, ప్రవర్తనలను నియంత్రించే నాడీ వలయాలను (న్యూరల్ సర్క్యూట్స్) ఛేదిస్తున్నారు. ఇది మానసిక, నాడీ సంబంధిత వ్యాధులపై మన అవగాహనను పెంచుతోంది. వైద్య రంగంలో, దృష్టి లోపం ఉన్నవారికి తిరిగి చూపును అందించే ప్రయత్నాలలో ఈ పద్ధతిపై ప్రయోగాలు జరుగుతున్నాయి. ఆప్టోజెనెటిక్స్ ఆవిష్కరణ మన మెదడుపై ఉన్న అవగాహనను సమూలంగా మార్చేసింది. ఈ సాంకేతికత సాయంతో ప్రతిరోజూ కొత్త ఆవిష్కరణలు వెలుగులోకి వస్తూ, మానవాళి ముందున్న అతిపెద్ద రహస్యాలలో ఒకటైన మన మెదడు పనితీరును అర్థం చేసుకోవడానికి మార్గం సుగమం చేస్తున్నాయి.

# 15యేళ్లలో 100 బి.డాలర్ల స్విస్ పెట్టుబడులు

>> దం (టిఇపిఎ) కింద ఆర్థిక సహకారంలో పెరుగుతున్న వేగాన్ని ఇద్దరు నాయకులు గుర్తించారు. ఆవిష్కరణల ఆధారిత భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లడానికి తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు. రవాణా, చలనశీలత, మౌలిక సదుపాయాలు, వలసలు, చలనశీలత, యువ నిపుణుల రంగాలను కొత్త ఒప్పందాలు, కార్యక్రమాలు కవర్ చేస్తాయి. ఈ చర్చల ఫలితంగా ఆరోగ్యం, స్వచ్ఛ ఇంధనం, అంతరిక్షం రంగాలను కవర్ చేస్తూ కొత్త ఉమ్మడి పరిశోధన కార్యక్రమాలు కూడా ప్రారంభమయ్యాయి. ప్రధాని మోడీ, అధ్యక్షుడు పార్మెలిన్ శాంతి, దౌత్యం, ప్రపంచ సంస్థల సంస్కరణల పట్ల తమ నిబద్ధతను పునరుద్ఘాటించడంతో పాటు, ద్వైపాక్షిక, ప్రాంతీయ, అంతర్జాతీయ సమస్యలపై కూడా అభిప్రాయాలను పంచుకున్నారు.

భారత్- స్విట్జర్లాండ్ స్నేహం శతాబ్దాల నాటిదని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కొనియాడారు. కీలక రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పటి ష్టం చేసేలా అవగాహన ఒప్పందాలు చేసుకున్నారు. రాబోయే 15యేళ్లలో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు, పది లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలు లక్ష ్యంగా ప్రతిష్టాత్మక ఆర్థిక రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించారు. స్విస్ అధ్యక్షుడు గై పార్మెలిన్‌తో ద్వైపాక్షిక చర్చల అనంతరం నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో ప్రధాని మోడీ ఈ మేరకు ప్రకటన చేశారు. "టిఇపిఎ కింద, నాలుగు ఇఎఫ్‌టిఎ దేశాలైన స్విట్జర్లాండ్, నార్వే, ఐస్‌లాండ్, లీచ్‌టెన్‌స్టైన్, 15సంవత్సరాలలో భారతదేశంలో 100 బిలియన్ల పెట్టుబడులను సులభతరం చేయడానికి కట్టుబడి ఉన్నాయి. దీని ద్వారా 10 లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలు సృష్టించబడే అవకాశం ఉంది. ఈ గణాంకాలు ఇప్పటికే అందిన పెట్టుబడులను లేదా సృష్టించబడిన ఉద్యోగాలను కాకుండా, ఒప్పందం దీర్ఘకాలిక లక్ష్యాన్ని సూచిస్తాయి. ఈ ఒప్పందం పెట్టుబడి, ఆవిష్కరణ, ఉద్యోగాలు, పరస్పర శ్రేయస్సు ప్రతిష్టాత్మక ప్రణాళిక్ష అని మోడీ అభివర్ణించారు. ఇది ఒక యూరోపియన్ ఆర్థిక కూటమితో భారతదేశం కుదుర్చుకున్న మొట్టమొదటి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ "ఆరోగ్యం, స్వచ్ఛ ఇంధనం, అంతరిక్షం వంటి ప్రాధాన్యతా రంగాలలో త్వరలో కొత్త ఉమ్మడి పరిశోధన ప్రాజెక్టులను ప్రారంభించబోతున్నందుకు చాలా సంతోషిస్తున్నా. భారతదేశంలోని సైన్స్ స్టార్టప్‌ల సామర్థ్యాన్ని పెంపొందించడానికి జ్యూరిచ్ విశ్వవిద్యాలయంతో కుదిరిన ఒప్పందాన్ని కూడా స్వాగతిస్తున్నాము. అక్టోబరు 7న, భారతదేశం- యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ (ఇఎఫ్‌టిఎ) వ్యాపార నాయకులతో కలిసి భారతదేశం ఒక "శ్రేయస్సు సదస్సు"ను నిర్వహిస్తోంది. మన వాణిజ్య, పెట్టుబడి భాగస్వామ్యం వాగ్దానాన్ని స్పష్టమైన ఫలితాలుగా మార్చడానికి ఈ సదస్సు ఒక ముఖ్యమైన వేదికగా ఉపయోగపడుతుంది" అని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అభిప్రాయపడ్డారు.

**ఉక్రెయిన్, ఐక్యరాజ్యసమితి సంస్కరణలపై చర్చ:** అంతర్జాతీయ సంఘర్షణలు, రోజురోజుకూ ముక్కలవుతున్న ప్రపంచంలో దౌత్యం పాత్ర గురించి కూడా నాయకులు చర్చించారు. "అనేక సంఘర్షణ కేంద్రాలు, ముఖ్యంగా ఉక్రెయిన్‌లో యుద్ధం కూడా చర్చనీయాంశాలుగా ఉన్నాయ్ను అని పార్మెలిన్ సంయుక్త పత్రికా సమావేశంలో తెలిపారు. ఐక్యరాజ్యసమితి, బహుళపక్ష సంస్కరణలు, అంతర్జాతీయ దౌత్యానికి ఒక వేదికగా జెనీవా పాత్ర వంటి అంశాలపై చర్చలు జరిగాయని ఆయన చెప్పారు. అనేక ప్రపంచ సమస్యలపై భారత్, స్విట్జర్లాండ్‌ల మధ్య ఏకాభిప్రాయం ఉందని కూడా ఆయన పేర్కొన్నారు.

# సస్పెండ్ చేయలేం

>> కాకుండా, ముగ్గురు సభ్యుల కమిషన్ సంయుక్తంగా వినియోగించేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్లు తమ పిటిషన్‌లో కోరారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు నోటీసులతో ఈ వ్యవహారంపై కేంద్రం, ఈసీ ఎలాంటి వివరణ ఇస్తాయనేది ఆసక్తికరంగా మారింది.

**ఫారమ్-6లో మార్పులకు మా ఆమోదంలేదు:** కొత్త ఓటర్ల నమోదు కోసం ఎన్నికల సంఘం (ఈసీ) వినియోగించే ఫారం 6లో ఎలాంటి సవరణలకు తాము ఆమోదం తెలుపలేదని సుప్రీంకోర్టు సోమవారం స్పష్టం చేసింది. అయితే ఈ మార్పులు ఎవరు చేశారో నిర్ధారించేందుకు సంబంధిత రికార్డులను తాము పరిశీలిస్తామని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్య కాంత్ తెలిపారు. సవరించిన ఫారం 6కు తాము ఆమోదం తెలుపలేదని, ఈ విషయంలో చాలా స్పష్టంగా ఉన్నామని ఆయన చెప్పారు. ఆ రికార్డులను సుప్రీంకోర్టుకు సమర్పించినప్పుడు ఫారం 6లో ఎవరు మార్పులు చేశారో మేము చూడాలనుకుంటున్నాం అని ఆయన అన్నారు. మిగతా ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఏకాభిప్రాయం లేకుండా ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారన్న ఆరోపణలపై ఆయనను సస్పెండ్ చేస్తూ ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. తమకు స్పందన అందేంత వరకు ఈసీ నిర్ణయాలు చట్టానికి అనుగుణంగానే ఉన్నాయని తాము భావిస్తామని ధర్మాసనం పేర్కొంది. ఆ నివేదిక కచ్చితమైనది కావచ్చు, కాకపోవచ్చు. కానీ దాని ఆధారంగా మేము ఉత్తర్వులు జారీ చేయలేం. మేము వారి స్పందన కోసం వేచి ఉండాలని సీజేఐ సూర్య కాంత్ పేర్కొన్నారు. మరోవైపు ఫారం 6 అనేది ఓటర్ల నమోదు నియమావళి 1960లో ఒక భాగం. దీనిని కేవలం ఒక సవరణ ద్వారా మాత్రమే మార్చడం సాధ్యమవుతుంది. అయితే ఫారం 6కు ఒక అనుబంధ పత్రం జతచేయాలని 2025లో ఈసీ పేర్కొంది. ఓటరు జాబితాల సవరణ ప్రక్రియ (సర్)లో భాగంగా కొత్త ఓటర్లు తమ తల్లిదండ్రులు లేదా తాత, నానమ్మలు లేదా తాత, అమ్మమ్మల గత ఓటర్ల జాబితాలతో అనుసంధానించే వివరాలను అందించాలని కోరడం వివాదస్పదమైంది. అయితే తమకు తెలియకుండా లేదా తమ సిఫార్సు లేకుండా ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ (సర్), ఫారం 6 సవరణకు సంబంధించి సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారని, ఉత్తర్వులు జారీ చేశారంటూ ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి ఆరోపించినట్లు ఆంగ్ల దినపత్రిక వార్తా కథనాన్ని ప్రచురించింది.

ఆ ఇద్దరు ఎన్నికల కమిషర్లు గత 10 నెలల్లో కనీసం 14 సార్లు రికార్డుల్లో తమ అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో "సర్ ప్రక్రియపై వివాదం తారాస్థాయికి చేరింది. సెప్టెంబర్ 28న ఈ వివాదంపై ఈసీ స్పందించింది. ఫారం 6 సవరణకు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపినట్లు పేర్కొంది. అలాగే జతచేయాల్సిన డిక్లరేషన్‌ను కూడా సుప్రీంకోర్టు సమర్థించినట్లు ఈసీ వెల్లడించింది. అయితే ఫారం 6లో ఎలాంటి సవరణలకు తాము ఆమోదం తెలుపలేదని సుప్రీంకోర్టు సోమవారం స్పష్టం చేసింది. ఈ మార్పులు ఎవరు చేశారో నిర్ధారించేందుకు సంబంధిత రికార్డులను తాము పరిశీలిస్తామని సీజేఐ సూర్య కాంత్ పేర్కొన్నారు.

# పెద్దిరెడ్డికి సుప్రీంలో చుక్కెదురు

>>పెద్ద ఎత్తున ధ్వంసం చేశారన్న ఆరోపణలు, ఫిర్యాదులున్నాయి. ప్రధానంగా తన కుటుంబ సంస్థ పిఎల్ఆర్ కన్‌స్ట్రక్షన్స్‌కు లబ్ధి చేకూర్చేందుకు రక్షిత అటవీ ప్రాంతాల్లో ఇష్టానుసారంగా రోడ్లు వేయించి బిల్లులు చేయించుకున్నారనే ఆరోపణలున్నాయి. తిరుపతి జిల్లా ఎమ్మార్‌పల్లి పరిధిలోని బుగ్గమఠానికి చెందిన సర్వే నంబరు 261/1లో 1.50 ఎకరాలు, 261/2లో 2.38 ఎకరాలు మొత్తం 3.88 ఎకరాలను పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారనేది అభియోగం. దాంతో వాటిని పది రోజుల్లో ఖాళీ చేయాలంటూ మఠం అసిస్టెంట్ కమిషనర్ 2025 మే 16న ఉత్తర్వులిచ్చారు. వాటిని సవాల్ చేస్తూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఇఒ ఉత్తర్వులపై అభ్యంతరాలుంటే నాలుగు వారాల్లోగా ఎండోమెంట్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించడానికి ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన నాలుగు వారాల గడువును మరో నాలుగు వారాలకు పెంచింది. ఆ నాలుగు వారాల పాటు యథాతథ స్థితి కొనసాగించాలని ఆదేశిస్తూ తీర్పు వెలువరించింది. ఆ తీర్పును సవాల్ చేస్తూ పెద్దిరెడ్డి సుప్రీంకోర్టులో ఎస్ఎల్‌పి దాఖలు చేశారు. విచారించిన ధర్మాసనం హైకోర్టు ఆదేశాలను ఎండోమెంట్ ట్రైబ్యునల్‌లో అప్పీల్ చేసుకోవాలని, అప్పటివరకూ పిటిషనర్‌కు వ్యతిరేకంగా బుగ్గమఠం యాజమాన్యం కఠిన చర్యలు తీసుకోరాదని ఏకసభ్య ధర్మాసనం ఈ ఏడాది మే 7న ఉత్తర్వులిచ్చింది. దాన్ని సవాల్ చేస్తూ ఆయన డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించగా అక్కడా అదే తీర్పు వెలువడింది. ఈ క్రమంలో పెద్దిరెడ్డి సుప్రీం కోర్టును ఆశ్రయించి భంగపడ్డారు.

# స్థానిక పోరుపై సుప్రీంలో వైసిపి పిటిషన్

>> సంగతి తెలిసిందే. ఎన్నికల నిర్వహణకు హైకోర్టు పచ్చజెండా ఊపడంపై సవాల్ చేస్తూ, సోమవారం ఉదయం పిటిషన్ దాఖలు చేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను ప్రతివాదిగా చేర్చింది. పిటిషన్ దాఖలు చేసి వెంటనే వైఎస్సార్సీపీ తరపు న్యాయవాది సిజెఐ కోర్టులో మెన్షన్ చేశారు. ఇదే తీర్పులో మరో పిటిషన్ కూడా దాఖలైందని ధర్మాసనం పేర్కొంది. ఈ పిటిషన్ ఈ వారంలోనే శుక్రవారం విచారణకు వచ్చే అవకాశం ఉందని, ఆలోపే విచారణకు తీసుకోవాలని వైఎస్సార్సీపీ తెలిపిది. ఏ క్షణంలోనైనా ఎన్నికల షెడ్యూల్ విడుదలకు అవకాశం ఉందని న్యాయవాది పేర్కొన్నారు. వెంటనే విచారణ చేపట్టాలని కోరగా పరిశీలిద్దామని సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. వార్డుల సరిహద్దులు ఫ్రీజ్ కావు అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

## సుమోటాగా సుప్రీం విచారణ

>> సంబంధించిన వివరాలను చేపట్టిన సహాయచర్యలను కోర్టుకు వివరించారు. ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేశామని ఎఫ్ఎస్ఎల్ నివేదిక కోసం ఎదురుచూస్తున్నట్లు లూథ్రా తెలిపారు. మాత్రలు వేసుకున్న ఇతర 52 మందికి పూర్తి వైద్య పరీక్షలు నిర్వహించామని మిగిలిన వారంతా సురక్షితంగా ఉన్నారని ధర్మాసనానికి తెలియజేశారు. కేసు దర్యాప్తును ఏపి హైకోర్టు పర్యవేక్షించాలని సిజెఐ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. పత్రికల్లో వచ్చినట్లు కాకుండా ఒక్క పాప మాత్రమే చనిపోయిందని మిగిలిన 52 మంది గిరిజనులు క్షేమంగా ఉన్నారని లూథ్రా స్పష్టత ఇచ్చారు.



సోమవారం బాపట్ల సభలో ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

# తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు

>>టెక్నాలజీ కళాశాల రైతులు పండించిన పంటలను నేరుగా విక్రయించడానికే పరిమితం కాకుండా, వాటికి విలువ జోడించి మార్కెట్ చేసుకునేందుకు సహకరిస్తోందని తెలిపారు. ఈ మూడు విభాగాల అనుసంధానంతో రైతులకు ప్రయోజనం చేకూర్చాలని సూచించారు. మారుతున్న ఆహార అలవాట్లకు అనుగుణంగా పంటలను, వంగడాలను అభివృద్ధి చేయాలని మంత్రి శాస్త్రవేత్తలకు సూచించారు. పాత పద్ధతుల్లోనే వ్యవసాయం కొనసాగిస్తే రైతులు నష్టపోయే పరిస్థితులు ఉంటాయని పేర్కొన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ప్రాధాన్య వంగడాలపై ప్రత్యేక దృష్టి సారించి, రైతులకు ఆర్థిక లబ్ధి చేకూరేలా చూడాలని చెప్పారు. ఆయా వంగడాలను అందుబాటులోకి తీసుకువచ్చి, వాటి సాగుకు రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

యాంత్రీకరణ, కృత్రిమ మేధపై దృష్టి సారించి రైతుల సమస్యలకు పరిష్కారాలు చూపే ఆవిష్కరణలు చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. విశ్వవిద్యాలయం మంచి పరిశోధనలు చేస్తోందని ప్రశంసించారు. పరిశోధనలు, నూతన ఆవిష్కరణల అభివృద్ధికి విశ్వవిద్యాలయ ఉపకులపతికి, శాస్త్రవేత్తలకు ప్రభుత్వం తరఫున పూర్తి ప్రోత్సాహం, సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆధార్ లేదా గుర్తింపు వివరాలతో సమస్యను తెలియజేస్తే పరిష్కారాన్ని పొందగలిగే స్థాయికి ఆధునిక సాంకేతికత, కృత్రిమ మేధ అభివృద్ధి చెందాయని మంత్రి వ్యాఖ్యానించారు. ఈ అవకాశాలను వ్యవసాయ రంగంలో ఉపయోగించుకోవాలని సూచించారు. గత ఐదేళ్లలో నిర్వీర్యమైన వ్యవసాయ, నీటిపారుదల రంగాలకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఉచిత విత్తనాల పంపిణీ, సకాలంలో విత్తనాల సరఫరా, భూసార పరీక్షలు, వ్యవసాయ యాంత్రీకరణ, విపత్తుల సమయంలో నష్టపరిహారం వంటి చర్యలతో రైతులకు అండగా నిలుస్తున్నామని తెలిపారు. ఉద్యాన రంగ అభివృద్ధికి మదనపల్లెలో ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో రూ.1,00,000 కోట్ల ప్రాజెక్టును ప్రారంభించినట్లు మంత్రి పేర్కొన్నారు.

విద్యార్థులు తరగతి గదులకే పరిమితం కాకుండా నిరంతరం క్షేత్రస్థాయిలో ఉంటూ రైతులకు సలహాలు అందించాలన్నది ముఖ్యమంత్రి ఆకాంక్ష అని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గినా నీటిని ఆదా చేసుకుంటూ సాగు కొనసాగించేలా సూ సాగునీటి విధానాలను ప్రోత్సహిస్తున్నామని, డ్రిప్, స్ప్రింక్లర్ల వినియోగాన్ని పెంచేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఈ సమావేశంలో బాపట్ల జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ డా. వి. వినోద్‌కుమార్, బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు, పరచూరు శాసనసభ్యులు వై. సాంబశివరావు, చీరాల శాసనసభ్యులు ఎం. మాలకొండయ్య యాదవ్, విశ్వవిద్యాలయ ఉపకులపతి డా. పి.వి. సత్యనారాయణ, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, ఆప్కో చైర్మన్ సజ్జా హేమలత, రైతులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నుంచే బరిలోకి: దానం నాగేందర్ వెల్లడి

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), అక్టోబరు 5, ప్రభాతవార్త:** ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో తాను కాంగ్రెస్ పార్టీ నుంచే బరిలోకి దిగుతానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పష్టం చేశారు. కుందన్‌బాగ్‌లో, మెథడిస్ట్ కాలనీ, ఉమానగర్ కాలనీలో ఆయన పర్యటించి అక్కడ నిర్వహించిన కార్యక్రమాలలో పాల్గొన్నారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కని దానిని తొలగించే హక్కు ఎవరికి లేదన్నారు. ఓటు హక్కును తొలగించడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. దేశ వ్యాప్తంగా ఓటు చోరీ జరిగిందని అన్ని పార్టీలు, ప్రముఖులు, సీజేపీ తదితర సంస్థలు ఆందోళన చేస్తున్నాయన్నారు. దానిపైన స్పందించాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు ఉందో లేదో పరిశీలించుకోవాలన్నారు. ఓటు విషయంలో నియోజకవర్గంలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. నియోజకవర్గంలోని ఒక డివిజన్‌లో సుమారు 17వేలు ఓట్లు తొలగించారన్నారు. ఎన్నికల కమిషన్ దీనిపై దృష్టి సారించాలన్నారు. తాను కాంగ్రెస్ నుంచి పార్లమెంటు సభ్యుడిగా కొట్లాడాను కాబట్టి అనర్హత వేటుకు గురయ్యానని అన్నారు. ఇలాంటి పరిస్థితి వస్తుందని ముందే తెలిసి ఎంపీ ఎన్నికల్లోద్యం చేశానని అన్నారు. తనకు చట్టం తెలుసని, రాజ్యాంగం గురించి అవగాహన ఉందన్నారు. విజయారెడ్డి వేసిన పిటీషన్‌పై ఆయన స్పందిస్తూ అనర్హత వేటు వేయడంతోపాటు, ఉప ఎన్నికలకు వెళ్లమని సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. ఈ వ్యవహారంలో కోర్టులో పిటీషన్ వేయడం అర్థరహితమన్నారు. పిటీషన్ వేసే ముందు సమగ్రంగా పిటీషన్ గురించి తీర్పు గురించి తెలుసుకోవాలన్నారు. ఆమె వేసిన అఫిడవిట్ పిటీషన్‌పై అవసరమైతే పిటీషన్ వేస్తామన్నారు. ఇక తాను కాంగ్రెస్ పార్టీ నుంచే బరిలోకి దిగుతానని అన్నారు. ఉప ఎన్నికల్లో గెలిచి సత్తా చాటుతామని, ఎవరు కొడితే ఎలా ఉంటుందో చూపిస్తానంటూ స్పష్టం చేశారు. దానం వెంట మాజీ కార్పొరేటర్ వనం సంగీతయాదవ్, కాంగ్రెస్ నేతలు వనం శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ

**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో బర్డ్‌ఫ్లూ కలకలం రేకెత్తిస్తుండటంతో రాష్ట్ర అధికారులు అప్రమత్తమయ్యారు. పక్క రాష్ట్రాల నుండి తెలంగాణకు వస్తున్న కోళ్ల ద్వారా బర్డ్‌ఫ్లూ వ్యాపించే ప్రమాదం ఉండటంతో వాటిని నియంత్రించే దిశగా రాష్ట్ర పశుసంవర్ధక శాఖ అధికారులు ఆలోచన చేస్తున్నారు. పక్క రాష్ట్రంలోని అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం సిద్ధరాంపురంలో బర్డ్ ఫ్లూ కలకలం రేపింది. ఓ కోళ్ల ఫామ్‌లో 2 వేలకు పైగా కోళ్ల మృతి చెందడంతో అధికారులు నమూనాలను పరీక్షలకు పంపారు. భోపాల్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజెస్ ల్యాబొరేటరీలో బర్డ్ ఫ్లూ పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో అక్కడి అధికారులు అప్రమత్తమయ్యారు. విజయవాడ నుంచి వెళ్లిన ప్రత్యేక అధికారుల బృందం క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టింది.

### వారం - వర్జ్యం

06-10-2026, మంగళవారం,
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, కృష్ణపక్షం, హస్తకార్తె,
తి. ఏకాదశి రా.12.36,
న. ఆశ్లేష రా.10.19,
వ.ఉ .11.31 -మ.1.03,
దు.ఉ.8.21- ఉ.9.09,2)రా.10.36-రా.11.27,
రాహు. మ.3.00- మ.4.30,
శుభ. స. ఉ.7.00 - ఉ .8.00.

### వార్తాఫలం

**మేషం :** బ్యాంక్ లావాదేవీల పైన ప్రత్యేక దృష్టిని సారిస్తారు. దూరప్రాంత విషయాలు సానుకూల దిశలో ఉంటాయి.

**వృషభం :** మీరంటే ఇష్టం లేని వారు మిమ్మల్ని నిందారోపణలకు గురి చేస్తారు. సంతాన విషయమై ఆలోచనలు చేస్తారు.

**మిథునం :** కొత్త వ్యక్తులు పరిచయమై నూతన వ్యాపారాలకు శ్రీకారం చుడతారు. చర్చలు సఫలం. ప్రయాణాలు

**కర్కాటకం :** సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు. శుభవార్తలు వింటారు. విద్య, ఉద్యోగావకాశాలు వుంటాయి.

**సింహం :** వర్గ రాజకీయాలను సమర్థవంతంగా నడుపుతారు. జీవిత భాగస్వామి సలహాలను పాటిస్తారు.

**కన్య :** ఆత్మస్థైర్యం కొండంత అండగా నిలుస్తుంది. ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

**తుల :** కొత్త పనులకు శ్రీకారం చుడతారు. ఇంటర్వ్యూలలో పాల్గొంటారు. బంధువుల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**వృశ్చికం :** నూతన ఉద్యోగ ప్రాప్తి. సంఘంలో ఆదరణ లభిస్తుంది. వ్యవహారాలల్లో విజయం సాధిస్తారు.

**ధనుస్సు :** గృహ నిర్మాణ ఆలోచనలు సాగిస్తారు. వ్యాపారాలలో స్వల్ప మార్పులు ఉంటాయి. పనుల్లో ఆటంకాలు.

**మకరం :** ఉద్యోగాలలో స్వల్పమార్పులు. పనులు నిదానంగా పూర్తి చేస్తారు. కుటుంబ సభ్యులను కలిసి ఉల్లాసంగా గడుపుతారు.

**కుంభం :** దూరప్రాంతాల నుండి కీలక సమాచారం అందుతుంది. ఆస్తి వివాదాలు పరిష్కారమై లబ్ధి పొందుతారు.

**మీనం :** స్వయం కృతాపరాధాలు చోటు చేసుకుంటాయి. చెల్లించవలసిన ఇన్స్టాల్మెంట్ వాయిదా వేస్తారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఆకాశంలో హైటెన్షన్

## హఠాత్తుగా 28వేల అడుగులు కిందకు దిగిన విమానం

## లండన్ నుంచి చికాగో వెళ్తుండగా ఆందోళనకర పరిణామం

**లండన్, అక్టోబరు 5:** లండన్ నుంచి అమెరికాలోని చికాగోకు వెళ్తున్న బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానం సోమవారం ఐర్లాండ్ గగనతలంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. విమానం ఒక్కసారిగా సుమారు 28వేల అడుగుల మేరకు కిందికి దిగినట్లు ఫ్లైట్ ట్రాకింగ్ డేటా వెల్లడించింది. బ్రిటిష్ ఎయిర్‌వేస్‌కు చెందిన బిఎ295 విమానం లండన్ హీత్రో విమానాశ్రయం నుంచి చికాగో ఓహేర్‌కు వెళ్తోంది. ఐర్లాండ్ మీదుగా ప్రయాణిస్తున్న సమయంలో విమానం అంతర్జాతీయ అత్యవసర ట్రాన్స్‌పాండర్ కోడ్ 7700ను స్క్వాక్ చేసినట్లు సమాచారం. బోయింగ్ 777-200ఈఆర్ రకం ఈ విమానం జీ7-ఎ రిజిస్ట్రేషన్‌తో ఉంది. ఉదయం సుమారు 11.50 గంటలకు లండన్ హీత్రో విమానాశ్రయంలోని టెర్మినల్5 నుంచి బయలుదేరింది. సుమారు 8 గంటల 40 నిమిషాల ప్రయాణంతో చికాగో వైపు వెళ్తోంది. ఫ్లైట్ ట్రాకింగ్ డేటా ప్రకారం, విమానం మొదట సుమారు 37,000 అడుగుల ఎత్తుకు చేరుకుంది. అనంతరం ఐర్లాండ్ మీదుగా ప్రయాణిస్తున్న సమయంలో వేగంగా దిగుతూ దాదాపు 9,000 అడుగుల ఎత్తుకు చేరుకుంది. బిఎ295 విమానం తిరిగి లండన్ హీత్రో విమానాశ్రయం వైపు మళ్లినట్లు తెలుస్తోంది. దీంతో చికాగో ప్రయాణాన్ని విమానం మధ్యలోనే నిలిపివేసినట్లు భావిస్తున్నారు. అత్యవసర పరిస్థితికి అసలు కారణం ఏమిటన్నది వెంటనే స్పష్టంగా తెలియలేదు. అట్లాంటిక్ సముద్రం మీదుగా ప్రయాణం ప్రారంభించిన సుమారు గంట తర్వాత విమానం వేగంగా కిందికి దిగడం ప్రారంభించినట్లు సమాచారం. విమానంలో తలెత్తిన సమస్య స్వరూపానికి సంబంధించి మరిన్ని వివరాలు వెంటనే అందుబాటులోకి రాలేదు. ఈ ఘటనపై బ్రిటిష్ ఎయిర్‌వేస్ కూడా వెంటనే ఎలాంటి వివరాలను వెల్లడించలేదు. విమానం ఎందుకు దారి మళ్లించిందన్న విషయాన్ని కూడా సంస్థ అధికారికంగా ధ్రువీకరించలేదు. 7700 ట్రాన్స్‌పాండర్ కోడ్ అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన అత్యవసర సంకేతం. విమానంలో సాధారణ అత్యవసర పరిస్థితి తలెత్తినప్పుడు పైలట్లు ఈ కోడ్‌ను ఉపయోగించి ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లకు సమాచారం అందిస్తారు. పైలట్ విమానం ట్రాన్స్‌పాండర్‌లో 7700 కోడ్‌ను నమోదు చేసినప్పుడు, అది ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ల రాడార్ స్క్రీన్‌పై కనిపిస్తుంది. దీంతో విమానానికి అత్యవసర ప్రాధాన్యతతో మార్గనిర్దేశం లేదా ఇతర సహాయం అవసరమని కంట్రోలర్లు వెంటనే గుర్తిస్తారు. అయితే 7700 కోడ్ ద్వారా అత్యవసర పరిస్థితి ఏరకమైనదో ప్రత్యేకంగా తెలియదు. అది ప్రయాణికుడికి సంబంధించిన వైద్య అత్యవసర పరిస్థితి కావచ్చు, సాంకేతిక లోపం కావచ్చు, తీవ్రమైన వాతావరణ పరిస్థితి కావచ్చు లేదా తక్షణ సహాయం అవసరమైన మరేదైనా సమస్య కావచ్చు.

# 4స్టార్ మౌలిక సదుపాయాలు

>>ఉన్నట్లు అధికారులు వివరించారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని పాఠశాలల మౌలిక వసతులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి సూచించారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 లీప్ స్కూళ్లను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పాఠశాలల మౌలిక సదుపాయాల పురోగతికి డిఇఒలు, ఎంఇఒలు, సిఆర్‌పిలకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు.

**5 లక్షల మంది విద్యార్థులకు శిక్షణ:** రాష్ట్రంలోని 7 వేల హైస్కూళ్లలో పూర్తిస్థాయి కంప్యూటర్ ల్యాబ్‌లు, అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల ఏర్పాటుపై దృష్టి పెట్టాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. అకడమిక్ సంస్కరణలు పూర్తయినందున ఇక అధికారులు, ఉపాధ్యాయులు పూర్తిగా అభ్యసన ఫలితాల మెరుగుదలపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించడంపై మంత్రి ప్రత్యేకంగా దృష్టి సారించారు.

**స్కిల్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి:** కేంద్ర ప్రభుత్వ స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం ఆధీనంలోని ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం ద్వారా విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. రాష్ట్రంలో ఈ యేడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ లక్ష్యంగా అధికారులు పనిచేయాలన్నారు. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ స్కీం వంటి పథకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రతి నిరుద్యోగ యువతీయువకులను నైపుణ్యం పోర్టల్‌లోకి తీసుకువచ్చి, ఏఐ విద్య ద్వారా వారికి ఇంటర్వ్యూలు నిర్వహించాలని సూచించారు. సీడాప్, ఓంక్యాప్‌ల ద్వారా జర్మన్, జపనీస్ వంటి భాషల్లో శిక్షణ ఇచ్చి విదేశాల్లో ఉద్యోగావకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో మానవ వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు, మౌలిక సదుపాయాలు, ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా, రాష్ట్ర విద్య, మౌలిక సదుపాయాల సంస్థ ఎండి దీవెన్ రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ సిఇఒ నారాయణస్వామి పాల్గొన్నారు.

## అంతర్జాతీయ అస్ట్రానమీ ఒలింపియాడ్-2026లో

# నారాయణ విద్యార్థుల ప్రభంజనం

## భారత్‌కు మూడు స్వర్ణ పతకాలు అందించి అబ్బురపరచిన నారాయణ స్కూల్స్ విద్యార్థులు !



**హైదరాబాద్, అక్టోబరు5, ప్రభాతవార్త:** వియత్నాంలోని హనోయ్ నగరంలో ఘనంగా నిర్వహించిన 19వ అంతర్జాతీయ ఆస్ట్రానమీ, ఆస్ట్రో ఫిజిక్స్ ఒలింపియాడ్ (ఐఒఎఎ-2026) పోటీలలో భారత జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించిన నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు అద్భుత ప్రతిభకనబరిచి దేశానికి మూడు బంగారు పతకాలను అందించారు. ఈ అంతర్జాతీయ పోటీలలో భారత్ నుంచి ప్రాతినిధ్యం వహించిన ఐదుగురు సభ్యుల బృందంలో ముగ్గురు నారాయణ పాఠశాలల విద్యార్థులే కావడం విశేషం. వీరిలో అక్షత్ శ్రీవాస్తవ (గురుగ్రామ్), ప్రాంజల్ దీక్షిత్ (హైదరాబాద్), మరియు సుమంత్ గుప్తా (మొహాలి) తమ అసాధారణ ప్రతిభతో ముగ్గురూ స్వర్ణ పతకాలను కైవసం చేసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా 64 దేశాలు పాల్గొన్న ఈ ప్రతిష్టాత్మక పోటీలలో నారాయణ విద్యార్థుల విశేష కృషితో భారత్ సంయుక్తంగా మూడో స్థానాన్ని కైవసం చేసుకుని అంతర్జాతీయ స్థాయిలో దేశ ఖ్యాతిని చాటిచెప్పారు. ఈ సందర్భంగా నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ పి. సింధూర నారాయణ మాట్లాడుతూ ఐదుగురు సభ్యులతో కూడిన భారత జట్టులో పాల్గొన్న ముగ్గురు నారాయణ విద్యార్థులూ స్వర్ణ పతకాలు సాధించడం నారాయణ సంస్థకే కాకుండా యావత్ భారతదేశానికే గర్వకారణమన్నారు. విద్యార్థులలో క్రమశిక్షణ, నిరంతర సాధన, అభ్యాసం పట్ల మక్కువను పెంపొందించడం ద్వారానే ఇలాంటి విజయాలు సాధ్యమవుతున్నాయన్నారు. గత 17 ఏళ్లుగా అనుభవం, నైపుణ్యం, ఆత్మీయత అనే పునాదులపై నిర్మితమైన నారాయణ ప్రత్యేక ఒలింపియాడ్ శిక్షణ విధానం విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ స్థానాల్లో నిలబెడుతోందన్నారు. విద్యార్థుల ప్రతిభకు సరైన మార్గదర్శకత్వం తోడైతే ఎలాంటి విజయాలనైనా సాధించవచ్చని అక్షత్, ప్రాంజల్, సుమంత్ నిరూపించారన్నారు.

6-10Pg3exHMNWJQEKOC.qxd:6-10Pg3exHMNWJQEKOC.qxd 1/1/02 8:13 AM Page 1



# ప్రతి ఇంటికీ స్వచ్ఛ జలం



ప్రొద్దుటూరులో 'అమరజీవి జలధార' పనులకు సంబంధించి పైలాన్‌లను ఆవిష్కరించిన సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్‌కల్యాణ్, బిజెపి చీఫ్ మాధవ్, మంత్రులు నారాయణ, సవిత, బిసి జనార్దన్‌రెడ్డి తదితరులు

>> సురక్షితమైన తాగునీటిని అందించనున్నారు. ఒక్కో వ్యక్తికి రోజుకు సగటున 55 లీటర్ల నీరు అందించేలా ప్రణాళిక రూపొందించారు. రాష్ట్రవ్యాప్తంగా 32 సమగ్ర తాగునీటి సరఫరా పథకాలు, 50,283 ఏక గ్రామ తాగునీటి సరఫరా పథకాలు చేపట్టడం ద్వారా సుమారు 3.27 కోట్ల గ్రామీణ ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా 1,426 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నీటిశుద్ధి కేంద్రాలు, 14,995 నీటి నిల్వ నిర్మాణాలు, 77,243 కిలోమీటర్ల పైప్‌లైన్లు, 27.36 లక్షల ఇంటింటి కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేయనున్నారు. గండికోట జలాశయాన్ని ప్రధాన నీటి వనరుగా వినియోగిస్తూ మదనపల్లి విభాగంలో సమగ్ర రక్షిత తాగునీటి సరఫరా పథకం రెండో దశను చేపట్టనున్నారు. ఈ పథకం ద్వారా మూడు మండలాల్లోని 642 ఆవాసాలకు తాగునీటి భద్రత కల్పించడంతో పాటు సుమారు 5.35 లక్షల మంది ప్రజలకు సురక్షితమైన నీరు అందుబాటులోకి రానుంది. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో 8,494 ఏక గ్రామ తాగునీటి సరఫరా పథకాలను రూ.3,297 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్నారు. వీటి ద్వారా 28,089 ఆవాసాల్లోని సుమారు 239.13 లక్షల మంది ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించనున్నారు. గ్రామ స్థాయిలోనే నీటి వనరులను అభివృద్ధి చేసి ఇంటింటికీ కుళాయి ద్వారా సురక్షితమైన నీటిని అందించడమే ఈ పథకాల ప్రధాన ఉద్దేశ్యం. జల జీవన్ మిషన్-అమరజీవి జలధార కేవలం ప్రస్తుత అవసరాలను తీర్చే పథకంగా కాకుండా రాబోయే 30 సంవత్సరాల గ్రామీణ తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించడం ప్రత్యేకత. నీటి వనరుల లభ్యత, నీటి శుద్ధి, నిల్వ, పంపిణీ, పైప్‌లైన్ వ్యవస్థలను సమగ్రంగా అభివృద్ధి చేసి భవిష్యత్ తరాలకు కూడా తాగునీటి భద్రత కల్పించేలా ప్రణాళిక రూపొందించారు. ఈ బృహత్తర కార్యక్రమంలో భాగంగా 27.36 లక్షల ఇంటింటి కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేయనున్నారు. దీంతో గ్రామీణ కుటుంబాలు దూర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చుకునే పరిస్థితి తగ్గి, ఇంటి వద్దనే సురక్షితమైన తాగునీరు అందుబాటులోకి రానుంది. మహిళలు, పిల్లలపై నీటి సేకరణ భారం తగ్గడంతో పాటు గ్రామీణ కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడనున్నాయి.

**రాయలసీమ రైజింగ్.. అభివృద్ధి ఆగదు: సిఎం చంద్రబాబు**

ఈ సందర్భంగా ప్రొద్దుటూరులో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగించారు. రాయలసీమకు 'రప్పారప్పా' రాజకీయం కాదని, అభివృద్ధి, సంక్షేమం కావాలని స్పష్టం చేశారు. రాయలసీమ అభివృద్ధి బుల్లెట్‌లా దూసుకెళ్తుందని, దానిని ఎవరూ ఆపలేరని అన్నారు. రూ.1 లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేసి సీమ దశ, దిశ మారుస్తామని ప్రకటించారు. భవిష్యత్తులో శత్రు దేశాలను చీల్చిచెండాడే ఫైటర్ జెట్లు 'మేడ్ ఇన్ రాయలసీమ' అని చెప్పుకునే రోజులు వస్తాయని, ఇక్కడ పండే ఫలాలు 'రాయలసీమ బ్రాండ్'తో ప్రపంచ మార్కెట్లకు ఎగుమతి అవుతాయని ధీమా వ్యక్తం చేశారు. రానున్న గోదావరి పుష్కరాల లోపే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రధాని మోడీ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని పునరుద్ఘాటించారు.

**పవన్ కల్యాణ్ నాయకత్వంలో పల్లెల ప్రగతి:** కూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పనితీరును చంద్రబాబు ప్రశంసించారు. "నా మిత్రుడు పవన్ కల్యాణ్ గ్రామీణాభివృద్ధికి కొత్త రూటు వేశారు. మరెక్కడా లేని విధంగా పవన్ కల్యాణ్ రికార్డు స్థాయిలో ఒకేరోజు 13,326 గ్రామాల్లో గ్రామసభలు పెట్టించారు. ఆయన నాయకత్వంలో రెండున్నర దశాబ్దాల తర్వాత 10 వేల మందికి పైగా ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాం. పంచాయతీలకు రూ.4,136 కోట్ల నిధులు విడుదల చేయించాం. లక్షకు పైగా పంట కుంటలు, గోకులాలు ఏర్పాటు చేశారు. ఆయన నేతృత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కోసం ఐదేళ్లలో రూ.1.30 లక్షల కోట్లు ఖర్చు చేయబోతున్నాం"అని ప్రకటించారు.

**వివేకా హత్య, లిక్కర్ స్కామ్‌పై సమాధానం చెప్పే ధైర్యం ఉందా?:** ఈ క్రమంలో గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్వరంతో విరుచుకుపడ్డారు. "ఈ కడప గడ్డ, ప్రొద్దుటూరు నుంచే సవాల్ విసురుతున్నా. వివేకానంద రెడ్డి హత్య కేసులో వాస్తవాలు బయటకు వచ్చాయి. అంతిమ లబ్ధిదారు ఎవరో తేలిపోయింది. రూ.40 కోట్ల సుపారీ గుట్టు విప్పింది. దీనిపై సమాధానం చెప్పే ధైర్యం ఉందా? లిక్కర్ స్కామ్‌లో వేల కోట్లు దోచిన అంతిమ లబ్ధిదారు కూడా నువ్వేనని అన్ని వేళ్లూ నీ వైపే చూపిస్తున్నాయి. సమాధానం చెప్పగలవా?" అని నిలదీశారు. "ఏపీపీఎస్సీ గ్రూప్1 పరీక్షల్లో అక్రమాలు చేసి యువత జీవితాలతో ఆడుకున్నారు. ఇసుకను దోచుకున్నారు. మేము అధికారంలోకి వచ్చాక ఉచిత ఇసుక విధానం తెచ్చాం. మద్యం ధరల విషయంలోనూ పారదర్శకంగా ఉన్నాం. కానీ, వాళ్ల నేరాలు చేసి, ఆ నెపాన్ని ఎదుటివారిపై రుద్దడమే పనిగా పెట్టుకున్నారు. అదే వారి డీఎన్‌ఏ. వారికి అభివృద్ధి సిద్ధాంతం కాదు, కుట్రలు, హింసా రాజకీయాలే వారి సిద్ధాంతం" అని దుయ్యబట్టారు. గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు గొడ్డలి పార్టీకి గట్టిగా బుద్ధి చెప్పారని వ్యాఖ్యానించారు. వివేకా హత్య కేసు నుంచి మద్యం కుంభకోణం వరకు అన్ని వేళ్లూ ఆ పార్టీ అధినేత వైపే చూపిస్తున్నాయని ఆరోపించారు. కుట్రలు, ఫేక్ ప్రచారమే ఆ పార్టీ సిద్ధాంతమని, వారి డిఎన్‌ఏలోనే నేరాలు చేసి ఇతరులపై నెట్టేయడం ఉందని ఎద్దేవా చేశారు. అసెంబ్లీకి రాకుండా ప్రతిపక్ష హోదా కోరడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కేంద్రం, రాష్ట్రంతో పాటు స్థానిక సంస్థల్లోనూ కూటమి అధికారంలో ఉంటే 'ట్రిపుల్ ఇంజిన్ సర్కార్'తో అభివృద్ధి వేగవంతం అవుతుందని సిఎం చంద్రబాబు అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

**రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదు.. అభివృద్ధి: డి.సిఎం పవన్ కల్యాణ్**

"యుద్ధం వచ్చినప్పుడు, హద్దులు దాటినప్పుడు నా గొంతు ఎలా ఉంటుందో మీకు తెలుసు. కానీ ఇది శాంతి సమయం. ప్రజలకు అభివృద్ధి చేయాల్సిన సమయం. అందుకే రాయలసీమ పౌరుషానికి తగిన స్పీచ్ మాట్లాడట్లేదు. రాయలసీమ అభివృద్ధికి అవసరమైన విధంగా మాట్లాడుతున్నా. గొడవలు, కొట్లాటలు, గొడ్డలి పోట్లు కాకుండా అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్దాం" అంటూ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాయలసీమ పౌరుషాన్ని ప్రస్తావిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గొడవలకు, పౌరుషానికి ప్రతీకగా నిలిచిన ఈ నేల రూపురేఖలను అభివృద్ధి పథంలో మార్చాలని ఆయన పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు మీద ఈ బృహత్తర తాగునీటి పథకాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని పవన్ అన్నారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించిన 'హర్ ఘర్ జల్ జలజీవన్ మిషన్'కు 2019-24 మధ్య అధికారంలో ఉన్న ప్రభుత్వం తూట్లు పొడిచింది. రూ.26,000 కోట్ల విలువైన పనులకు ప్రతిపాదనలు పంపి, ఐదేళ్లలో కేవలం రూ.2,700 కోట్లు మాత్రమే ఖర్చు చేసి ఏ ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదు. ప్రజల తాగునీటి కష్టాలను ఏమాత్రం పట్టించుకోలేదు" అని దుయ్యబట్టారు. 2024లో ఈ పథకం ముగిసిపోవాల్సిన తరుణంలో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాను, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు సి.ఆర్. పాటిల్, నిర్మలా సీతారామన్‌లను కలిసి విజ్ఞప్తి చేశామని గుర్తుచేశారు. వారి సహకారంతో ఈ పథకాన్ని 2028 వరకు పొడిగించుకుని, పనులను వేగవంతం చేశామని తెలిపారు. "గత ప్రభుత్వం ఖర్చు చేయగా మిగిలిన పనులతో పాటు, ఇప్పటికే మేము రూ.4,500 కోట్ల విలువైన పనులను పూర్తి చేశాం. మీరు మాపై ఉంచిన నమ్మకమే మాకు శ్రీరామరక్ష" అని పవన్ పేర్కొన్నారు. తమది కక్షసాధింపుల ప్రభుత్వం కాదని, ప్రజాభివృద్ధిని మాత్రమే లక్ష్యంగా పెట్టుకుందని పవన్ స్పష్టం చేశారు. "దశాబ్దాలుగా తాగునీటి సమస్యతో అల్లాడుతున్న పులివెందుల నియోజకవర్గంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పథకాలకు రూ.280 కోట్లు కేటాయించి 7 మండలాల్లోని 299 గ్రామాలకు నీరందిస్తున్నాం. అలాగే, వైసిపి ఎంపి ఉన్నప్పటికీ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు, పాడేరు నియోజకవర్గాల్లో రూ.2,500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. మాకు పార్టీలు కాదు, ప్రజల సమస్యలే ముఖ్యం" అని ఉద్ఘాటించారు. పంచాయతీలకు నిధుల కొరత లేకుండా చూడటం అభివృద్ధి పనులు నిరంతరాయంగా కొనసాగించి సకాలంలో చెల్లింపులు చేయడం గ్రామ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తామన్నారు.

**కూటమితోనే రాయలసీమ అభివృద్ధి: మంత్రి సవిత**

సిఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంతో పాటు రాయలసీమను అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత తెలిపారు రాయలసీమకు పెద్ద ఎత్తున పరిశ్రమల రాకతో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు స్థానికంగానే లభించనున్నాయన్నారు. ఇటీవల మదనపల్లెలో రూ.లక్ష కోట్లతో ఆర్టికల్చర్ హబ్ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. రాయలసీమలో భారీ పరిశ్రమల ఏర్పాటుతో యువతకు స్థానికంగానే పెద్ద ఎత్తున ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. సూపర్ సిక్స్ సహా పలు సంక్షేమ పథకాలను అమలు చేయడమే కాకుండా అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టామన్నారు. పల్లె పండుగ పేరుతో రాష్ట్రంలో మారుమూర గ్రామంలో సైతం రహదారులను నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి, పెందుర్తి ఎమ్మెల్యే రమేష్ బాబు, రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ బాబు,

## ఐదుగురు హైకోర్టు జడ్జిలు ప్రమాణ స్వీకారం

**విజయవాడ, అక్టోబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ హై కోర్టుకు శాశ్వత న్యాయమూర్తులుగా అదనపు న్యాయమూర్తులు జస్టిస్ కుంచం మహేశ్వర రావు, జస్టిస్ తూట చంద్ర ధనశేఖర్ (టిసిడి శేఖర్), జస్టిస్ చల్లా గుణరంజన్, జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మ, జస్టిస్ డాక్టర్ యడవల్లి లక్ష్మణ రావులు బాధ్యతలు స్వీకరించారు. ఎపి హై కోర్టు మొదటి కోర్టు హాల్లో ఫుల్ బెంచ్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో శాశ్వత న్యాయమూర్తులుగా జస్టిస్ కుంచం మహేశ్వరరావు, జస్టిస్ తూట చంద్ర ధనశేఖర్ (టిసిడి శేఖర్), జస్టిస్ చల్లా గుణ రంజన్, జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మ,జస్టిస్ డాక్టర్ యడవల్లి లక్ష్మణ రావులచే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ ప్రమాణ స్వీకారం చేయించారు. రాష్ట్ర హై కోర్టులో ఐదుగురు శాశ్వత న్యాయమూర్తుల నియామకానికి సంబంధించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదముద్ర వేయడంతో కేంద్ర న్యాయశాఖ అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేయగా ఈ ఐదుగురు శాశ్వత న్యాయ మూర్తుల ప్రమాణస్వీకారం జరిగింది. ఎపి హైకోర్టులో సేవలందిస్తున్న ఇతర న్యాయ మూర్తులందరూ ఈ వేడుకకు హాజరై తమ సహచర న్యాయ మూర్తులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయ మూర్తులు, బార్ కౌన్సిల్ ప్రతినిధులు,హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయ వాదులు, న్యాయాధికారులు, రిజిస్ట్రార్లు, న్యాయశాఖ అధికారులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## సిట్ కస్టడీలో మాజీ మంత్రి కారుమూరి

**విజయవాడ, అక్టోబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో మద్యం రవాణా కుంభకోణం కేసులో మాజీమంత్రి కారుమూరి నాగేశ్వరరావును సిట్ అధికారులు కస్టడీకి తీసుకున్నారు. ఆయన కస్టడీ కోరుతూ సిట్ కోర్టు పిటిషన్ దాఖలు చేసిన నేపథ్యంలో అందుకు అనుమతి లభించింది. ఈ క్రమంలో కారుమూరిని చంచల్‌గూడ జైలు నుంచి కస్టడీకి తీసుకున్న సిట్ అధికారులు వెంటనే విజయవాడకు తరలించారు. 5 రోజుల పాటు కారుమూరి నాగేశ్వరరావును సిట్ అధికారులు ప్రశ్నించనున్నారు. కస్టడీ విచారణలో మద్యం రవాణా, లావాదేవీలు, సంబంధిత వ్యక్తులపై వాకబు చేయనున్నారు.

## అంబటికి కిర్లంపూడి పోలీసులు నోటీసులు

**విజయవాడ, అక్టోబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీమంత్రి, వైసిపి కీలక నేత అంబటి రాంబాబుకు కిర్లంపూడి పోలీసులు సోమవారం నోటీసులు ఇచ్చారు. ఈ యేడాది జులై 16వ తేదీన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లాంఛనాలతో జరిగిన వైసిపి నేత ముద్రగడ పద్మనాభం అంత్యక్రియలను అంబటి అడ్డుకున్నారన్నది అభియోగం. ఆయనకు నోటీసులు జారీ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ విషయంపై అంబటి రాంబాబుపై అప్పట్లోనే కిర్లంపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 8వ తేదీన విచారణకు రావాలని నోటీసులో పేర్కొన్నారు. ఆ రోజున తనకు వేరే కార్యక్రమాలు ఉన్నాయని ఆయన చెప్పారు. ఏ రోజున విచారణకు వచ్చేది త్వరలోనే చెబుతానని అంబటి రాంబాబు తెలిపారు.

## రూ.36 కోట్ల జిఎస్‌టి స్కాం

### పోలీసుల అదుపులో నిందితుడు?

**పలమనేరు, అక్టోబరు 5 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా పలమనేరులో రూ.36 కోట్ల మేరకు జిఎస్‌టి స్కాం వెలుగులోకి వచ్చింది. ఈ కేసుకు సంబంధించి రెహమాన్ అనే నిందితుని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అయితే నిందితుని విచారించి పిలిచినప్పుడు రావాలని నోటీసులు ఇచ్చి పంపామని సిఐ మోహనరెడ్డి తెలిపారు. సయ్యద్ సమీద్ అనే వ్యక్తి గత నెలలో తన పేరు మీద రూ.36 కోట్ల మేరకు జిఎస్‌టి స్కాం జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మహ్మద్ దావూస్ అనే వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేశాడు. మహ్మద్ దావూస్ జిఎస్‌టి క్రియేట్ చేసి మోసం చేసినట్లు తెలిపాడు. దీనిపై విచారించగా ఇందులో రెహమాన్ అనే బ్రోకర్ ఉన్నట్లు తేలింది. దీంతో రెహ్మాన్‌ను అతని ఆర్థిక లావాదేవీలపై విచారించారు. కేసు విచారణలో ఉందని త్వరలో ఫైనల్ చేస్తామని సిఐ తెలిపారు.

# 5లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తలే లక్ష్యం

- సాధికారత చాటేలా 'నేషనల్ సరస్ మేళ్లా నిర్వహణ
- 'స్వయం ఎఫ్షితో గ్రామీణ ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్
- సెర్ప్, మెప్మాపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి, అక్టోబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** స్వయం సహాయక సంఘ సభ్యులు ఆర్థికంగా బలోపేతం అయ్యేలా అన్ని శాఖలు సమన్వయంతో కలిసి పనిచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. దీనికి సెర్ప్, మెప్మా అధికారులు మద్దతుగా నిలవాలని సూచించారు. అవసరమైతే కార్పొరేట్ సంస్థల సహకారం తీసుకోవాలని నిర్దేశించారు. సంపద సృష్టికి ఎక్కడ, ఎలాంటి అవకాశాలు ఉన్నా వినియోగించుకునేలా డ్వాక్రా మహిళల్ని తీర్చిదిద్దాలన్నారు. 5 లక్షల మహిళల్ని పారిశ్రామికవేత్తలుగా చేయడం లక్ష్యం కావాలని, స్వయం ఉపాధి పొందాలనుకునే వారు ఫ్రాంచైజీలు ప్రారంభించినా ప్రోత్సహించాలని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలో కోటికి పైగా ఉన్న స్వయం సహాయక సంఘ సభ్యులు ఆర్థికంగా బలపడితే, కోటి కుటుంబాలకు పైగా బలపడినట్టేనని పేర్కొన్నారు. ఎంట్రప్రెన్యూర్లు ఆర్థికంగా విజయవంతం అయినప్పుడే గుర్తింపు వస్తుందన్నారు. లక్ష మంది మహిళలు ఒకొక్కరు ఏడాదికి రూ.5 లక్షల వ్యాపారం చేయగలిగితే రూ.5,000 కోట్ల ఆర్థిక సామర్థం సాధించినట్టేనని చంద్రబాబు అన్నారు. క్యాంపు కార్యాలయంలో సోమవారం సెర్ప్, మెప్మా అధికారులతో 5 లక్షల మంది ఎంట్రప్రెన్యూర్లను తీర్చిదిద్దడం, 'స్వయం ఎఫ్షి అంశాలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. దేశంలోనే స్వయం సహాయక సంఘాలు అంతటి విస్తృతమైన వ్యవస్థ మరొక్కటి లేదని సిఎం సమీక్షా సమావేశంలో ప్రస్తావించారు. డ్వాక్రా సంఘాలు తయారు చేసే ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్ చేరుకోవాలని, అదే సమయంలో మరికొంతమంది ఉపాధి కల్పించేలా ఎదగాలని సిఎం సూచించారు. డ్వాక్రా మహిళలు తయారు చేస్తున్న వేలాది ఉత్పత్తులకు ఒకే బ్రాండ్, నాణ్యత ప్రమాణాలు, ఆధునిక ప్యాకేజింగ్, ఈకామర్స్, సిగ్నేచర్ స్టోర్లు, మార్కెటింగ్ వ్యవస్థను అనుసంధానం చేస్తూ 'స్వయం ఎఫ్షిని తీర్చిదిద్దాలన్నారు. తొలిసారి విజయవాడలో ఈనెల 15 నుంచి 31 వరకు నిర్వహించతలపెట్టిన 'నేషనల్ సరస్ మేళా 2026'ను విజయవంతం చేయాలని, మహిళా సాధికారత చాటేలా 'సరస్ మేళ్లా నిర్వహించాలని అధికారులను సిఎం ఆదేశించారు. దీనికి దేశ వ్యాప్తంగా ఉన్న మహిళా ఎంట్రప్రెన్యూర్లను, మహిళా ఎంపిలను ఆహ్వానించాలని నిర్దేశించారు. మరోవైపు సరస్ మేళాకు దేశం నలుమూలల నుంచి వివిధ స్వయం సహాయక సంఘాలు 600 స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నాయని అధికారులు వివరించారు. మేళాకు రోజూ లక్ష మంది వస్తారని అంచనా వేస్తున్నామన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అధికారికంగా 15న ప్రారంభిస్తున్నారని తెలిపారు.

**అక్టోబరు 15 నుంచి 'స్వయం ఎఫ్షి విక్రయాలు:** అక్టోబరు 15 నుంచి సిగ్నేచర్ స్టోర్లు, ఫ్లిప్‌కార్ట్‌లో 'స్వయం ఎఫ్షి ఉత్పత్తుల విక్రయాలు ప్రారంభిస్తున్నట్టు సమీక్షలో అధికారులు వెల్లడించారు. బ్యాంక్ లింకేజీలోనూ రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘ సభ్యులు ముందున్నారని తెలిపారు. రాష్ట్రంలో 5 లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యానికి అనుగుణంగా ఇప్పటికే చేపట్టిన కార్యక్రమాలు, మార్కెట్ అనుసంధానం, ఆర్థిక వనరులు, శిక్షణ, నాణ్యత ప్రమాణాల గురించి అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గ్రామం నుంచి గ్లోబల్ మార్కెట్ వరకు మహిళలకు అండగా బలమైన వ్యవస్థ నెలకొల్పడం, అవకాశాలను గుర్తించి వ్యాపారాలుగా మలిచే కార్యాచరణ చేపట్టడం, రూ.68,585 కోట్ల రుణాలతో మహిళలకు ఆర్థిక మద్దతివ్వడం, మహిళల్లో కెపాసిటీ బిల్డింగ్, వ్యాపార నిర్వహణ కోసం ప్రముఖ సంస్థలతో శిక్షణ అందించడం, 60కి పైగా సంస్థల భాగస్వామ్యంతో సమగ్ర పారిశ్రామిక ప్రణాళిక రూపొందించడం ఈ ఐదు ప్రధాన అంశాలతో మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు రూపొందించినట్టు చెప్పారు. ఇప్పటికే వ్యాపారంలో విజయవంతమైన మహిళలను కొత్తగా వ్యాపారంలోకి వచ్చే మహిళలకు మెంటర్లుగా అనుసంధానం చేస్తున్నట్టు తెలిపారు. 5 లక్షల మంది మహిళల్ని పారిశ్రామికవేత్తలుగా చేసేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్టు అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబుకి వివరించారు.

**గ్రామీణ మహిళా వ్యాపారులకు మద్దతు:** గ్రామీణ మహిళా వ్యాపారాలను చిన్న స్థాయి జీవనోపాధి కార్యకలాపాల నుంచి సంపద సృష్టించే సంస్థలుగా మార్చేందుకు ఇంక్యుబేషన్ కార్యక్రమాలు చేపడుతున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఐఐఎం విశాఖపట్నం, సెంచూరియన్ యూనివర్సిటీ వంటి సంస్థలతో కలిసి మహిళా వ్యాపారాలకు మెంటార్‌షిప్, మార్కెట్, రుణం, వనరులు, వ్యాపార నైపుణ్యాల అనుసంధానం చేస్తున్నామన్నారు. మహిళల సొంత బ్యాంకింగ్ సంస్థగా ఉన్న స్త్రీనిధి ద్వారా 4.73 లక్షల మంది మహిళలకు రూ.4,800 కోట్ల రుణాలు అందించామని తెలిపారు. ఎస్‌హెచ్‌జీ మహిళలు ఇప్పటికే ఆహారం, హస్తకళలు, వస్త్రాలు, తదితర రంగాల్లో 23,000కు పైగా ఉత్పత్తులు తయారు చేస్తున్నట్టు అధికారులు చెప్పారు. ఈ సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నేటి నుంచి కాంట్రాక్ట్ ఉద్యోగుల సమ్మె

**విజయవాడ, అక్టోబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు రేపటి నుంచి సమ్మెకు సిద్ధమవుతున్నారు. తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగుతున్నట్లు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు వెల్లడించారు. ముఖ్యంగా కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడంతో పాటు, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరుతున్నారు. ఏళ్ల తరబడి వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇప్పటికీ శాశ్వత ఉద్యోగుల తరహాలో భద్రత లేదని ఉద్యోగులు చెబుతున్నారు. ప్రభుత్వ వైద్య సేవల్లో కీలకంగా పనిచేస్తున్నప్పటికీ తమ ఉద్యోగాలు ఎప్పుడు ఉంటాయో, ఎప్పుడు పోతాయో అన్న అనిశ్చితి కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకే కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ప్రక్రియను ప్రభుత్వం వెంటనే చేపట్టి, పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### నేడు తిరుపతి గంగమ్మ ఆలయంలో వరుణహోమం

తిరుమల, అక్టోబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలకు, రైతులకు మేలు కలగాలని ఆకాంక్షిస్తూ దేవదాయశాఖ ఆధ్వర్యంలో తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ ఆలయంలో మంగళవారం వరుణహోమం జరిపిస్తున్నారు. మంగళవారం ఉదయం 14 మంది వేదపండితులతో వరుణ హోమం, వరుణ జపం చేపడుతున్నారు. రేపు ఉదయం 10.30 గంటలకు అమ్మవారికి 108 బిందెలతో అమ్మవారికి జలాభిషేకం భక్తిశ్రద్ధలతో వైభవముగా నిర్వహిస్తారు. భక్తులు, తిరుపతి ప్రజలందరూ ఈ వైదిక పుజాకార్యక్రములలో పాల్గొనవలెనని ఆలయ చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్, ఆలయ ఇఒ ఎ.జయకుమార్ కోరారు.

## కదిరిలో దారుణ హత్య

- కుమారుడిని గొడ్డలితో హతమార్చిన తండ్రి
- కొడుకును చంపానని పోలీసులకు ఫోన్
- శ్రీసత్యసాయి జిల్లా పందులకుంటలో ఘటన



**కదిరి, అక్టోబరు 5 ప్రభాతవార్త:** కన్న కొడుకునే అతి కిరాతకంగా కొడవలితో హత్య చేసిన సంఘటన శ్రీ సత్యసాయి జిల్లా కదిరి రూరల్ మండలంలోని పందులకుంటలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పందులకుంట గ్రామంలో భాను ప్రకాష్‌రెడ్డి నిద్రిస్తున్న సమయంలో అతని తండ్రి రంగారెడ్డి కొడవలితో అత్యంత కిరాతకంగా నరకడంతో అక్కడికక్కడే భానుప్రకాష్‌రెడ్డి మృతి చెందాడు. కాగా, నిందితుడు రంగారెడ్డికి ఇద్దరు భార్యలు, వారు కూడా మృతి చెందారు. ఆస్తి విషయంలో తరచూ తండ్రి, కొడుకులు గొడవలు పడేవారు. ఆదివారం రాత్రి తండ్రి, కొడుకుల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయన్నారు. ఈ క్రమంలోనే భాను ప్రకాష్‌రెడ్డి నిద్రిస్తున్న సమయంలో కొడవలితో విచక్షణరహితంగా దాడి చేశాడు. ఆపై ఇనుప రాడ్డుతో బాదాడు. దీంతో ప్రాణాలు కోల్పోయాడు. అనంతరం నిందితుడు రంగారెడ్డి పోలీసులకు ఫోన్ చేసి తన కుమారుని హత్య చేశానని, లొంగిపోతానని చెప్పినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న కదిరి అప్‌గ్రేడ్ సిఐ నిరంజన్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని హత్యకు గల కారణాలను తెలుసుకున్నారు. అనంతరం క్లూస్ టీంను రప్పించి ఆధారాలను సేకరించడంతోపాటు హత్యకు ఆస్తి తగాదాలా, మరేమైనా కారణాలు ఉన్నాయా అనే అంశాలపై పోలీసులు విచారణ చేపట్టారు. మృతదేహాన్ని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి పంచనామా నిమిత్తం తరలించారు. అయితే భానుప్రకాష్‌రెడ్డి సొంత కారు తీసుకొని అద్దెకు నడుపుకుంటూ జీవనం సాగించే వాడని, నింధితునికి కుమార్తె కూడా ఉంది. భాను ప్రకాష్‌రెడ్డిపై ఇటీవలే రూరల్ పోలీసు స్టేషన్‌లో రౌడీ షీట్ కేసు నమోదు అయినట్లు స్థానికులు తెలిపారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు.

### దివ్యాంగురాలిపై అత్యాచారయత్నం

## నిందితుడికి పదేళ్లు జైలు

- రూ.5 వేల జరిమానా విధింపు
- బాధితురాలికి రూ.5 లక్షల ఆర్థిక సాయం
- ఒంగోలు అదనపు జిల్లా సెషన్స్ కోర్టు తీర్పు

**బాపట్ల, అక్టోబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** మతిస్థిమితం లేని దివ్యాంగురాలిపై అత్యాచారయత్నానికి పాల్పడిన కేసులో నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.5,000 జరిమానా విధిస్తూ ఒంగోలు అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి పందిరి లలిత సోమవారం సంచలన తీర్పునిచ్చారు. దీంతోపాటు బాధితురాలికి జిల్లా న్యాయ సేవా సంస్థ ద్వారా రూ.5 లక్షల పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం సమాచారం మేరకు కేసు వివరాలు ఇలా ఉన్నాయి. 2023 అక్టోబరు 22న చీరాల టు టౌన్ పరిధిలోని ఇపురుపాలెం (భావనారుషి పేట)కి చెందిన గుత్తి శీను(24) అనే యువకుడు, ఇంట్లో ఒంటరిగా ఉన్న శారీరక వైకల్యం, మతిస్థిమితం లేని యువతిపై అత్యాచార యత్నానికి ఒడిగట్టాడు. బాధితురాలి సోదరుడు గమనించి తల్లికి చెప్పడంతో, ఆమె వచ్చి కేకలు వేయడంతో నిందితుడు పారిపోయాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ చంద్రావతి కేసు నమోదు చేసి, సమగ్ర ఆధారాలు సేకరించి నిందితుడిని అరెస్ట్ చేసి చార్జిషీట్ దాఖలు చేశారు.

**క్షేత్రస్థాయి పర్యవేక్షణతోనే కఠిన శిక్ష:** బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ పర్యవేక్షణలో చీరాల డిఎస్పీ మొయిన్, చీరాల టు టౌన్ సిఐ శశికుమార్, కోర్టు లైజనింగ్ ఇన్‌స్పెక్టర్ బాల నాగిరెడ్డి, కోర్టు కానిస్టేబుళ్లు షేక్ కరీముల్లా, షేక్ మూసాలు సాక్షులకు ధైర్యం చెప్పి కోర్టులో ప్రవేశపెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ నల్లూరి అవనీష్ ప్రాసిక్యూషన్ తరఫున బలమైన వాదనలు వినిపించారు. నేరం నిరూపితం కావడంతో న్యాయమూర్తి ఈ శిక్షను ఖరారు చేశారు. మహిళల భద్రత కోసం చేపట్టే ఆపరేషన్ త్రిశూల్, కేసుల్లో వేగవంతమైన శిక్షలు పడేలా చేసే ఆపరేషన్ దండాయన్, డెడికేటెడ్ కోర్టు కానిస్టేబుళ్ల వ్యవస్థల వల్లే ఈ సత్ఫలితాలు సాధ్యమవుతున్నాయని ఎస్పీ ఉమామహేశ్వర్ తెలిపారు. మహిళలపై నేరాలకు పాల్పడితే చట్టం నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందిని, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## ఆర్చర్ జ్యోతి సురేఖను అభినందించిన మంత్రి లోకేష్



**మంగళగిరి, అక్టోబరు 5 ప్రభాతవార్త:** జపాన్‌లో జరిగిన ఆసియా క్రీడలు-2026లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించి ఆర్చరీ కాంపౌండ్ మహిళల టీమ్ విభాగంలో స్వర్ణ పతకం సాధించిన ప్రఖ్యాత ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ, తండ్రి సురేంద్రకుమార్ సోమవారం ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను కలిశారు. ఏషియన్ గేమ్స్‌లో ఇప్పటివరకు నాలుగు గోల్డ్ మెడల్స్ సహా ఆరు పతకాలు సాధించిన సురేఖ చరిత్ర సృష్టించారు. ఏషియన్ గేమ్స్‌లో తన ప్రతిభతో స్వర్ణం కైవసం చేసుకున్న జ్యోతి సురేఖను ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. అంతర్జాతీయ వేదికపై మువ్వన్నెల జెండాను రెపరెపలాడించి దేశానికి, రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని ప్రశంసించారు. 2028 ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని, అన్నివిధాలా అండగా ఉంటామని మంత్రి హామీ ఇచ్చారు.

# ఎన్నికల వ్యవస్థపై అవాస్తవ ప్రచారాలు సరికాదు

● రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



**విజయవాడ, అక్టోబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితాల రూపకల్పన పూర్తిగా రాజ్యాంగబద్ధంగా, అత్యంత పారదర్శకంగా జరుగుతాయని ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. న్యూఢిల్లీలోని ఏపి భవన్ గురజాడ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో అనుసరిస్తున్న నిబంధనలు, సాంకేతిక పద్ధతులు, ఓటర్ల నమోదు ప్రక్రియపై కొందరు చేస్తున్న అవాస్తవ ఆరోపణలను ఆయన ఖండించారు. ఎన్నికల సంఘం మరియు చట్టబద్ధమైన వ్యవస్థల ద్వారా జరిగే ఈ ప్రక్రియపై అపోహలు సృష్టించడం సరికాదని హితవు పలికారు. ఎస్.ఐ.ఆర్ తదితర నిరంతర ప్రక్రియలు పకడ్బందీగా జరుగుతున్నాయని, ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం తగదని మంత్రి పేర్కొన్నారు. కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు ఆయా ఎన్నికల్లో ఓటములతో గుణపాఠం నేర్చుకోవడం లేదని అన్నారు. విశ్వాసనీయత లేని వారిని తీసుకువచ్చి కాంగ్రెస్ అగ్రనేతలు మాట్లాడిస్తున్నారని ఆగ్రహించారు. ఎన్నికల గురించి నటుడు ప్రకాశ్‌రాజ్ చెప్పే మాటలు వింటే నవ్వు వస్తోందని ఎద్దేవా చేశారు.

# టిడిపి, బిసి బంధాన్ని ఎవరూ విడదీయలేరు

● ఎమ్మెల్యే బుర్ల రామాంజనేయులు



**అమరావతి, అక్టోబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** బిసిల అభ్యున్నతి, సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు డా.బూర్ల రామాంజనేయులు అన్నారు. సోమవారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బిసిల పట్ల గొడ్డలి పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులు విషం చిమ్ముతున్నారని విమర్శించారు. రాష్ట్ర జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బిసిలు కుల వృత్తులు, స్వశక్తితో గ్రామీణ వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నారని, వారి అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదన్నారు. బిసిల అభివృద్ధికి టిడిపి ఆవిర్భావం నుంచి కృషి చేస్తోందని ఎమ్మెల్యే గారు తెలిపారు. 1979లో మండల కమిషన్ ఏర్పాటు కాగా, దాని సిఫారసులను అమలు చేయడంలో ఎన్టీ రామారావు కీలకంగా వ్యవహరించారని గుర్తుచేశారు. 1983 నుంచి మండల కమిషన్ సిఫారసుల అమలుకు ఎన్టీఆర్ చర్యలు చేపట్టారన్నారు. 1993లో ఏర్పాటైన జాతీయ బిసి కమిషన్‌కు రాజ్యాంగబద్ధమైన అధికారాలు కల్పించేందుకు సిఎం చంద్రబాబు కేంద్రంతో చర్చలు జరిపి ఒత్తిడి తీసుకువచ్చారని చెప్పారు. 2015లో బిసిలకు ప్రత్యేక సబ్‌ప్లాన్ తీసుకువచ్చి సుమారు రూ.40 వేల కోట్లు ఖర్చు చేసి 30 పథకాలు అమలు చేశామని రామాంజనేయులు తెలిపారు. విదేశీ విద్య, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, కోచింగ్ సెంటర్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు బిసి విద్యార్థులకు ఉపయోగపడ్డాయని అన్నారు. ఎన్టీఆర్ స్థానిక సంస్థల్లో బిసిలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, సిఎం చంద్రబాబు దానిని 34 శాతానికి పెంచారని పేర్కొన్నారు.

## సాధారణ మున్సిపల్ ఎన్నికలు-2026 పై

# ప్రాంతీయ స్థాయి సమీక్ష సదస్సు



**అనంతపురం, అక్టోబర్ 5 ప్రభాతవార్త బ్యూరో :** అనంతపురం నీలం రాజశేఖర్ రెడ్డి కన్వెన్షన్ హాల్ (ఎన్‌హెచ్-44)లో సోమవారం ఉదయం 10:00 గంటలకు సాధారణ మున్సిపల్ ఎన్నికలు-2026కు సంబంధించిన ప్రాంతీయ స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా సిడిఎంఎ డా.సంపత్ కుమార్ హాజరై, మున్సిపల్ సాధారణ ఎన్నికల 2026 నిర్వహణపై క్లుప్తంగా దిశానిర్దేశం చేశారు. అనంతరం అడిషనల్ డైరెక్టర్ రవీంద్ర బాబు ఉదయం నుండి సాయంత్రం వరకు జరిగిన ఈ సమీక్ష సమావేశంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాలను క్షుణ్ణంగా వివరించారు. ఈ ప్రాంతీయ సదస్సుకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు, అనంతపురం రీజియన్ పరిధిలోని అనంతపురం, కర్నూలు, కడప, తిరుపతి ఉమ్మడి జిల్లాల మున్సిపల్ కమిషనర్లందరూ, ఆయా మున్సిపాలిటీల ఎన్నికల నిమిత్తం నియమించబడిన ఎలక్షన్ అధికారులు, రిటర్నింగ్ ఆఫీసర్లు, సిబ్బంది హాజరయ్యారు. అడిషనల్ డైరెక్టర్ రవీంద్ర బాబు మాట్లాడుతూ..ప్రస్తుతము ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బిసి, మహిళా రిజర్వేషన్ల వర్గీకరణ ప్రక్రియ పూర్తయిందని, తదుపరి ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన పిదప పాటించవలసిన నియమాలను వారు వివరించారు.

# కాకాణి ఆధ్వర్యంలో నెల్లూరు కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా

● ఎల్‌నినో ప్రభావం, కరవు మండలాలపై కలెక్టర్‌కు వినతి పత్రం



**నెల్లూరు, అక్టోబర్ 5, ప్రభాతవార్త - కలెక్టరేట్:** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా రైతాంగం తీవ్ర దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొంటున్నా, నెల్లూరు జిల్లాలోని 35 గ్రామీణ మండలాల్లో ఒక్క మండలాన్ని కూడా కరువు మండలంగా ప్రకటించకపోవడం కూటమి ప్రభుత్వ దుర్మార్గ వైఖరికి నిదర్శనమని వైఎస్సార్సీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ పర్వత చంద్రశేఖర్ రెడ్డి, ఆనం విజయ్ కుమార్‌లతో కూడిన వైఎస్సార్సీపీ బృందం జిల్లా కలెక్టర్‌కు సమగ్ర వినతి పత్రం అందజేసింది. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లాలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులను వివరిస్తూ కరువు మండలాలను వెంటనే ప్రకటించాలని, అదే విధంగా నెల్లూరు నగర కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్లలో జరుగుతున్న భారీ అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

- నీటి యాజమాన్య వైఫల్యంతో తొలి పంటకు తీరని అన్యాయం 5.20 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్న ప్రధానమైన తొలి పంటకు నీళ్లివ్వకుండా కూటమి ప్రభుత్వం రైతులకు తీరని అన్యాయం చేసింది. సోమశిల, కండలేరు జలాశయాల్లో 93 టీఎంసీల నీళ్ల అందుబాటులో ఉన్నా, సరైన నీటి యాజమాన్య పద్ధతులు పాటించకుండా వృథా చేశారు. కేవలం 18 నుంచి 20 టీఎంసీలతో పూర్తయ్యే రెండో పంటకు ఏకంగా 64 టీఎంసీల నీటిని ఖర్చు చేసి చేతులెత్తేశారు. శ్రీశైలం నుంచి సోమశిలకు నీళ్ల తరలించే అవకాశం ఉన్నప్పటికీ సీఎం చంద్రబాబు ఒక్క చుక్క నీరు కూడా ఇవ్వనని మొండికేశారు. పెన్నా పరివాహక ప్రాంత రైతుల రిపేరియన్ హక్కుల కోసం నెల్లూరు బ్యారేజీ వద్ద పోరాడితే మాపై అక్రమ కేసులు బనాయించారు. రైతుల సమస్యలపై ప్రశ్నిస్తే కేసులు పెట్టి జైలుకు పంపుతామన్నట్టుగా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తోంది.

# వంశధార నీరు తీసుకొచ్చింది మా ప్రభుత్వమే

● గెలిచిన 12 రోజుల్లోనే నీరు తెచ్చాం ఐదేళ్లున్నా అప్పలరాజు చేయలేకపోయారు : ఎమ్మెల్యే శిరీష

**శ్రీకాకుళం, అక్టోబర్ 5, ప్రభాతవార్త :** శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గంలో గత ప్రభుత్వం చేయలేని పనులను తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి చేస్తోందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. నియోజకవర్గ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చడమే లక్ష్యంగా వంశధార నీటిని తీసుకొచ్చామని చెప్పారు. ఎమ్మెల్యేగా గెలిచిన 12 రోజుల్లోనే వంశధార నీటిని ఈ ప్రాంతానికి తీసుకొచ్చామని పేర్కొన్నారు.పలాస మండలం లొద్దభద్రలో ఎంపీ ల్యాడ్ నిధులతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్, కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆమె ప్రతిపక్షంపై విమర్శలు చేశారు.



**బోర్ నీటిపై అప్రమత్తంగా ఉండాలి:** ప్రస్తుతం పలు ప్రాంతాల్లో బోర్ నీటిని ప్రజలు తాగునీటిగా, వంట అవసరాలకు వినియోగిస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. బోర్ నీటిని తాగొద్దని, వంటకు కూడా ఉపయోగించవద్దని ప్రజలకు సూచించారు. సురక్షితమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

# ఇచ్చిన మాటపై నిలిచేది చంద్రబాబు ప్రభుత్వమే

● రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



**విజయవాడ, అక్టోబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేసారు. టిడిపి ఎన్నడు వాగ్దానాలకు పరిమితం కాలేదన్నారు. సిఎం చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను పరిష్కరించిన తరువాతనే ఇతరంశాలకు ప్రాధాన్యతను ఇస్తారన్నారు. టిడిపి కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వేదికలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వారి నుంచి అర్జీలను స్వీకరించారు. సుమారు మూడు గంటల పాటు 150 అర్జీలను స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేశారు. సంబంధించి అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. అందిన ప్రతి ఫిర్యాదును సంబంధిత శాఖల అధికారులకు పంపించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పేదవాడి సొంతింటి కలను చిదిమేసింది గత జగన్ రెడ్డి ప్రభుత్వమే అని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో యుద్ధప్రాతిపదికన పేదల సొంతింటి నిర్మాణం జరుగుతోందన్నారు. కేంద్రం సహకారంతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పరుగులు పెడుతోందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునేందుకు జగన్ కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. అమరజీవి జలధార ద్వారా ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందిస్తామని చెప్పారు. పల్లె పండుగ 3.0తో రూ.11 వేల కోట్లతో గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు.

రాయలసీమకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో హంద్రీనీవాకు ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారని మండిపల్లి అన్నారు. హంద్రీనీవాను అభివృద్ధి చేసి, కుప్పానికి నీళ్లు అందించిన ఘనత చంద్రబాబుదే అని అన్నారు. హార్టీకల్చర్ హబ్‌గా రాయలసీమను తీర్చిదిద్దుతూ 'రాయలసీమ రైజింగ్'కు బాటలు వేస్తున్నామన్నారు. గతంలో టిడిపి నాయకులను బెదిరించి, దాడులు చేసి ఏకగ్రీవాలు చేసుకున్నవారే నేడు పారదర్శకత గురించి మాట్లాడుతున్నారని అన్నారు. 'ఏకగ్రీవాలు మా విధానం కాదు.. పారదర్శక ఎన్నికలే మా విధానం' అని స్పష్టం చేశారు. బిసి రిజర్వేషన్ అమలు విషయంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఇలాంటి వేదికలు ఎంతో ఉపయోగకరమని పలువురు అభిప్రాయపడ్డారు.

# మహిళా ఎస్.ఐ.ని వెంబడించిన ఆకతాయిలు

**విజయవాడ, అక్టోబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలో మహిళా ఎస్ఐని కొంతమంది ఆకతాయిలు వెంబడించారు.గొల్లపూడి బైపాస్ రోడ్డులో కారులో వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. అత్యంత అసభ్యంగా వ్యవహరించారు. కారును అడ్డుకునే ప్రయత్నం చేసారు. మహిళా ఎస్ఐని తమ చేష్టలతో భయపెట్టే ప్రయత్నం చేసారు. దీంతో ఎస్.ఐ. ప్రమీల భవానీపురం పోలీసులను ఆశ్రయించారు. ఈ క్రమంలో ఇద్దరు యువకులను పోలీసులు అదు పులోకి తీసుకున్నారు. వారు మద్యం, గంజాయి మత్తులో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇక గొల్లపూడి ఫ్లై1 సెంటరు.వైజంక్షన్, భవాని ఫ్లైవో వరు దిగిన దగ్గర నుంచి గంజాయి మత్తులో యువకులు ఈ రకమైన రీతిలో కొంత కాలం నుంచి వ్యవహరిస్తున్నారు.ఆ దిశలో ద్విచక్రవాహనాలపై వెళ్ళే యువతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# నేటి నుంచి రూఫ్‌టాప్ సోలార్‌పై అవగాహన

**విజయవాడ, అక్టోబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎపిసిపిడిసిఎల్ ఆధ్వర్యంలో అక్టోబర్ 6, 7, 8 తేదీల్లో 'సేవా సేతు అభియాన్' క్యాంపులను నిర్వహించనున్నట్లు ఆ సంస్థ సిఎండి పి.పుల్లారెడ్డి తెలిపారు. 'ముఫ్త్ బిజ్లీ యోజన'లో భాగంగా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల డిస్కమ్‌ల పరిధిలో 'సేవా సేతు అభియాన్' క్యాంపులను నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 17 వరకు సబ్ డివిజన్, జిల్లా స్థాయిలో ఈ క్యాంపులను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సిఎండి పి. పుల్లారెడ్డి సోమవారం మీడియా మాట్లాడుతూ 'ప్రతి ఇంటికి సౌర విద్యుత్‌ను చేరువ చేయడం, రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై ప్రజల్లో అవగాహన కల్పించడమే సేవా సేతు అభియాన్ ప్రధాన ఉద్దేశ్యం' అని తెలిపారు. ఇంటి పైకప్పుపై సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను గణనీయంగా తగ్గించుకునే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. పిఎం సూర్య ఘర్ పథకం ద్వారా అర్హత కలిగిన గృహ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందన్నారు. రూ.78 వేల వరకు సబ్సిడీపథకం కింద అర్హత కలిగిన

**గృహ వినియోగదారులకు:**

1 కిలోవాట్‌కు రూ.30,000లు 2 కిలోవాట్లకు రూ.60,000లు 3 కిలోవాట్లు లేదా అంత కంటే ఎక్కువ సామర్థ్యానికి గరిష్ఠంగా రూ.78,000లు వరకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందని సిఎండి తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పెద్ద సంఖ్యలో సేవా సేతు క్యాంపులను సందర్శించి రూఫ్‌టాప్ సోలార్‌పై పూర్తి సమాచారాన్ని తెలుసుకుని పథకం ప్రయోజనాలను పొందాలని సిఎండి పి. పుల్లారెడ్డి కోరారు.

# మహిళను హత్య చేసిన ఇద్దరు మహిళలు అరెస్టు

**కావలి (నెల్లూరు), అక్టోబర్ 5, ప్రభాతవార్త :** కావలి పట్టణంలోని తుఫాన్‌నగర్‌లో జరిగిన మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. హత్య పాల్పడిన ఇద్దరు మహిళలను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి సుమారు రూ.60 లక్షల విలువైన 40 కాసుల బంగారం,అర కిలో వెండిని స్వాధీనం చేసుకున్నట్లు కావలి డీఎస్పీ వి.వి. రమణ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కావలి రెండవ పట్టణ పోలీస్ స్టేషన్లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిఎస్పి మాట్లాడారు.కావలితుఫాన్‌నగర్‌లో నివాసం ఉంటున్న పొంగులూరు విజయలక్ష్మి అలియాస్ వీరమ్మ చీటీలు,వడ్డీ వ్యాపారం నిర్వహిస్తుండేదని ఈ నెల ఒకటో తేదీన మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఆమె ఇంట్లోనే హత్యకు గురైందన్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసిన దర్యాప్తు చేపట్టడం జరిగిందన్నారు జరిగిందన్నారు. ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టిన తమ బంగారాన్ని విడిపించుకునేందుకు షేక్ షబానా, విజయలక్ష్మి వద్ద వడ్డీకి డబ్బులు తీసుకున్నట్లు తెలిపారు. అయితే డబ్బులు తిరిగి చెల్లించిన తర్వాతే బంగారాన్ని ఇస్తానంటూ విజయలక్ష్మి నగలను తన వద్దే ఉంచుకున్నట్లు పేర్కొన్నారు.దీంతో తమ బంగారాన్ని ఎలాగైనా తిరిగి దక్కించుకోవాలని షబానా,ఆమె స్నేహితురాలు జ్యోతి కలిసి పథకం వేసినట్లు వెల్లడించారు. పథకం ప్రకారం ఈ నెల ఒకటో తేదీన విజయలక్ష్మి ఇంట్లోకి ప్రవేశించిన ఇద్దరూ ఆమె గొంతు నులిమి హత్య చేసినట్లు తెలిపారు.

# అంగన్‌వాడీల ద్వారా 35లక్షల మందికి సేవలు

● మంత్రి సంధ్యారాణి



**గన్నవరం(కృష్ణా), అక్టోబర్ 5, ప్రభాతవార్త** :రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీస్త్రీలు, బాలింతలు కలిపి మొత్తం 35లక్షల మందికి సేవలు అందిస్తున్నట్లు రాష్ట్రగిరిజన స్త్రీశిశుసంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. 9వరాష్ట్రీయ పోషణ్‌మాస్ -2026 కార్యక్రమాన్ని సోమవారం మధ్యాహ్నం కృష్ణాజిల్లా గన్నవరంలో ప్రభుత్వ విప్, గన్న వరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 55,776 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని, వీటి పరిధిలో రాష్ట్రవ్యాప్త అనుబంధ పోషకాహార కార్యక్రమం కింద 4,38,952మంది పాలిచ్చే తల్లులు, గర్భిణీలు, 3 నుండి 7సంవత్సరాల వయసుగల పిల్లలు 11,35,772 మంది, 3 నుండి 6సంవత్సరాల వయసు గల చిన్నారులు 7,35,785మంది, 7,161మంది కిశోరబాలికలు, కలిపి మొత్తం 23,17,660మంది లబ్ధిపొందుతున్నట్లు వివరించారు. పోషకాహార కార్యక్రమాల ఫలితంగా 5సంవత్సరాలలోపు పిల్లలో స్టంటింగ్ 20.68శాతం నుండి 8.77శాతానికి, అండర్‌వెయిట్ 9.75 శాతం నుండి 4.76శాతానికి తగ్గినట్లు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలియచేసారు. గత రెండేళ్ళలో 5,389 కార్యకర్తలు, 4,061మంది సహాయాకుల పోస్టులు భర్తీచేసామన్నారు. ప్రస్తుతం 1,066 కార్యకర్తలు, 4,250మంది సహాయకుల పోస్టులు నోటిఫికేషన్ దశలో ఉన్నాయని, మొత్తం 5,316పోస్టులను భర్తీ చేసే ప్రక్రియ కొనసాగుతున్నట్లు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు సంధ్యారాణి వివరించారు. ఈకార్యక్రమంలో శిశుసంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి ఏ.సూర్యకుమారి, డైరెక్టర్ యం.వేణుగోపాలరెడ్డి, కృష్ణాజిల్లా జేసి యం.నవీన్, కిసాన్‌మోర్చా రాష్ట్రఅధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విశాఖలో హవాలా పేరుతో రూ.72 లక్షలు అపహరణ

**విశాఖ క్రైమ్, అక్టోబర్ 5 ప్రభాతవార్త:** విశాఖపట్నంలో కొద్ది రోజులుగా క్రితం జరిగిన రూ. 72 లక్షల దోపిడీ కేసులో నమోదైంది. ద్వారకానగర్‌లో కారు అద్దాలు పగలగొట్టి ఈ నగదును అపహరించారు. హవాలా లావాదేవీ ముసుగులో ఈ రూ. 72 లక్షల దోపిడీ జరిగిం ది. ఈ ఘటనకు సూత్రధారులుగా కొరాడ అప్పలరమణ,కొల్ల రమణలను గుర్తించిన ద్వారకా పోలీసులు, వారిద్దరినీ అరెస్టు చేసినట్లు తెలుస్తుంది. దోపిడీలో పాల్గొన్న బొబ్బిలికి చెందిన పవన్ కుమార్‌ను కూడా పోలీసులు అదుపులో తీసుకున్నట్లు సమాచారం. నిందితుల నుంచి రూ. 12 లక్షల నగదు స్వాధీనం చేసుకొని. ఈ కేసులో ఐదుగురు అనుమానితులను గుర్తించగా, ప్రస్తుతం పరారీలో ఉన్న వారి కోసం మరో ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. అప్పలరమణ బాధితులకు తనను తాను రాజుగా పరిచయం చేసుకుని, ఆ పేరుతోనే వారితో ఆన్‌లైన్‌లో సంప్రదింపులు జరిపాడు. భారతీయ కరెన్సీకి బదులుగా ప్రతినిధి ఇస్తానని ఆశ చూపి బాధితులను ఆకర్షించాడు.

# గుంటూరు, రాజమహేంద్రవరం,కర్నూలు, తిరుపతి ఇక పోలీస్ కమిషనరేట్లు

● జీవోలను జారీచేసిన హోం శాఖ ప్రిన్సిపుల్ సెక్రటరీ

**అమరావతి,అక్టోబరు5,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో నాలుగు పోలీస్ కమిషనరేట్లను ఏర్పాటు చేస్తూ జీవోలను జారీ చేసింది. ఈ మేరకు జీవోలను హోం శాఖ ప్రిన్సిపుల్ సెక్రటరీ ఇచ్చారు. గుంటూరు, రాజమహేంద్రవరం, కర్నూలు, తిరుపతి పోలీస్ కమిషనరేట్లుగా ఆవిర్భవించాయి. ఈ కమిషనరేట్‌లకు కమిషనర్లుగా డీఐజీ లేదా ఐజీ ర్యాంక్ అధికారి ఉంటారని జీవోలో తెలిపారు. కమిషనరేట్‌ల పరిధి, సిబ్బంది, అధికారుల వివరాలు కూడా జీవోలో హోమ్ సెక్రటరీ పేర్కొన్నారు. ఇక రాజమహేంద్రవరం కమిషనరేట్‌లో మూడు ప్రాదేశిక మండలాలు ఉంటాయి .దీనికి ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అధికారాలతో ఐజీపీ/డీఐజీ హోదా గల పోలీస్ కమిషనర్ నేతృత్వం వహిస్తారు.

గుంటూరు కమిషనరేట్‌లో గుంటూరు, గుంటూరు రూరల్, అమరావతి క్యాపిటల్ రీజియన్ తెనాలి అనే నాలుగు మండలాలు ఉంటాయి. తిరుపతి కమిష నరేట్‌లో తిరుమల, తిరుపతి, శ్రీకాళహస్తి శ్రీ సిటీ అనే నాలుగు మండలాలు ఉంటాయి. కర్నూలు కమిషనరేట్‌లో రెండు ప్రాదేశిక మండలాలు మరి యు కర్నూలు అర్బన్, కర్నూలు రూరల్, ఆదో ని, ఎమ్మిగనూరు మరియు పట్టికొండ అనే ఐదు ఉపవిభాగాలు ఉంటాయి.

# ఎ.పి.లో బిసిసిఐ డొమెస్టిక్ క్రికెట్

విశాఖ, విజయనగరం, విజయవాడ,అనంతపురం వేదికగా
వినూ మన్కడ్రంజీ సీకే నాయుడు టోర్నమెంట్ మ్యాచ్‌లు

**విజయవాడ, అక్టోబరు 5 (ప్రభాతవార్త):** ఆంధ్రప్రదేశ్‌లో బీసీసీఐ డొమెస్టిక్ క్రికెట్ సందడి నెల కొననుంది. రాష్ట్రంలోని విశాఖపట్నం, విజయనగరం, మూలపాడు, అనంతపురం వేదికలుగా ప్రతిష్టాత్మకమైన వినూ మన్కడ్ ట్రోఫీ, రంజీ ట్రోఫీ, సీకే నాయుడు ట్రోఫీ మ్యాచ్‌లు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) సెక్రటరీ సానా సతీష్ బాబు తెలిపారు.

**వినూ మన్కడ్ ట్రోఫీ - ఎలైట్ గ్రూప్ ఈ**

ఈ నెల 8 నుంచి 16వ తేదీ వరకు విశాఖపట్నం, విజయనగరంలో అండర్19 వినూ మన్కడ్ ట్రోఫీ ఎలైట్ గ్రూప్‌ఈ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ పోటీల్లో గుజరాత్, కర్ణాటక, ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, చండీగఢ్ జట్లు తలపడనున్నాయి. యువ క్రికెటర్ల ప్రతిభను చాటుకునేందుకు ఈ టోర్నమెంట్ కీలక వేదికగా నిలవనుంది.

**మూలపాడులో రంజీ ట్రోఫీ మ్యాచ్‌లు**

రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్-బిలో భాగంగా విజయవాడ, మూలపాడు క్రికెట్ స్టేడియం రెండు కీలక మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ నెల 11 నుంచి 14 వరకు ఆంధ్ర-కర్ణాటక, 18 నుంచి 21 వరకు ఆంధ్ర-హైదరాబాద్ జట్ల మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి.

**అనంతపురంలో సీకే నాయుడు ట్రోఫీ**

అండర్23 సీకే నాయుడు ట్రోఫీ ఎలైట్ గ్రూప్ బిలో భాగంగా ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు ఆంధ్ర జార్ఖండ్ మ్యాచ్ అనంతపు రంలోని ఆర్‌డీటీ స్టేడియం వేదికగా జరగనుంది.బీసీసీఐ డొమెస్టిక్ క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణకు సంబంధించి స్టేడియంలు, పిచ్‌లు, మౌలిక వసతులు, ఆటగాళ్లకు అవసరమైన సౌకర్యాలు, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సానా సతీష్ బాబు తెలిపారు.

మ్యాచ్‌లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరిగే లా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వెల్లడిం చారు.ఆంధ్రప్రదేశ్‌లో అంతర్జాతీయ ప్రమాణాల తో క్రికెట్ మౌలిక వసతులను అభివృద్ధి చేయ డంతో పాటు, బీసీసీఐ డొమెస్టిక్ మ్యాచ్‌లకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలను వేదికలుగా తీర్చిదిద్దేందుకుఎసిఎనిరంతరం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు.

# పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఇంద్రకీలాద్రిపై మోడీ పేరిట పూజలు

**విజయవాడ,అక్టోబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటున్న చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని విజయవాడ ఇంద్రకీలాద్రిపై ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అక్టోబర్ 7వ తేదీన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ప్రధాని మోదీ పేరిట ఈ పూజా కార్యక్రమాలను చేపట్టనున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు రాజ్యసభ సభ్యులు లింగమనేని రమేశ్ ఈ పూజలను నిర్వహిస్తున్నారు.2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రధాని మోదీ ప్రజా ప్రస్థానం ప్రారంభమైంది. అప్పటి నుంచి 2014 లో దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి, 25 ఏళ్లుగా తన సేవలను దిగ్విజయంగా కొనసాగిస్తున్నారు. ఈ మైలురాయిని పురస్కరించుకుని, ప్రధాని మోదీకి అమ్మవారి సంపూర్ణ ఆశీస్సులు లభించాలని, ఆయనకు ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ ఈ పూజలు జరపనున్నారు. దేశాన్ని విక్షిత్ భారత్ లక్ష్యం వైపు నడిపిస్తున్న ఆయన నాయకత్వం మరింత బలోపేతం కావాలన్నది ఈ పూజల ముఖ్య ఉద్దేశం.ఈ సందర్భంగా అక్టోబర్ 7వ తేదీ తెల్లవారుజామున బ్రహ్మ ముహూర్తంలో అమ్మవారి అంతరాలయంలో అత్యంత విశిష్టమైన ఖడ్గమాల అర్చనను ప్రధాని పేరిట జరపనున్నారు. జగద్గురువు ఆది శంకరాచార్యులు ఇంద్రకీలాద్రిపై ప్రతిష్టించిన శ్రీచక్రానికి ఖడ్గమాల స్తోత్రంతో పూజలు నిర్వహిస్తే అమ్మవారి అనుగ్రహంతో పాటు ఆధ్యాత్మిక శక్తి, రక్షణ, శాంతి, సంకల్పసిద్ధి కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ప్రధాని మోదీ నిరంతర దేశ సేవకు కనకదుర్గమ్మ ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, ఆయన నాయకత్వంలో భారతదేశం మరింత సుసంపన్నమైన, ఆత్మనిర్భర దేశంగా ఎదగాలన్న సంకల్పంతో ఎంపీ లింగమనేని రమేశ్ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ పూజల ద్వారా ప్రధానికి సంపూర్ణ ఆరోగ్యం, శక్తి సామర్థ్యాలు లభించాలని ఆకాంక్షించారు.

## విజయవాడ ఉత్సవ్ 2.0కు

# జాతీయ అతిథులకు ఆత్మీయ ఆహ్వానం

దసరా నవరాత్రి వేడుకల్లో భాగస్వాములు కావాలని ఢిల్లీ,పశ్చిమ బెంగాల్ సీఎంలకు,కేంద్ర మంత్రులకు ఆహ్వానం

**విజయవాడ, అక్టోబరు 5 (ప్రభాతవార్త):** విజయవాడలో ఘనంగా నిర్వహించనున్న దసరా నవరాత్రి వేడుకలు, విజయవాడ ఉత్సవ్-2.0కుఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాకు, కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కు, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి కి రాష్ట్ర ప్రభుత్వం తరపున సోమవారంనాడు పలువురు నేతలు కలిసి ఆహ్వానం పలికారు. కేంద్ర మంత్రిగజేంద్ర సింగ్ షెకావత్ ను సోమవారంనాడు ఢిల్లీలోని వారి నివాసంలోమంత్రి సత్యకుమార్, విజయవాడఎంపికేశినేని శివనాథ్ (చిన్ని), ఎంపి హరీష్ బాలయోగి స్వయంగా కలిసి విజయవాడ ఉత్సవ్ కు ఆహ్వానించారు. శ్రీ కనకదుర్గమ్మవారి దివ్య ఆశీస్సులు పొందడంతో పాటు విజయవాడ సాంస్కృతిక వైభవాన్ని వీక్షించాలని కేంద్ర మంత్రిని వారుకోరారు. అనంతరం ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాను వారి కార్యాలయంలోమంత్రి సత్యకుమార్, ఎంపి చిన్ని కలిసి విజయవాడ దసరా ఉత్సవాలకు ఆహ్వానం పలికారు. విజయవాడ దసరా ఉత్సవాల విశిష్టతను ఢిల్లీ సీఎంకు వివరించారు. విజయవాడ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని దేశవ్యాప్తంగా చాటేందుకు విజయవాడ ఉత్సవ్ 2.0 నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కాగా, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారిని కోల్ కతాలోని ఆయన కార్యాలయంలో సోమవారం కలిసి విజయవాడలో జరిగే దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు రావాలని, విజయవాడ ఉత్సవ్ 2.0లో పాల్గొనాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆహ్వాన ప్రతికను పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రికిరామ్మోహన్ నాయుడుతో పాటు విజయవాడ ఉత్సవ్ కమిటీ సభ్యులు ముత్తవరపు మురళి, మణికంఠ అందచేశారు.



# చంద్రుడిపై అణురియాక్టర్ల ఏర్పాటుకు అగ్రదేశాల పోటీ!

## అమెరికా, చైనా, రాష్ట్రాల దృష్టి దానిపైనే

**న్యూయార్కు, అక్టోబరు 5:** చంద్రుడిపై శాశ్వత స్థావరాలు ఏర్పాటు చేసేందుకు అగ్రరాజ్యాలు సిద్ధమవుతున్నాయి. అమెరికా, చైనా, రష్యా ఇప్పుడు చంద్రుడిపై అణు రియాక్టర్ల ఏర్పాటుపై దృష్టి పెట్టాయి. భవిష్యత్తులో చంద్రుడిపై ఎక్కువ కాలం మనుషులు ఉండాలన్నా, అక్కడి వనరులను అన్వేషించాలన్నా విద్యుత్ కీలకం. అందుకే ఈ మూడు దేశాలు అణుశక్తిని ప్రత్యామ్నాయంగా చూస్తున్నాయి. ఓ చిన్న అణు రియాక్టర్ తయారీకి కంపెనీల నుంచి ఆగస్టులో నాసా ప్రతిపాదనలు కోరినట్లు వెలుగులోకి వచ్చింది. చంద్రుడి దక్షిణ ధ్రువం సమీపంలో పనిచేసేలా దీన్ని రూపొందించనున్నారు. 2030 డిసెంబరు నాటికి ప్రయోగానికి సిద్ధం చేయాలన్నది లక్ష్యం. ఈ రియాక్టర్ 20 కిలోవాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ ఐదేళ్ల పాటు మానవ జోక్యం లేకుండా పనిచేసేలా రూపొందించాలని భావిస్తున్నారు. చైనా కూడా చంద్రుడిపై అణుశక్తిని ఉపయోగించే ప్రణాళికలతో ముందుకెళ్తోంది. చైనాతో కలిసి రష్యా సెలీనా పేరుతో రియాక్టర్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు సమాచారం. 2036 నాటికి దీన్ని సిద్ధం చేయాలని రష్యా లక్ష్యంగా పెట్టుకుంది. ఇది 10 కిలోవాట్ల వరకు విద్యుత్ అందిస్తూ పదేళ్ల పాటు సొంతంగా పనిచేసేలా రూపొందించనున్నారు. చంద్రుడిపై ఒక రాత్రి రెండు వారాలకు పైగా ఉంటుంది. దీంతో సౌర విద్యుత్‌పై పూర్తిగా ఆధారపడటం కష్టం. ప్రారంభ దశలో అమెరికా, చైనా సౌర విద్యుత్, రేడియోఐసోటోప్ వ్యవస్థలను ఉపయోగించాలనుకుంటున్నాయి. అయితే పెద్ద స్థావరాలు ఏర్పడితే ఎక్కువ విద్యుత్ అవసరమవుతుంది. అక్కడే అణు రియాక్టర్లు కీలకంగా మారనున్నాయి. చంద్రుడిపై అణు రియాక్టర్ ఏర్పాటు అంత సులభం కాదు. రాకెట్ ప్రయోగం విఫలమైతే అణు పదార్థాల విషయంలో ప్రమాదం తలెత్తే అవకాశం ఉంది. చంద్రుడిపై రియాక్టర్‌ను భద్రపరచడం, నిర్వహించడం కూడా కష్టమే. వ్యోమగాములు, పరికరాల భద్రత కోసం రియాక్టర్ చుట్టూ కొన్ని ప్రాంతాలను పరిమితం చేయాల్సి రావచ్చని నిపుణులు చెబుతున్నారు. అమెరికా, రష్యా మాత్రం ప్రయోగ సమయంలో రియాక్టర్లను క్రియాశీలం చేయకుండా తీసుకెళ్లాలని భావిస్తున్నాయి. ఈ పోటీ మరో కీలక ప్రశ్నను కూడా తెరపైకి తెచ్చింది. 1967లో కుదిరిన ఔటర్ స్పేస్ ట్రీటీ ప్రకారం ఏ దేశమూ చంద్రుడిని తన భూభాగంగా ప్రకటించుకోకూడదు. అయితే భవిష్యత్తులో స్థావరాల చుట్టూ ఇతర దేశాల ప్రవేశాన్ని పరిమితం చేయవచ్చా చంద్రుడి నుంచి తీసే వనరులపై హక్కులు ఎవరికి ఉంటాయి అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సాంకేతిక, భద్రతా సవాళ్ల కారణంగా మూడు దేశాల ప్రస్తుత గడువులు మారే అవకాశం కూడా ఉంది.

# ఆహార సంక్షోభంలో ప్రపంచదేశాలు

## జర్మనీలో మ్యూనిచ్ లీడర్ల సమావేశంలో కేంద్ర ఆర్థికమంత్రి సీతారామన్

## కొలిక్కివస్తున్న భారత్ - అమెరికా ట్రేడ్ డీల్ చర్చలు



మ్యూనిచ్, అక్టోబరు 5: ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆహార సంక్షోభం ఎదురయ్యే ప్రమాదం ఉందంటూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సంచలన హెచ్చరిక చేశారు. జర్మనీలో జరిగిన మ్యూనిచ్ లీడర్స్ సమావేశంలో మాట్లాడిన ఆమె, భారత్‌అమెరికా ట్రేడ్ డీల్ నుంచి హోర్ముజ్ జలసంధి సమస్యల వరకు అనేక కీలక అంశాలపై స్పందించారు. ముఖ్యంగా సముద్ర మార్గాల్లో తలెత్తుతున్న ఆటంకాలు ప్రపంచ దేశాలకు ఎంత పెద్ద ముప్పుగా మారాయో స్పష్టంగా వివరించారు. హోర్ముజ్, బాబ్ అల్‌మండేబ్ వంటి ప్రధాన సముద్ర రవాణా మార్గాల్లో అడ్డంకులు ఏర్పడటం వల్ల ప్రపంచ దేశాల ఆహార భద్రత ప్రమాదంలో పడుతుందని నిర్మలా సీతారామన్ హెచ్చరించారు. దీనికి తోడు మలక్కా జలసంధి ప్రస్తావన కూడా తీసుకొస్తూ, ప్రస్తుతం అక్కడ ఎలాంటి ఇబ్బందులు లేవని, కానీ ఒకవేళ అక్కడ కూడా రవాణాకు ఆటంకం ఏర్పడితే పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ గ్లోబల్ ఆహార సంక్షోభాన్ని, సవాళ్లను తట్టుకోవడానికి భారత్ ఇప్పటికే బలమైన చర్యలు చేపట్టిందని ఆర్థిక మంత్రి వెల్లడించారు. ఎరువులను మోసుకొచ్చే షిప్పింగ్ లైన్లపై అదనపు భారం పడకుండా, పెరుగుతున్న ఇన్సూరెన్స్ ప్రీమియంలు, పేమెంట్ల సకాలంలో చెల్లింపులకు సాయం చేసేందుకు ప్రత్యేకంగా ఒక షిప్పింగ్ ఎమర్జెన్సీ ఫండ్‌ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎరువుల ధరలు పెరిగిపోవడం, ఓడల లభ్యత తగ్గడం, భారీగా ఇన్సూరెన్స్ ప్రీమియంలు పెరగడం వల్ల ఎరువుల దిగుమతికి తీవ్ర విఘాతం కలుగుతోందని, అందుకే దేశీయంగా యూరియా, ఫాస్ఫేట్ ఉత్పత్తిని పెంచేందుకు భారత్ కృషి చేస్తోందని అన్నారు. అయితే ఈ స్వదేశీ ఉత్పత్తి పూర్తిస్థాయికి చేరుకోవడానికి కొంత సమయం పడుతుందని తెలిపారు. ఇక భారత్ అమెరికా వ్యాపార ఒప్పందం గురించి మాట్లాడుతూ.. రెండు దేశాల మధ్య జరుగుతున్న ట్రేడ్ డీల్ చర్చలు ప్రస్తుతం ఒక నిర్ణీత స్థితికి చేరుకున్నాయని నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈ దశలో ఇరు దేశాలు అంతకుమించి ఇచ్చిపుచ్చుకోవడం లేదా వెనక్కి తగ్గడం చాలా కష్టమైన విషయమని స్పష్టం చేశారు. అలాగే అమెరికా ప్రస్తుతం జరుగుతున్న చర్చల కంటే భిన్నమైన మార్గాల ద్వారా భారత్‌తో ఉన్న వ్యాపార లోటును తగ్గించుకోవాలని చూస్తోందని ఆమె పేర్కొన్నారు.

## మొగుడు కావాలి..

### ఓ అమెరికా యువతి వినూత్న ప్రకటన



**న్యూయార్క్, అక్టోబరు 5:** అందరిలానే తాను కూడా ఎవరినో ప్రేమించిన పెళ్లి చేసుకుంటే ఏం వెరైటీ గా ఉంటుందని భావించిన అమెరికాకు చెందిన ఒక యువతి ఒక వినూత్న మార్గాన్ని ఎంచుకుంది. ఉద్యోగ ఖాళీ తరహాలో ఆమె ఆన్‌లైన్‌లో 'మొగుడు కావాలి' అని ఒక ప్రకటన ఇచ్చింది. న్యూయార్క్ పోస్టు కథనం ప్రకారం.. అప్పటికే డేటింగ్ యాప్స్ లాంటి వాటి ద్వారా తోడు కోసం వెతికి కాలాన్ని వృధా చేసుకుని విసిగి వేసారిన ఎరిన్ పాటర్సన్ అనే యువతి వినూత్నంగా ఒక గూగుల్ ఫామ్‌ను రూపొందించింది. దానిలో ఆమె తనకు కావాల్సిన భర్త గురించి ప్రశ్నలను ఉంచింది. 'నేను ఒక అందమైన, తెలివైన, సహృదయం గల, కాఫీ/డిన్నర్ చేస్తూ మంచి సంభాషణలు ఆస్వాదించే వ్యక్తి కోసం చూస్తున్నా' అని పేర్కొంది. ఆ ఫాంలోని ప్రశ్నావళిలో దరఖాస్తు చేయబోయే వ్యక్తి వృత్తిపరమైన సంబంధాలు, కెరీర్ లక్ష్యాలు, సంబంధాల పట్ల అంచనాలకు సంబంధించిన ప్రశ్నలు ఉన్నాయి. అంతేకాక దరఖాస్తుదారుడి వృత్తిపరమైన లక్ష్యాలు, అతడి రోజువారీ దినచర్య, వ్యాయామ విధానాలు, పెళ్లిపై, కుటుంబంపై అతడి అభిప్రాయాలకు సంబంధించిన ప్రశ్నలు కూడా ఉన్నాయి. ఆమె ప్రకటనకు అనూహ్య స్పందన వచ్చింది. ఆమెను పెళ్లాడటానికి పలువురు క్యూ కట్టారు. ఇప్పటివరకు ఆమెకు 240 దరఖాస్తులు వచ్చాయి. ఇది వినూత్నమైన ఆలోచన అని పలువురు నెటిజన్లు ప్రశంసించారు.

## మచ్చర్‌లా ఉండండి.. కాక్రోచ్‌లా కాదు..

### పుణేలో ఉద్రిక్తతలు రేపుతున్న పోస్టర్లు




**పూణె, అక్టోబరు 5:** మహారాష్ట్రలోని పుణే నగరంలో వెలసిన కొన్ని పోస్టర్లు ఇప్పుడు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. "మచ్చర్ లా ఉండండి, కాక్రోచ్‌లా కాదు" అనే వింత నినాదంతో ఏర్పాటు చేసిన ఈ పోస్టర్లు రాజకీయ దుమారం రేపుతున్నాయి. ఒకవైపు ఫ్లైదుబాయ్ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను హీరోగా చూపిస్తూ, మరోవైపు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) అనే వ్యంగ్య నిరసన బృందాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ పోస్టర్లను ప్రదర్శించారు. భారతీయ జనతా యువ మోర్చా ఈ పోస్టర్లను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. గత సెప్టెంబర్ నెలలో దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళుతున్న ఫ్లైదుబాయ్ విమానంలో ఒక అనూహ్య ఘటన చోటుచేసుకుంది. విమానం గాల్లో ఉండగా, సహ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆ క్లిష్ట పరిస్థితుల్లో కెప్టెన్ మచ్చర్ అప్రమత్తమై, విమానాన్ని తిరిగి తన ఆధీనంలోకి తెచ్చుకుని సురక్షితంగా ల్యాండ్ చేశారు. దీంతో ఆయన ధైర్యసాహసాలను అందరూ ప్రశంసించారు. హిందీలో మచ్చర్ అంటే దోమ అని అర్థం. ఆయన ఇంటిపేరును వాడుకుంటూ, ఆయనను సానుకూల దృక్పథానికి ప్రతీకగా ఈ పోస్టర్లలో చూపించారు. ఏమిటీ కాక్రోచ్ జనతా పార్టీ ఇక బొద్దింక ప్రస్తావన వెనుక కూడా ఒక నేపథ్యం ఉంది. ఈ ఏడాది మే నెలలో కొందరు ఉద్యమకారులు, నిరుద్యోగ యువతను ఉద్దేశించి భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ బొద్దింకలు అని వ్యాఖ్యానించినట్లు వార్తలు వచ్చాయి. అయితే, తన మాటలను తప్పుగా ప్రచురించారని ఆయన తర్వాత స్పష్టం చేశారు. ఈ వివాదాన్ని ఆధారంగా చేసుకుని అభిజీత్ దీప్కే అనే సామాజిక కార్యకర్త కాక్రోచ్ జనతా పార్టీ పేరుతో ఆన్‌లైన్‌లో ఒక వ్యంగ్య బృందాన్ని ప్రారంభించారు. పరీక్ష పత్రాల లీకేజీలు, ప్రభుత్వ పాఠశాలల దుస్థితి వంటి అంశాలపై ఈ బృందం వినూత్నంగా నిరసనలు తెలుపుతూ గుర్తింపు పొందింది. ఈ నేపథ్యంలోనే సీజేపీని కించపరిచేలా, కెప్టెన్ మచ్చర్‌ను హీరోగా చూపిస్తూ ఈ పోస్టర్లు వెలిశాయి. ఒక పైలట్ సాధించిన వ్యక్తిగత ఘనతను, ఆయన ఇంటిపేరును ఇలా రాజకీయ వివాదంలోకి లాగడంపై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వింత పోస్టర్ల వివాదం పుణేలో స్థానిక రాజకీయ వేడిని పెంచడంతో పాటు సాహస పైలట్ కెప్టెన్ మచ్చర్‌తో పాటు సీజేపీని కూడా జాతీయ స్థాయిలో వార్తల్లో నిలిపింది.



## యెమెన్‌లో పోరు ఉధృతం.. కీలక పట్టణం హౌతీల చేతుల్లోకి

**సానా, అక్టోబరు 5:** యెమెన్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరాన్ మద్దతు కలిగిన హూతీ తిరుగుబాటుదారులు దేశంలో మరింత భూభాగాన్ని ఆక్రమించుకున్నారు. కీలకమైన తుర్బా పట్టణాన్ని తమ నియంత్రణలోకి తెచ్చుకున్నారు. హూతీలపై స్థానిక ప్రభుత్వం (పిఎల్‌సి) భారీ సైనిక చర్యను ప్రకటించడానికి కొద్దిసేపటి ముందే ఈ పరిణామం చోటుచేసుకుంది. మరోవైపు యెమెన్ ప్రభుత్వానికి మద్దతుగా ఉన్న సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు.. హూతీలపై విరుచుకుపడుతున్నాయి. కొన్ని రోజులుగా హూతీలు దేశంలోని మూడో అతిపెద్ద నగరమైన తైజ్‌లోకి చొచ్చుకెళ్లేందుకు చూస్తున్నారు. యెమెన్ సర్కారుకు కేంద్రంగా ఉన్న ఏడెన్‌ను, తైజ్‌ను కలిపే ప్రధాన రహదారిపై తుర్బా పట్టణం ఉంది. హూతీల నుంచి తైజ్‌ను రక్షించే ప్రభుత్వ బలగాలకు ఇది కీలక స్థావరంగా ఉంటూ వచ్చింది. అంతకుముందు హూతీలు తైజ్ శివార్లలోని అనేక ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నారు. గత నెలలో మోఖా రేవు పట్టణం, బాబ్ ఎల్ మండెబ్ జలసంధిపై వారు నియంత్రణ సాధించిన విషయం తెలిసిందే. హూతీల నియంత్రణలో ఉన్న భూభాగాలను తిరిగి స్వాధీనం చేసుకోవడమే లక్ష్యంగా యెమెన్ ప్రభుత్వం 'డాన్ ఆఫ్ యెమెన్' పేరిట ఆదివారం భారీ సైనిక చర్యను ప్రకటించింది. ఈ క్రమంలోనే బాబ్ ఎల్ మండెజ్ జలసంధిని తమ నియంత్రణలోకి తీసుకోవడంలో పైచేయి సాధించామని తాజాగా ప్రకటించింది. ధుబాబ్ అనే తీరప్రాంత పట్టణంతోపాటు, దాని సమీపంలోని విమానాశ్రయాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది.

# ఉద్యోగ వీసాలపై అమెరికా మరింత కఠినం!

**వాషింగ్టన్, అక్టోబరు 5:** అమెరికాలో విదేశీయులకు జారీ చేసే ఉద్యోగ వీసా కార్యక్రమాలపై ట్రంప్ యంత్రాంగం తన వైఖరిని మరింత కఠినతరం చేయనుంది. ముఖ్యంగా హెచ్1బీ వంటి వీసాలపై పర్యవేక్షణను తీవ్రతరం చేస్తూ ఈ వారంలోనే కీలక చర్యలు తీసుకోబోతున్నట్లు అమెరికా కార్మిక శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆంథోనీ డిఎస్పోసిటో స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. ఈ పరిణామంతో విదేశీ ఉద్యోగులలో, వారిపై ఆధారపడిన కంపెనీలలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఆంథోనీ డిఎస్పోసిటో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ వేదికగా చేసిన ఒక పోస్ట్‌లో ఈ విషయాన్ని వెల్లడించారు.

ఈ వారం విదేశీ లేబర్ వీసాల విషయంలో చాలా కీలకమైనది. మేము ఈ అంశాన్ని సరికొత్త స్థాయికి తీసుకెళ్తున్నాం. అమెరికన్ ఉద్యోగాలు అమెరికన్ కార్మికులని ఆయన పేర్కొన్నారు. అయితే, ఏయే వీసా కార్యక్రమాలను లక్ష్యంగా చేసుకుంటున్నారో, ఏ కంపెనీలపై చర్యలు ఉంటాయో లేదా ఎలాంటి దర్యాప్తులు చేపట్టనున్నారో ఆయన తన పోస్ట్‌లో స్పష్టంగా వెల్లడించలేదు. ఈ ప్రకటన రాబోయే చర్యల తీవ్రతను సూచిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇది ట్రంప్ ప్రభుత్వం కొంతకాలంగా అనుసరిస్తున్న విస్తృత విధానంలో భాగమే. ఉపాధి ఆధారిత వలస విధానాలను కఠినతరం చేయడంపై, ముఖ్యంగా హెచ్1బీ వీసా కార్యక్రమంపై, ట్రంప్ సర్కార్ మొదటి నుంచి దృష్టి సారించింది. సెప్టెంబర్‌లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక కీలక కార్యనిర్వాహక ఉత్తర్వుపై (ఎగ్జిక్యూటివ్ ఆర్డర్) సంతకం చేశారు. దీని ప్రకారం హెచ్1బీ వీసాల కోసం దరఖాస్తు చేసుకునే కంపెనీలు అదే విధమైన నైపుణ్యాలు కలిగిన అమెరికన్ ఉద్యోగులను ఇటీవల తొలగించాయా లేదా తొలగించే ప్రణాళికలో ఉన్నాయా అనే విషయాన్ని సంబంధిత ఏజెన్సీలు తప్పనిసరిగా సమీక్షించాలని ఆదేశించారు. దీనికి అనుబంధంగా, అమెరికా వెలుపల ఉన్న కార్మికులకు సంబంధించిన కొన్ని ప్రత్యేక హెచ్1బీ పిటిషన్లపై విధించే లక్ష డాలర్ల ఫీజు ఆవశ్యకతను 2027 సెప్టెంబర్ వరకు పొడిగిస్తూ మరో ప్రకటన జారీ చేశారు. ఈ చర్యల ద్వారా వీసా ప్రక్రియను మరింత నియంత్రించి, అమెరికన్ ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడాలనేది ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తోంది. ప్రభుత్వంలోని కీలక వ్యక్తులు కూడా ఇదే తరహా అభిప్రాయాలను బలంగా వినిపిస్తున్నారు. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ హెచ్1బీ వీసా కార్యక్రమాన్ని పూర్తిగా విఫలమైనదిగా అభివర్ణించారు. కొన్ని కంపెనీలు అమెరికన్ ఉద్యోగులను తొలగించి, వారి స్థానంలో తక్కువ జీతాలకు పనిచేసే విదేశీ కార్మికులను నియమించుకోవడానికి ఈ వీసాలను ఒక సాధనంగా వాడుకుంటున్నాయని ఆయన తీవ్రంగా ఆరోపించారు.

ఈ విధానంలోని లోపాలను సరిదిద్దడానికే తమ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని ఆయన స్పష్టం చేశారు. మొత్తం మీద, విదేశీ వీసా కార్యక్రమాలలో జరుగుతున్నాయని ఆరోపిస్తున్న దుర్వినియోగాన్ని అరికట్టి, అమెరికన్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంపై ట్రంప్ యంత్రాంగం పూర్తి స్థాయిలో దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది.

## జైరాం అంత తొందరపడతారనుకోలేదు!

### కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ, అక్టోబరు 5:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్‌పై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోషల్ మీడియా వేదికగా తీవ్రస్థాయిలో స్పందించారు. "జైరాం, నమ్మలేకపోతున్నాను. మీరింత తొందరపడతారని నేను అనుకోలేదు. అక్కడ ఉన్నది టీడీపీ, జనసేన కార్యకర్తలు. తమ నాయకులైన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లతో మాట్లాడాలని వారు ఉత్సాహం చూపారు. కార్యక్రమం తర్వాత బయటకు వచ్చి మాట్లాడతారని గౌరవ ముఖ్యమంత్రి వారికి చెప్పారు. అక్కడ జరిగింది అంతే" అని ఆమె తన పోస్టులో ఘాటుగా బదులిచ్చారు. ఓ చిన్న విషయాన్ని వక్రీకరించి తప్పుడు ప్రచారం చేయడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇటీవల అన్నమయ్య జిల్లా మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ నిర్మాణ పనుల ప్రారంభోత్సవ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ప్రసంగిస్తుండగా, సభకు హాజరైన కొందరు యువకులు తమ నాయకులను చూడాలనే ఉత్సాహంతో కేకలు వేశారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కలుగజేసుకుని, కార్యక్రమం ముగిశాక నాయకులు అందరితో మాట్లాడతారని చెప్పి వారిని శాంతపరిచారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను సులేమాన్ ఖాన్ అనే వ్యక్తి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ, మొదట ఉద్యోగాలు ఇవ్వండి అంటూ సభలోని వారు నినాదాలు చేశారని తప్పుడు సమాచారాన్ని జతచేశారు. ఈ పోస్టును జైరాం రమేశ్ రీపోస్ట్ చేస్తూ, "ప్రజల్లో ఎంత ఆగ్రహం ఉందో ఆర్థిక మంత్రి స్వయంగా చూస్తున్నారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని ప్రజలను నిశ్శబ్దంగా మార్చాల్సి వచ్చింది" అని వ్యాఖ్యానించారు. జైరాం రమేశ్ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. వాస్తవాలు తెలుసుకోకుండా, ఎవరో పెట్టిన తప్పుడు పోస్టు ఆధారంగా వ్యాఖ్యలు చేయడం తగదని హితవు పలికారు. సభలో కనిపించింది ప్రజాగ్రహం కాదని, తమ నాయకుల పట్ల ప్రజలు, కార్యకర్తలు చూపిన ఉత్సాహం అని వారు స్పష్టం చేశారు. ఈ ఘటనతో ఏపీలోని ఓ కార్యక్రమం చుట్టూ జాతీయ స్థాయిలో సోషల్ మీడియా వేదికగా రాజకీయ మాటల యుద్ధం రాజుకుంది.

## రూ.2.5 లక్షలు లంచంతో పట్టుబడిన డిజిసిఎ అధికారి

**చెన్నై,అక్టోబరు 5:** విమానం ఎయిర్‌వర్తినెస్ సర్టిఫికేషన్ కోసం, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) అధికారి లంచం డిమాండ్ చేశారు. ఒక విమానయాన సంస్థ డైరెక్టర్ నుంచి రూ.2.5 లక్షలు తీసుకున్నారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) దృష్టికి ఇది వెళ్లింది. ఈ నేపథ్యంలో డీజీసీఏ అధికారితో పాటు విమానయాన సంస్థ డైరెక్టర్‌ను అరెస్ట్ చేసింది. తమిళనాడు రాజధాని చెన్నైలో ఈ సంఘటన జరిగింది. ఏక్వి ఎయిర్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ఒక ట్రైనింగ్ ఫ్లైట్‌కు ఎయిర్‌వర్తినెస్ సర్టిఫికేషన్ సంబంధించి చెన్నై డీజీసీఏ డిప్యూటీ డైరెక్టర్ (ఎయిర్‌వర్తినెస్) సుశీల్ కుమార్ గార్గ్ లంచం డిమాండ్ చేశారు. ఇది సీబీఐ దృష్టికి వెళ్లింది. కాగా, ఆ విమానయాన సంస్థ డైరెక్టర్ సచిన్ కేశవ్ భానే నుంచి డీజీసీఏ అధికారి సుశీల్ కుమార్ గార్గ్ రూ.2.5 లక్షలు లంచం తీసుకుంటుండగా సీబీఐ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

## మహిళలపై నేరాలకు పాల్పడితే నిందితులకు వణుకుపుట్టించాలి :సుప్రీం

**న్యూఢిల్లీ,అక్టోబరు 5:** మహిళలపై నేరాలకు పాల్పడే సామాజిక వ్యతిరేక శక్తుల మనసుల్లో భయాన్ని సృష్టించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నేరం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే, నేరాలు జరగకుండా నివారించడమే అత్యంత ముఖ్యమని ఢిల్లీ పోలీసులకు హితవు పలికింది. ఇటీవల ఢిల్లీజాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)లో వరుసగా చోటుచేసుకున్న అత్యాచార ఘటనలపై సుమోటోగా విచారణ చేపట్టిన ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా పోలీసుల పనితీరుపై పలు సూచనలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ పార్థీవాలా మాట్లాడుతూ మహిళలపై దాడులకు పాల్పడాలనుకునే దుండగులకు తాము పట్టుబడితే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందనే భయం ఉండాలి. అలాంటి వాతావరణాన్ని మీరు కల్పించాలని పోలీసులను ఆదేశించారు. నేరాలను అరికట్టేందుకు నివారణ చర్యలను మరింత బలోపేతం చేయాలని ఈ సందర్భంగా న్యాయస్థానం నొక్కి చెప్పింది. ఢిల్లీలో మహిళల భద్రతకు సంబంధించి పలు నిర్దిష్ట ఆదేశాలను ధర్మాసనం జారీ చేసింది. సమస్యాత్మక ప్రాంతాల్లో బీట్ పెట్రోలింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని, వెలుతురు సరిగా లేని ప్రదేశాలను గుర్తించి వెంటనే లైటింగ్ సౌకర్యం మెరుగుపరచాలని సూచించింది. అలాగే, నిఘా వ్యవస్థలను పటిష్ఠం చేయాలని తెలిపింది. దుండగులు, పోకిరీలు ఎక్కువగా గుమికూడే అక్రమ తినుబండారాల కేంద్రాలు, మద్యం దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ముఖ్యంగా విద్యాసంస్థల సమీపంలో అమ్మాయిలను వేధించే వారిపై ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేసింది.

దేశ రాజధాని పరిధిలో మైనర్లపై జరిగిన లైంగిక దాడులతో సహా వరుస అత్యాచార ఘటనల నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ కేసును సుమోటోగా విచారణకు స్వీకరించింది. గతంలో కూడా కోర్టు మహిళల భద్రతపై ఆడిట్ నిర్వహించాలని, ఇతర తాత్కాలిక చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. తాజా విచారణలో తీసుకున్న చర్యలపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని ఢిల్లీ పోలీసులను ధర్మాసనం ఆదేశించింది.

## నకిలీ సుప్రీం ఉత్తరువు సాయంతో జీవితఖైదీని విడుదలచేసిన డిఐజి అరెస్టు



**బెంగళూరు, అక్టోబరు 5:** నకిలీ సుప్రీంకోర్టు ఉత్తర్వుతో జీవిత ఖైదీని జైలు నుంచి విడుదల చేసినట్లు ప్రస్తుతం జైళ్ల శాఖ డీఐజీగా ఉన్న పోలీస్ అధికారిపై ఆరోపణలు రావడంతో దర్యాప్తు చేసిన పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణ నిమిత్తం పోలీస్ కస్టడీకి తరలించారు. కర్ణాటకలో ఒక కిడ్నాప్ కేసులో దోషిగా తేలిన శంకర్‌కు ఫాస్ట్ ట్రాక్ కోర్టు 2004లో జీవిత ఖైదు, రూ. 10,000 జరిమానా విధించింది. కర్ణాటక హైకోర్టు, సుప్రీంకోర్టులో అతడు దాఖలు చేసిన అప్పీళ్లలో కూడా ఆ శిక్ష రద్దు కాలేదు. ఆ సమయంలో బెంగళూరు కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీల విభాగంలో సెకండ్ డివిజన్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీకాంత్, సుప్రీంకోర్టు ఉత్తర్వుగా పేర్కొన పత్రాన్ని ఫోర్జరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. నాడు బెంగళూరు సెంట్రల్ జైలు చీఫ్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన సోమశేఖర్ దీనికి సహకరించినట్లు ఆరోపించారు. 2018 నవంబర్ 2న ఉత్తర్వు జారీ చేసినట్లుగా ఉన్న నకిలీ సుప్రీంకోర్టు ఉత్తర్వు ఆధారంగా నవంబర్ 13న శంకర్‌ను జైలు నుంచి విడుదల చేసినట్లు పేర్కొన్నారు. మరోవైపు ఈ ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు చేశారు. జైలు నుంచి విడుదలైన శంకర్ భార్యను కూడా ప్రశ్నించారు. దీంతో విడుదల కోసం జారీ చేసిన సుప్రీంకోర్టు ఉత్తర్వు నకిలీ అని తేలింది. ఈ నేపథ్యంలో బెంగళూరు సెంట్రల్ జైలు ఇన్‌ఛార్జ్ సూపరింటెండెంట్ ఈ ఏడాది మే 20న పరప్పన అగ్రహార పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో దీనిపై కేసు నమోదైంది. అయితే ప్రస్తుతం కర్ణాటక జైళ్లు, సంస్కరణ సేవల విభాగం డీఐజీగా ఉన్న ఎం సోమశేఖర్ ఈ కేసు విచారణకు సహకరించలేదని, ఈ కేసుకు సంబంధించిన సమాచారాన్ని ఆయన దాచినట్లు తదుపరి విచారణలో తేలింది. ఈ నేపథ్యంలో అక్టోబర్ 4న పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం పోలీస్ కస్టడీకి తరలించారు.

# సంక్షిప్త వార్తలు

## శరదృతువుతో రంగులు మారిన జమ్ముకాశ్మీర్



**శ్రీనగర్, అక్టోబరు 5:** కశ్మీర్ లోయ ప్రకృతి రమణీయతతో కొత్త శోభను సంతరించుకుంది. వలస పక్షుల రాక, కీచురాళ్ల శబ్దాలు, పండిన పంట పొలాల్లో గింజలను ఏరుకునే గువ్వల సందడితో లోయలో శరదృతువు ప్రారంభమైంది. రైతులు వరి కోతలు పూర్తి చేసి ధాన్యాన్ని ఇళ్లకు చేరుస్తుండగా, పండ్ల తోటల యజమానులు యాపిల్స్ కోత పనుల్లో నిమగ్నమయ్యారు. స్థానిక మార్కెట్లు ద్రాక్ష, తామర తూళ్లు, తాజా కూరగాయలతో కళకళలాడుతున్నాయి. వాతావరణంలోనూ స్పష్టమైన మార్పులు గోచరిస్తున్నాయి. ఆకాశం నిర్మలంగా ఉన్నప్పటికీ, పగటిపూట ఎండ తీవ్రత అధికంగానే ఉంటోంది.

## 37 కోట్ల యేళ్లక్రితం ఏర్పడిన ఏమ్స్ ఉల్కాపాతం!



**ఓక్లహోమా, అక్టోబరు 5:** అమెరికాలోని ఓక్లహోమాలో ఉన్న ఏమ్స్ ఉల్కాపాతం క్రేటర్ (బిలం) వయసును శాస్త్రవేత్తలు సవరించారు. గతంలో భావించినట్లుగా ఇది 46.7 కోట్ల ఏళ్ల క్రితం కాకుండా, సుమారు 37 కోట్ల ఏళ్ల క్రితం ఏర్పడిందని టెక్సాస్ విశ్వవిద్యాలయం పరిశోధకులు తేల్చారు. ఇప్పటివరకు ఉన్న అంచనా కంటే దీని వయసు దాదాపు 10 కోట్ల సంవత్సరాలు తక్కువ. ఈ కొత్త ఆవిష్కరణతో, భూమిపై భారీస్థాయిలో జీవరాశులు అంతరించిన కాలానికి ఈ ఉల్కాపాత సంఘటన దగ్గరగా జరిగినట్లు తెలుస్తోంది. ఓక్లహోమాలోని ఏమ్స్ పట్టణం కింద కొన్ని మైళ్ల వెడల్పున ఈ బిలం విస్తరించి ఉంది.

## ఇద్దరు కేంద్ర మంత్రులకు టికెట్ నో!

**లక్నో, అక్టోబరు 5:** ఉత్తరప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అనూహ్య నిర్ణయం తీసుకుంది. పదవీకాలం ముగియనున్న ఇద్దరు కేంద్ర మంత్రులతో సహా ఏ ఒక్క సిట్టింగ్ ఎంపీకి తిరిగి అవకాశం కల్పించకుండా, ఎనిమిది మంది కొత్త ముఖాలను బరిలోకి దింపింది. ముఖ్యంగా కేంద్ర మంత్రులు హర్దీప్ సింగ్ పురి, బీఎల్ వర్మలను పక్కనపెట్టడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఉత్తరప్రదేశ్ నుంచి ఖాళీ అవుతున్న 10 రాజ్యసభ స్థానాలకు అక్టోబర్ 16న పోలింగ్ జరగనుంది. అసెంబ్లీలోని బలాబలాల ప్రకారం బీజేపీ ఎనిమిది, సమాజ్‌వాదీ పార్టీ రెండు స్థానాలను గెలుచుకునే అవకాశం ఉంది.

## గర్ల్‌ఫ్రెండ్‌తో ఎఫ్‌బిఐ డైరెక్టర్ కాష్‌పటేల్ నిశ్చితార్థం



**వాషింగ్టన్, అక్టోబరు 5:** అమెరికా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) డైరెక్టర్ కాశ్ పటేల్ తన వ్యక్తిగత జీవితంలో నూతన అధ్యాయాన్ని ప్రారంభించబోతున్నారు. తన గర్ల్‌ఫ్రెండ్, కంట్రీ సింగర్ అయిన అలెక్సిస్ విల్కిన్స్‌తో నిశ్చితార్థం జరిగినట్లు ఆయన వెల్లడించారు. ఆదివారం సాయంత్రం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ వేదికగా ఈ జంట తమ ఎంగేజ్‌మెంట్‌ను అధికారికంగా వెల్లడించింది. 27 ఏళ్ల అలెక్సిస్ విల్కిన్స్ తన నిశ్చితార్థపు ఉంగరాన్ని ప్రదర్శిస్తూ, 46 ఏళ్ల కాశ్ పటేల్‌తో కలిసి దిగిన బ్లాక్ అండ్ వైట్ ఫోటోను పోస్ట్ చేశారు. ఈ ఫోటోను పటేల్ సైతం రీపోస్ట్ చేశారు.

## అనుమతి లేకుండా దీదీ మెడికల్ రికార్డులు విడుదలపై నోటీసులు



**కోల్‌కతా, అక్టోబరు 5:** పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ తరపున న్యాయవాది ఎస్ఎస్‌కేఎం ఆస్పత్రితో పాటు బంగుర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూరోసైన్సెస్‌కు లీగల్ నోటీసులు జారీ చేశారు. దీదీకి చెందిన 2021 నాటి మెడికల్ రికార్డులను అనుమతి లేకుండా రిలీజ్ చేసిన కేసులో ఆ ఆస్పత్రులకు నోటీసు ఇచ్చారు. 2021 నందిగ్రామ్ ఎన్నికల ప్రచారంలో తన కాలుకు గాయమైనట్లు మమతా బెనర్జీ ఫేక్ మెడికల్ రిపోర్టు రిలీజ్ చేసిందని ప్రస్తుత సీఎం సువేంధు అధికారి ఇటీవల ఆరోపించిన విషయం తెలిసిందే.

6-10Pg6exHMNWJQETCL.qxd:6-10Pg6exHMNWJQETCL.qxd 1/1/02 8:28 AM Page 1



# పుణ్యతీర్థాల పవిత్ర పుష్కరిణి !

- వైకుంఠం నుండి కలియుగంలో పాపాల హారణం



**తిరుమల,అక్టోబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:** కోట్లాది పు ణ్య తీర్థాల కలయికతో పునీతమవుతున్న కలియు గవైకుంఠం తిరుమలలోని శ్రీవారి పుష్కరిణిలో స్నానమాచరిస్తే సకల పాపాలు హరిస్తాయని ప్రగాఢ విశ్వాసం.దక్షిణ భారతదేశంలోనే ఆధ్యా త్మిక క్షేత్రంగా వెలుగొందుతున్న తిరుమల క్షేత్రం లో అడుగడుగునా దివ్యత్వం ఉట్టిపడుతుంది. అలవైకుంఠం నుండి గరుత్మంతుడు ఈ పవిత్ర సరస్సు ను భూలోకంపైకి తీసుకురావడంతో స్వా మివారి పుష్కరిణికి అత్యంత పవిత్రంగా భావిస్తు న్నారు. ఇందులో స్నానమాచరిస్తే సకల పాపాలు హరిస్తుందని పురాణాల కథనం.విజయనగర రాజుల కాలం నుండి ప్రత్యేక పూజలు, హార తులు. ఇస్తున్నారు. అరవై ఆరు కోట్ల తీర్థాలలో అత్యంత ప్రధానమైనదిగా శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి ఉత్తర దిశలో ఉన్న స్వామి పుష్కరి ణి విరాజిల్లుతోంది. ఇది వైకుంఠంలోని విరజా నది అని, గరుత్మంతుడిచే భూలోకానికి తీసుకు రాబడిందని పురాణాలు చెబుతున్నాయి. శ్రీమహా విష్ణువు పాదాల నుండి ఉద్భవించి, బ్రహ్మదేవుని కరస్పర్శతో పవిత్రమై, సనకసనందనాది మహ ర్షులచే స్తుతించబడిన ఈ తీర్థం మహిమా న్వితమైనదిగా పురాణాలు కీర్తిస్తున్నాయి.

భూదేవికి క్రీడా సరస్సుగా ఉండేదని పురాణ కథనం. వరాహ, పద్మ, మార్కండేయ, వామన, స్కాంద, బ్రహ్మ, భవిష్యోత్తర వంటి అనేక పురా ణాల్లో ఈ పుష్కరిణి ప్రస్తావన ఉంది. వేంకటా చలంలోని సమస్త తీర్థాలకు ఈ పుష్కరిణియే అవతార స్థానంగా పేర్కొనబడింది. గంగానది వంటి సర్వ పుణ్యనదులకు ఇది జన్మస్థానమని, అందుకే దీని దర్శనం, స్పర్శనం, స్మరణం కూడా సర్వాభీష్టాలను ప్రసాదిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.సుమారు ఒకటిన్నర ఎకరం విస్తీర్ణంలో ఉన్న ఈ పుష్కరిణి మధ్యలో ఉన్న అందమైన నీరాళీ మం డపాన్ని విజయనగర రాజు సాళువ నరసింహ రాయలు నిర్మించారు. ఆ తర్వాత తాళ్లపాక అన్న మయ్య ఈ మండపం అభివృద్ధికి చర్యలు తీసుకు న్నారని చారిత్రక ఆధారాలు చెబుతున్నా యి.విజయనగరరాజు శ్రీకృష్ణదేవరాయల కాలం నుండి ఇక్కడ హారతి సేవలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. భక్తుల సౌకర్యార్థం 1972లో పుష్కరిణిలో ఫిల్టర్లను, కాలువలను ఏర్పాటు చేశా రు. ఎప్పటికప్పుడు పాత నీటిని తొలగించి, తా జా నీటితో నింపుతూ దీని పవిత్రతను కాపాడుతున్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల సమయంలో ప్రతిరోజూ ఉదయం, రాత్రి వాహన సేవలు పుష్కరిణి వద్దకు రాగానే స్వామివారికి హారతి ఇస్తారు. ఇతర రోజుల్లో ప్రతి సాయంత్రం సహస్రదీపాలంకార సేవ అనంతరం పుష్కరిణికి మంగళ హారతి ఇవ్వడం సంప్రదాయంగా వస్తోంది.స్వామి పుష్కరిణిలో స్నానం చేయడం సర్వ పాపాలను హరించి, సకల కోరికలను నెరవేరుస్తుందని పురాణాలు ఘోషిస్తున్నాయి.

# పౌర సేవల్లో నాణ్యతకు సామర్థ్యమే కీలకం..

- ఉద్యోగుల నైపుణ్యాల పెంపుపై సీఎం దిశానిర్దేశం.
- రెండున్నరేళ్లలో గృహ నిర్మాణం లక్ష్యాల పూర్తికి కార్యాచరణ..
- రాష్ట్రంలో 20 లక్షల ఇళ్లకు సౌర విద్యుత్ కనెక్షన్లు లక్ష్యంగా ప్రణాళిక.
- ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి, అక్టోబరు 05,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజ లకు అందించే ప్రభుత్వ సేవల్లో నాణ్యత పెరగా లంటే ఉద్యోగుల సామర్థ్యాన్ని నిరంతరం పెంచు కోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశా రు. ప్రభుత్వ ఉద్యోగులు కొత్త విషయాలను నేర్చు కుంటూ తమ నైపుణ్యాలను మెరుగు పరుచు కోవాలని సూచించారు. కెపాసిటీ బిల్డింగ్ కమిష న్, మిషన్ కర్మయోగి పోర్టల్, ఉన్నతి ద్వారా అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ కోర్సులను సద్విని యోగం చేసుకోవాలని చెప్పారు. ఆన్‌లైన్‌తో పాటు ఐఐఎంలు, ఐఐటీలు, విశ్వవిద్యాలయాలు తదితర సంస్థల్లో ఆఫ్‌లైన్ శిక్షణ కూడా పొందాలన్నారు. అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో ఆర్టీజీఎస్ సమీక్షలో భాగంగా వివిధ శాఖలు అంది స్తున్న పౌర సేవలపై ముఖ్యమంత్రి సోమవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్య పెంపునకు ఐగాట్ మిషన్ కర్మయోగి ఆన్‌లైన్ కోర్సులు ఎంతగానో ఉపయోగపడుతు న్నాయని సీఎం తెలిపారు. ఓ సెకండరీ గ్రేడ్ టీచ ర్ ఏకంగా 4,200 కోర్సులు పూర్తి చేసి తన సామర్థ్యాన్ని పెంచుకున్న విషయాన్ని ముఖ్య మంత్రి ప్రస్తావించారు. ఉద్యోగులు తమ విధులకు సంబంధించిన అంశాలతో పాటు ఆధునిక సాం కేతికత, పరిపాలన, ప్రజాసేవకు సంబంధించిన కోర్సులను అభ్యసించాలని సూచించారు. సాను కూల ప్రజాభిప్రాయాన్ని పెంచుకోవడంలో వెనుక బడిన శాఖలు, విభాగాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని చెప్పారు. సామర్థ్య పెంపుతో పాటు ప్రజల్లో ప్రభుత్వంపై సానుకూల అభిప్రాయం పెరిగేలా శాఖలు కార్యాచరణ రూపొందించుకో వాలని సూచించారు. త్వరలో క్షేత్రస్థాయిలో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తానని సీఎం వెల్లడించారు.

**గుంతల పూడ్చివేతకు ఆధునిక సాంకేతికత.**

రహదారులపై గుంతల పూడ్చివేతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని ముఖ్య మంత్రి ఆదేశించారు. గుంతలు పూడ్చడంతో పాటు రహదారుల నిర్వహణపై నిరంతరం దృష్టి పెట్టాలని సూచించారు. బిటుమిన్ లభ్యత, ఫ్లైయాష్ అందుబాటులో ఉన్న పరిమాణంపై అధికారులను ఆరా తీశారు. ఆర్టీసీ బస్సులు నిర్ణీత సమయానికి గమ్య స్థానాలకు చేరేలా షెడ్యూలింగ్, టైమ్ మేనేజ్‌మెంట్ పక్కాగా అమ లు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం చేపట్టిన మూడు లక్షల ఇళ్ల నిర్మాణంతో పాటు మరో ఆరు లక్షల ఇళ్ల నిర్మాణానికి కార్యాచరణ రూపొందిం చాలని సీఎం సూచించారు. వచ్చే రెండున్నర ఏళ్లలో నిర్దేశించుకున్న గృహ నిర్మాణ లక్ష్యాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సి ఉందని, దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను త్వరగా గుర్తించాలని చెప్పారు. ఎక్కడా డూప్లికేషన్ లేకుండా వన్ ఫ్యామిలీ.. వన్ హౌస్ విధానంలో అర్హులకు వేగంగా ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఆదేశించారు.

**సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు లక్ష్యాన్ని చేరుకోవాలి..**

జల్ జీవన్ మిషన్ ద్వారా పట్టణ, గ్రామీణ ప్రాం తాల్లో ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించే లక్ష్యాన్ని రెండేళ్లలో పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో చేపడు తున్న మౌలిక సదుపాయాల కల్పన పనులను కూడా వేగవంతం చేయాలని సూచించారు. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో మొబైల్ కనెక్టివిటీ పెంచేందుకు అవసరమైన ప్రాంతాల్లో సెల్ టవర్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పీఎం సూర్యఘర్ పథకం కింద ఇళ్ల పై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు ప్రక్రియను వేగవం తం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇప్ప టికే 4.1 లక్షల కనెక్షన్లతో దేశంలో నాలుగో స్థా నంలో ఉన్నామని అధికారులు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలపైనా సౌర విద్యుత్ ఫల కాల ఏర్పాటుతో 200 మెగావాట్ల విద్యుత్ ఉత్ప త్తికి ఆస్కారం ఉందని వివరించారు. కుప్పం నియోజకవర్గంలో మొత్తం ప్రాంతాన్ని ఇళ్లపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు చర్యలు చేపడు తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల ఇళ్లకు సోలార్ కనెక్షన్లు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని సీఎం ఆదేశించారు.

**..పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ..**

రాష్ట్రంలో రానున్న పెట్టుబడులకు అనుగుణంగా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిం చేలా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను రూపొందిం చాలని సీఎం సూచించారు. ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్యా లు అందించాలని చెప్పారు. పీఎం సేతు-ఆర్సె లార్ మిట్టల్ స్కిల్ సెంటర్ ద్వారా మెరుగైన శిక్ష ణ అందించాలని, ఐటీఐలు, పాలిటెక్నిక్ కళాశాల లను పరిశ్రమలతో అనుసంధానించి సమగ్ర కార్యా చరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఉద్యోగ అవకాశాల కల్పన నిరంతర ప్రక్రియగా ఉండాలని, యువతకు ఆన్‌లైన్ కోర్సుల ద్వారా కూడా నైపుణ్యాలు పెంపొందించాలని సూచించా రు. నైపుణ్య పోర్టల్‌ను ఇతర వ్యవస్థలతో సమ గ్రంగా అనుసంధానం చేయాలని సీఎం చంద్ర బాబు ఆదేశించారు. ఈ సమీక్షకు రెవెన్యూ, ఆర్థిక, ఐటీ, మహిళా శిశుసంక్షేమం, సెర్ప్, రవా ణా, దేవాదాయ, అగ్నిమాపక శాఖ ఉన్నతాధి కారులు హాజరయ్యారు

## దుర్గమ్మవారి భక్తులకందుబాటులో
# దసరా2026 యాప్

- యాప్ ప్రారంభించిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



**ఇంద్రకీలాద్రి, అక్టోబర్ 5, ప్రభాతవార్త :** దుర్గమ్మవారి ఆలయంలో జరగబోతున్న దసరా ఉత్సవాలకోసం రూపొందించిన దసరా 2026 యాప్‌ను రాష్ట్ర దేవ దాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సోమవారం ప్రారంభించారు. తాడేపల్లిలోని మంత్రి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమం అనంతరం ఆయన మాట్లాడుతూ భక్తులకు అవసరమైన సేవలు, దర్శనం, సౌకర్యాలు, రక్షణ, అత్యవసర సేవలు అన్ని అంశాలను ఈ యాప్ ద్వారా భక్తులు అందుకోవచ్చుకోన్నారు. ఈ యాప్‌ద్వారా రియల్‌టైం దర్శనం, క్యూలైన్లో దర్శనానికి పట్టే సమయం, తేదీల వారీగా దర్శన వేళలు, దుర్గమ్మవారి నిత్య దివ్య అలంకారాల వివరాలు, అన్నప్రసాద, లడ్డూ ప్రసాద విక్రయ కేంద్రాల వివరాలు, మ్యాప్, నావిగేషన్, పార్కింగ్‌స్థలాలు, హోల్డింగ్ ఏరియాలు, కృష్ణానది స్నానఘట్టాలు, తాగునీటి పాయింట్లు, మరుగుదొడ్లు, ప్రథమ చికిత్స కేంద్రాలు, పాదరక్షల భద్రతా కేంద్రం , సమీపపోలీస్‌స్టేషన్ వివరాలు, కమాండ్‌కంట్రోల్‌రూం, ఉత్సవాల వివరాలు, ధార్మిక కార్య క్రమాలు, వివరాలను తెలుగు, ఇంగ్లీష్‌లో వాయిస్, టెక్స్ట్ ద్వారా వన్‌క్లిక్ లో పొందవచ్చునన్నారు. ఫీడ్‌బ్యాక్, తప్పిపోయిన వారి సమాచారం పొందవ చ్చునన్నారు. గూగుల్ ప్లేస్టోర్‌లో అందుబాటులో వుంచామన్నారు. కార్యక్ర మంలో ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ ఆలయ ప్రధాన అర్చకులు, అమరావతి సాఫ్ట్‌వేర్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

- **దసరాఆన్‌లైన్‌టికెట్లు విడుదల:** దుర్గమ్మవారి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో విశేషసేవల ఆన్‌లైన్ టికెట్లను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రికి ఆయన కార్యాలయంలో ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు దసరా ఉత్సవ ఆహ్వానం అందించారు.
- **దసరా ఏర్పాట్లు పరిశీలించిన కమీషనర్:** దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న దసరా ఉత్సవ ఏర్పాట్లను రాష్ట్ర దేవదాయ శాఖ కమీషనర్ కె రామచంద్రమోహన్ పరిశీలించారు. పలు ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన ఏర్పాట్లు త్వరితంగా పూర్తి చేయాలని ఆదేశాలిచ్చారు. దసరా ఉత్సవాల్లో పాల్గొనే సుమారు 25లక్షల మంది భక్తులకు ఇంజనీరింగ్ అధికారులు అన్ని నిర్మాణ, మరామత్తు పనులు త్వరితంగా పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటుకు నోటు కేసులో సుప్రీంకు మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్

**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన 2015 నాటి ఓటుకు నోటు కేసులో నాటి ఫిర్యాదిదారుడు మాజీ మాజీ ఎంఎల్ఎ స్టీఫెన్‌సన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో తన వాదనల ను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా అదనపు వాదనలు వినిపించేందుకు తనకు అవకాశం కల్పించాలని స్టీఫెన్‌సన్ తన పిటిషన్‌లో కోరారు. ప్రధాన ఫిర్యాదుదారుగా తన వాదనలను వినడం నిష్పక్షపాత విచారణకు అత్యంత కీలకమని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు నివేదించారు. ఈ ఇంప్లీడ్ పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంటూ, తదుపరి విచారణను వాయిదా వేసింది. కాగా ఇదే కేసులో తనపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ సిఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే సుప్రీం కోర్టును ఆశ్రయించడం తెలిసిందే.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో మళ్లీ కదలిక

### కాంగ్రెస్ నేత కోదండరెడ్డిని విచారించిన సిట్ అధికారులు

**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మళ్లీ కదలిక వచ్చింది. ఈ కేసుకు సంబంధించి నాలుగు నెలల తరువాత బాధితుడుగా వున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రైతు కమిషన్ కమిటీ ఛైర్మన్ కోదండ రెడ్డిని సిట్ అధికారు లు సోమవారం విచారించారు. గత అసెంబ్లీ ఎన్నికల తరువాత ఈ స్కాం వెలుగు చూడడం తెలిసిందే. 2024 మార్చి నెలలో ఇది వెలుగు చూడగా అనంతరం జరిగిన పరిణామాల్లో ఒక విశ్రాంత డిసిపితో పాటు సర్వీసులో వున్న మరో ముగ్గురు పోలీసు అధికారులు అరెస్టవడం వి ?దితమే. ఈ కేసులో కీలక నిందితుడు, సూత్రధారి అయిన నాటి ఎస్‌ఐబి బాస్ ప్రభాకర్ రావు సుప్రీం కోర్టు నుంచి అరెస్టు కాకుండా మధ్యం తర ఉత్తర్వులు పొందారు. దీంతో పాటు మీడియా అధినేత శ్రావణ్ రావు కూడా అరెస్టు నుంచి మధ్యంతర ఉత్తర్వులు పొందారు. అప్పట్లో కో దండ రెడ్డి ఫోన్ ట్యాపింగ్ గురైనట్లు సిట్ అధికారులు గుర్తించడం తెలిసిందే.

అప్పట్లో ప్రతిపక్షంలో వున్న కాంగ్రెస్ నేతలతో పాటు ఇతర ప్ర ముఖుల ఫోన్‌లు ట్యాపింగ్ గురవగా బాధితులుగా వున్న వీరిని సిట్ అధికారులు వరుసగా విచారించి వాంగ్మూలం నమోదు చేశారు. ఈ క్రమ ంలో కోదండ రెడ్డికి సిట్ అధికారులు ఇటీవలే నోటీసు ఇచ్చి విచారణకు రావాలని కోరారు. అయితే కోదండ రెడ్డిఅనారోగ్యం, వయస్సు రీత్యా సిట్ అధికారులు ఆయన కార్యాలయానికి వెళ్లి 40 నిమిషాల పాటు విచారించి నాటి ఘటనలపై వాంగ్మూలం తీసుకున్నారు. సిట్ విచారణలో కోదండ రెడ్డి నాటి ఘటనకు సంబంధించి అనేక విషయాలను సిట్ అధికారులకు వివరించారు. తన ఫోన్‌తో పాటు చాలా మంది ఫోన్‌లు అ ప్పట్లో ట్యాపింగ్‌కు గురైనట్లు ఆయన తెలిపారు. ఈ నేరానికి పాల్పడిన వారిని కచ్చితంగా శిక్షించాలని ఆయన కోరారు. కాగా కోదండ రెడ్డి వి చారణ దరిమిలా మరికొందరు బాధితులను సిట్ విచారించే వీలుందని తెలిసింది.

# పండుగల వేళ అదనపు ప్రత్యేక రైళ్లు

### ప్రధాన స్టేషన్లలో రద్దీ నిర్వహణకు ఏర్పాటు:న ద.మ.రైల్వే జిఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ



సమావేశంలో మాట్లాడుతున్న జిఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

**హైదరాబాద్ (తార్నాక), అక్టోబరు 5, ప్రభాతవార్త :** దసరా, దీపావళి, ఛత్ పండుగల నేపథ్యంలో రైల్వే స్టేషన్లలో పెరగనున్న ప్రయాణికుల రద్దీని సమర్థవంతంగా నియంత్రించడంతో పాటు రైలు కార్యకలాపాల భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. సోమవారం సికిందరా బాద్‌లోని రైల్ నిలయంలో పండుగల సందర్భంగా ప్రధాన రైల్వే స్టేషన్లలో చేపట్టాల్సిన జనసమూహ నిర్వహణ ప్రణాళికలు, జోన్ వ్యాప్తంగా రైళ్ల భద్రతపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.సమీక్షా సమావేశంలో అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్‌తో పాటు వివిధ శాఖల ప్రధానాధిపతులు పాల్గొన్నారు. సికిందరా బాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమా వేశానికి హాజరయ్యారు. పండుగల సందర్భంగా ప్రధాన స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున అధికారులు, పర్యవేక్షకులు అప్రమత్తం గా ఉండాలని జీఎం సూచించారు. స్టేషన్ ప్రాంగణం, ప్లాట్‌ఫార మ్‌లు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో ప్రయాణికుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రద్దీ పెరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించి భద్రతా విభాగం, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో చురుకైన చర్యలు చేపట్టాలని తెలిపారు.

ప్రధాన స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ నియంత్రణ కోసం టికెట్ తనిఖీ సిబ్బంది, రైల్వే రక్షణ దళం సిబ్బందితో ప్రత్యేక క్షేత్రస్థాయి బృందాలను ఏర్పాటు చేసి మోహరిం చాలని సూచించారు. స్టేషన్ ప్రాంగణాల్లో జరుగుతున్న నిర్మాణ పనుల ప్రాంతాలను పూర్తిగా బారికేడ్లతో మూసివేసి ప్రయాణికులకు భద్రత కల్పిం చాలని ఆదేశించారు. ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో ఉన్న అడ్డంకులను తొలగించి రాకపోకలు సజావుగా సాగేలా చూడాలన్నారు. పండుగ రద్దీని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రయాణికుల డిమాండ్, ప్రయాణ సరళిని నిరంతరం పర్యవేక్షించాలని జీఎం సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో అదనపు ప్రత్యేక రైలు సర్వీసులను ముందస్తుగా ప్రణాళిక రూపొందించి నడపాలని అధికారులను ఆదేశించారు. భద్రతకు అత్యంత ప్రాధాన్యంరైలు కార్యకలాపాల భద్రతపై సమీక్ష సందర్భంగా జోన్ వ్యాప్తంగా భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయాలని సంజయ్ కుమార్ శ్రీవాస్తవ స్పష్టం చేశారు.

## ఎల్‌నినో నేపథ్యం.. రబీలో వరికి ప్రత్యామ్నాయంగా స్వల్పకాలిక పంటల సాగుకు ప్రోత్సాహం

**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త :** ఎల్‌నినో నేపథ్యంలో ఈ రబీ సీజనులో వరికి ప్రత్యామ్నా య పంట వైపు దృష్టిసారించాలని వ్యవసాయ శాఖ కార్యదర్శి కె సురేంద్రమోహన్ సూచించారు. రబీ (యాసంగి) 2026-27 కార్యాచరణ ప్రణాళి కపై హైదరాబాద్‌లో సోమవారం వీడియో కాన్ఫరె న్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యంగా తక్కువ నీటితో సాగయ్యే స్వల్పకాలిక పప్పుధాన్యాలు, నూనె గింజల పంటలతో పాటు, అధిక ఆదాయాన్నిచ్చే కూరగాయల పంటల సాగు జరిగేలా చర్యలు తీసు కోవాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు తక్కువ నీటితో పండే పంటల ఎంపిక, అనువైన రైతులకు అందుబాటులో ఉన్న నీటి వనరులు, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలన్నారు. పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా రబీ సీజన్‌కు సంబంధించిన సమీక్షా సమావేశాలు నిర్వహించాల న్నారు. క్షేత్రస్థాయి నుంచి సేకరించిన అంశాలను క్రోడీకరించి, రబీ కార్యాచరణ ప్రణాళికను రూపొం దించి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు చెప్పారు. విత్తన రకాలు, పంట యాజమాన్య పద్ధతులపై విస్తృతంగా అవగాహన కల్పించాలని చెప్పారు. రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సందేహాలను నివృత్తి చేయాలని పేర్కొన్నారు.యాసంగి సీజన్‌కు సరిపడా ఎరువుల సరఫరా, ప్రస్తుత నిల్వల స్థితిగతులపై సమీక్షించారు.

రాబోయే సీజన్‌లో ఎరువుల కొరత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ డైరక్టర్ డాక్టర్ బి. గోపి, ఉద్యాన శాఖ డైరక్టర్ డాక్టర్ యాస్మీన్ బాషా తదితరులు పాల్గొన్నారు.





అవార్డు అందుకుంటున్న ఎయిర్‌పోర్టు ప్రతినిధులు

# నేషనల్ ఎనర్జీ లీడర్‌గా జిఎంఆర్ ఎయిర్‌పోర్ట్

### సిఐఐ నేషనల్ అవార్డ్స్-2026లో వరుసగా ఎనిమిదోసారి

### వరుసగా పదో యేడాది ఎక్సలెంట్ ఎనర్జీ ఎఫిషియెంట్ యూనిట్‌గా కూడా గుర్తింపు

**శంషాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** జిఎంఆర్ శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జీహెచ్ఐఏఎల్) మరో ప్రతిష్ఠాత్మక గుర్తింపును సొంతం చేసుకుంది. 27వ సీఐఐ నేషనల్ అవార్డ్స్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ ఎనర్జీ మేనేజ్‌మెంట్-2026లో వరుసగా ఎనిమిదో యేడాది 'నేషనల్ ఎనర్జీ లీడర్' అవార్డును దక్కించుకుంది. అలాగే వరుసగా పదో యేడాది 'ఎక్సలెంట్ ఎనర్జీ ఎఫిషియెంట్ యూనిట్'గా గుర్తింపు పొందింది. ఎనర్జీ ఎఫిషియెన్సీ, ఎనర్జీ మేనేజ్‌మెంట్, సస్టైయినబిలిటీ రంగాల్లో అత్యుత్తమ పనితీరును కనబరిచిన సంస్థలకు సీఐఐ ఈ అవార్డులను అందిస్తోంది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 700కుపైగా సంస్థలు పాల్గొనగా, సెప్టెంబర్ 16 నుంచి 18 వరకు హైదరాబాద్‌లో అవార్డుల కార్యక్రమం నిర్వహించారు. ఎనర్జీ వినియోగాన్ని తగ్గించడం, పునరుత్పాదక ఇంధనాన్ని వినియో గించడం, ఆధునిక సాంకేతికతలను అమలు చేయడం, సమర్థవంతమైన కార్యకలాపాలను కొనసాగించడం ద్వారా జీహెచ్ఐఏఎల్ సస్టైయినబుల్ ఎయిర్‌పోర్ట్‌గా ముందుకు సాగుతోంది. ఎనర్జీ కన్జర్వేషన్, ఇన్నోవేటివ్ ప్రాజెక్టులు, సస్టైయినబిలిటీ లీడర్‌షిప్, ఐఎస్ఓ 50001:2018 ఎనర్జీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అమలు, కమ్యూనిటీ అవేర్‌నెస్ వంటి అంశాలపై నిర్వహించిన సమగ్ర మూల్యాంకనంలో ఈ గుర్తింపులు లభించాయి.ఈ సందర్భంగా జీహెచ్ఐఏఎల్ సీఈఓ కధీర్ కధీరవన్ మాట్లాడుతూ.. సస్టైయినబిలిటీ తమ కార్యకలాపాల్లో అంతర్భాగమని తెలిపారు. ఎనర్జీ ఎఫిషియెంట్ టెక్నాలజీలు, రెన్యూవబుల్ ఎనర్జీ, స్మార్ట్ ఆపరేషనల్ విధానాల్లో నిరంతరం పెట్టుబడులు పెడుతున్నామని పేర్కొన్నారు. వరుసగా ఎనిమిదోసారి 'నేషనల్ ఎనర్జీ లీడర్', పదోసారి 'ఎక్సలెంట్ ఎనర్జీ ఎఫిషియెంట్ యూనిట్'గా సీఐఐ గుర్తించడం ఉద్యోగులు, భాగస్వాముల సమష్టి కృషికి నిదర్శనమని అన్నారు. ఈ అవార్డులు విమానాశ్రయం చేపడు తున్న ఇంధన పొదుపు, సాంకేతిక ఆవిష్కరణలు, పర్యావరణ పరిరక్షణ చర్యలకు మరింత ప్రోత్సాహాన్ని అందించనున్నాయి.

## సచివాలయంలో తాగునీటికి కటకట

**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** సెక్రటేరియెట్లో ఉద్యోగులు, సిబ్బందికి తాగునీటిని సరఫరా చేసే ఏజెన్సీలు నీటి సరఫరాను నిలిపివేయడంతో కొన్నిరోజులుగా నీటి కటకటను ఎదుర్కొంటున్నారు. రూ.50లక్షల నీటి బిల్లులు చెల్లించకుండా వాయిదా వేస్తుండటంతో నీటిని సరఫరా చేసే చేతులు ఎత్తివేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలుస్తోంది. సెక్రటేరియెట్లో తాగునీటి సరఫరా కోసం నాలుగు ఏజెన్సీలతో ఒప్పందాలు చేసుకున్నారు అయితే ఆయా ఏజెన్సీలకు చెల్లించాల్సిన బిల్లులు రూ.50 లక్షలవరకు పేరుకు పోవడంతో నీటి సరఫరాపై ప్రభావం పడింది. సెక్రటేరియట్‌లోని ప్రతి డిపార్ట్మెంట్ నుంచి లక్షల్లో బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయట దీనితో బకాయిలు చెల్లించకపోవడంతో కొన్ని ఏజెన్సీలు ఇప్పటికే సరఫరాను నిలిపివేశాయి.దీనికి తోడు సెక్రటేరియెట్లోని మంచి నీటి ఫిల్డర్లు పని చేయడం ఆగిపోవడంతో ఉద్యోగులు బయట నుంచి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్ని రోజులుగా నీటి సమస్య కొనసాగుతుండటంతో ఉద్యో గులు ఇబ్బందులు పడుతున్నారు. చివరకు ఉద్యోగులు తమ ఇళ్ల నుంచే తాగునీటి బాటిళ్లు తెచ్చుకొంటున్నారని తెలిసింది. ఇంతేకాదు సెక్రటేరి యెట్‌లో ఉద్యోగులకు అందించే మధ్యాహ్న భోజనం విషయంలోనూ ఇబ్బం దులు ఎదురవుతున్నాయని చర్చించుకొంటున్నారు. పెండింగ్ బిల్లులు, ఇతర సమస్యల నేపథ్యంలో లంచ్ బంద్ చేసేశారని తెలిసింది. ఇప్పుడు తాగునీటి సరఫరా కూడా నిలిచిపోవడంతో ఉద్యోగుల్లో అసంతృప్తి వ్యక్త మవుతోంది. భారీస్థాయిలో బిల్లులు పెండింగ్‌లో ఉండటంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని ఉద్యోగులటున్నారు. బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారు? నీటిసరఫరా ఎప్పటి లోగా పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తారని ఉద్యోగుల్లో అనిశ్చితి నెలకొంది.

# డిసెంబరు 11 నుంచి 22 వరకు ఖేలో ఇండియా యూత్ గేమ్స్

### ప్రారంభ కార్యక్రమానికి పిఎం మోడీని ఆహ్వానించనున్న తెలంగాణ సర్కార్

**హైదరాబాద్,అక్టోబరు5,ప్రభాతవార్త:** హైదరాబాద్ సహా ఆరు నగరాల్లో ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను నిర్వహించనున్నారు. కేఐవైజీని ఘనంగా నిర్వహిం చేందుకు ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. ప్రారంభ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్యఅతిథిగా హాజరయ్యే అవకాశముంది. కేఐవైజీ ఆర్గనైజింగ్ కమిటీ ఛైర్మన్‌గా సీఎం రేవంత్‌రెడ్డి ఉండనున్నారు. కేఐవైజీ ఆర్గనైజింగ్ కమిటీ కోఛైర్మన్‌గా కేంద్ర క్రీడా మంత్రి మన్సుఖ్ మాండవీయను నియమించారు. హైదరాబాద్, హనుమకొండ, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లో కేఐవైజీ పోటీలు నిర్వహించనున్నారు. కేఐవైజీలో మొత్తం 27 క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. డిసెంబరు 11 నుంచి 22 వరకు ఖేలో ఇండియా యూత్ గేమ్స్ జరగనున్నాయి.

దేశవ్యాప్తంగా 7,500 మందికి పైగా యువ క్రీడాకారులు, 1,500 మంది సహాయక సిబ్బంది, 1,000 మందికి పైగా సాంకేతిక నిపుణులు ఈ టోర్నీలో పాల్గొననున్నారు. రాష్ట్ర క్రీడా వ్యవస్థను ఒలింపిక్ పతకాలు సాధించే స్థాయికి తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం గతేడాది తెచ్చిన తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ2025 స్ఫూర్తితో ఈ వేదికలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 27 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. హనుమకొండలో అథ్లెటిక్స్, కరీంనగర్‌లో జూడో, ఖమ్మంలో ఆర్చరీ, మహబూబ నగర్‌లో కబడ్డీ, నిజామాబాద్‌లో టేబుల్ టెన్నిస్ పోటీలు జరగనుండగా, మిగిలిన క్రీడాంశాలు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, ఎల్‌బీ స్టేడియం, సరూర్‌నగర్, జేఎన్‌టీయూహెచ్, సికింద్రాబాద్, యూసుఫగూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియాల్లో నిర్వహించ నున్నారు. తెలంగాణ ఆతిథ్య క్రీడగా రోయింగ్, ప్రదర్శన క్రీడగా సెయిలింగ్ నిలవనున్నాయి. ముఖ్యంగా హుస్సేన్‌సాగర్ వాటర్ స్పోర్ట్స్ కేంద్రంలో నిర్వహించనున్న రోయింగ్, కయాకింగ్, కానోయింగ్ పోటీలు ఈ టోర్నమెంట్‌కే ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, సైక్లింగ్, జిమ్నాస్టిక్స్, ఫెన్సింగ్, ఫుట్‌బాల్, హాకీ, జూడో, ఖోఖో, కబడ్డీ, షూటింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, వాలీబాల్, వెయిట్‌లిఫ్టింగ్, రెజ్లింగ్‌తోపాటు గట్కా, మల్లఖంబ్, కలరిపయట్టు, థాంగ్‌టా, యోగాసన వంటి క్రీడలు ఇందులో చోటు దక్కించుకున్నాయి. క్రీడల విజయవంతం కోసం ప్రభుత్వం ఐదు రాష్ట్రస్థాయి కమిటీలను ఏర్పాటు చేసింది. క్రీడాకారులు, అతిథుల వసతి, భోజనం, రవాణా ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం ప్రత్యేక ఉన్నత స్థాయి కమిటీ పనిచేయనుంది. హైదరాబాద్‌తో పాటు ఇతర వేదికల్లోని క్రీడాకారుల గదులు, ప్రేక్షకుల సౌకర్యాలు, మరుగుదొడ్లు, స్విమ్మింగ్ పూల్స్, సైక్లింగ్ ట్రాక్‌లు, షూటింగ్ రేంజ్‌లను ఆధునికీకరిస్తూ మెరుగైన వసతులు కల్పించనున్నారు.

6-10pg10exHMNWJQE.qxd:6-10pg10exHMNWJQE.qxd 1/1/02 8:17 AM Page 1



# హాంకాంగ్ సిక్సెస్‌కు భారత్ జట్టు ఖరారు

## కెప్టెన్‌గా భువనేశ్వర్ కుమార్



**న్యూఢిల్లీ:** హాంకాంగ్ సిక్సెస్ 2026, టోర్నీ కోసం భారత జట్టును ప్రకటించారు. ఈ నెల 30నుంచి నవంబర్1 వరకు జరగనున్న ఈ టోర్నీకి భువనేశ్వర్ కుమార్ కెప్టెన్‌గా వ్యవహారించనున్నాడు. ఈ జట్టులో కృనాల్ పాండ్యా, నితీశ్ రాణా, శశాంక్ సింగ్, టీ. నటరాజన్, రాహుల్ త్రిపాఠి, రాహుల్ తెవాటియా ఉన్నారు. ఈ భారత జట్టులో ప్రస్తుతం అంతర్జాతీయ క్రికెట్‌లో రెగ్యులర్‌గా కనిపించని పలువురు ఆటగాళ్లకు అవకాశం లభించింది. ఐపీఎల్ 2026 లో మంచి ప్రదర్శన చేసిన ఆటగాళ్లను హాంకాంగ్ సిక్సెస్ కోసం ఎంపిక చేసినట్లు జట్టు కూర్పు స్పష్టం చేస్తోంది. భువనేశ్వర్ కుమార్‌కు ఈ ఏడాది ఐపీఎల్‌లో మంచి సీజన్ దక్కింది. 28 వికెట్లు తీసిన అతడు, ఆ తర్వాత జరిగిన యూపీ టీ20 లీగ్‌లోనూ ఆకట్టుకున్నాడు. కృనాల్ పాండ్యా కూడా ఐపీఎల్‌లో రాణించాడు. అతడిని తిరిగి టీ20 అంతర్జాతీయ జట్టులోకి తీసుకునే అంశంపై కూడా గతంలో చర్చ జరిగింది. నితీశ్ రాణా, శశాంక్ సింగ్ టీ20 లీగ్‌లలో మంచి ప్రదర్శనలు చేస్తున్నారు. నటరాజన్, రాహుల్ త్రిపాఠి, రాహుల్ తెవాటియా చేరికతో జట్టుకు మరింత లోతు వచ్చినట్లు కనిపిస్తోంది. ఈ ఏడాది హాంకాంగ్ సిక్సెస్‌లో వీరంతా అరంగేట్రం చేయనున్నారు. గత ఎడిషన్‌లో భారత జట్టుకు నిరాశ ఎదురైంది. 2025లో రాబిన్ ఉతప్ప, దినేశ్ కార్తీక్ వంటి పేరున్న ఆటగాళ్లతో బరిలోకి దిగిన భారత్ గ్రూప్ దశలోనే నిష్క్రమించింది. కువైట్ చేతిలో పరాజయం కూడా ఎదురైంది. ఆ టోర్నీలో పాకిస్థాన్ విజేతగా నిలిచింది. ఈ నేపథ్యంలో ఈసారి మరింత బలమైన జట్టును ఎంపిక చేశారు.



## నెమ్మదిగా ఓవర్లుతో.. భారత్, వెస్టిండీస్‌పై

# 20, 10% జరిమానా

**దుబాయ్:** ఇటీవల న్యూ చండీగఢ్‌లో జరిగిన సిరీస్‌లోని మూడవ, చివరి వన్డేలో నెమ్మదిగా ఓవర్లు వేసినందుకు భారత్, వెస్టిండీస్ జట్లపై ఆంక్షలు విధించినట్లు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి) సోమవారం తెలిపింది. సమయ కేటాయింపులను పరిగణనలోకి తీసుకున్న తర్వాత, భారత్ అవసరమైన రేటు కంటే నాలుగు ఓవర్లు తక్కువగా వేసినట్లు తేలింది. దీంతో వారికి మ్యాచ్ ఫీజులో 20 శాతం జరిమానా విధించారు. రెండు ఓవర్లు తక్కువగా వేసిన వెస్టిండీస్‌కు 10 శాతం జరిమానా విధించారు. ఆటగాళ్లు, వారి సహాయక సిబ్బంది కోసం ఉద్దేశించిన ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం, తమ జట్టు నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయడంలో విఫలమైన ప్రతి ఓవర్‌కు, ఆటగాళ్లకు వారి మ్యాచ్ ఫీజులో ఐదు శాతం జరిమానా విధించినట్లు స్పష్టం చేసింది. భారత్, వెస్టిండీస్ కెప్టెన్లు ఇద్దరూ తమ పొరపాట్లను అంగీకరించి, ప్రతిపాదిత జరిమానాకు అంగీకరించారు. దీంతో అధికారిక విచారణలు అవసరం కాలేదని స్పష్టం చేసింది.

ఐసీసీ అంతర్జాతీయ మ్యాచ్ రిఫరీల ప్యానెల్‌కు చెందిన ప్రకాష్ భట్ ఈ పెనాల్టీలను విధించారు. ఆన్‌ఫీల్డ్ అంపైర్లు జయరామన్ మదనగోపాల్, సామ్ నోగాజ్స్కి, థర్డ్ అంపైర్ షర్ఫుద్దౌలా ఇబ్నే షాహిద్, ఫోర్త్ అంపైర్ వీరేందర్ శర్మలు ఈ ఆరోపణలను చేశారు.

# టీమిండియా బిజీ బిజీ



## నేటి నుండి వెస్టిండీస్‌తో 5 టి20ల సిరీస్ స్టార్ట్

## 27 రోజుల్లో రెండు దేశాల్లో 10 మ్యాచ్‌లు

**న్యూఢిల్లీ:** ఇక టీమిండియా బిజీ కానుంది. నిరంతరాయంగా మ్యాచ్‌లు ఖరారయ్యాయి. కేవలం 27 రోజుల్లో రెండు దేశాల్లో 10 మ్యాచ్‌లు ఆడనుంది. భారత జట్టు వరుసగా రెండు టీ20 సిరీస్‌లు ఆడనుంది. ముందుగా స్వదేశంలో వెస్టిండీస్‌తో ఐదు టీ20లు, ఆ తర్వాత న్యూజిలాండ్ పర్యటనలో మరో ఐదు టీ20లు ఉన్నాయి. ఈ నెల 6 నుంచి నవంబర్ 1 వరకు కేవలం 27 రోజుల్లో భారత జట్టు మొత్తం 10 టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌ను 2–1తో గెలిచిన టీమిండియా ఇప్పుడు టీ20 ఫార్మాట్‌పై ఫోకస్ పెట్టింది. వెస్టిండీస్‌తో ఐదు టీ20ల సిరీస్ ఈ నెల 6న లక్నోలో ప్రారంభమవుతుంది. ఈ సిరీస్‌కు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. తొలి మ్యాచ్ తర్వాత 9న రాంచీలో రెండో టీ20, 11న ఇండోర్‌లో మూడో టీ20, 14న హైదరాబాద్‌లో నాలుగో టీ20, ఈ నెల 17న బెంగళూరులో చివరి టీ20 జరుగుతుంది. మరోవైపు వెస్టిండీస్ వన్డే సిరీస్‌లో చివరి మ్యాచ్ గెలిచిన ఉత్సాహంతో టీ20ల్లో పోటీ ఇవ్వాలని చూస్తుంది. టీ20 జట్టులో యువ ఆటగాళ్లకు అవకాశాలు దక్కే అవకాశం ఉండటంతో ఈ సిరీస్‌పై ఆసక్తి మరింత పెరిగింది. ఈ స్క్వాడ్‌లో శ్రేయస్ అయ్యర్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, సంజూ శాంసన్, తిలక్ వర్మ, శివమ్ దూబే, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, నితీశ్ కుమార్, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, వైభవ్ సూర్యవంశీ, మయాంక్ యాదవ్ తదితరులు ఉన్నారు. వెస్టిండీస్ సిరీస్ తదుపరి భారత జట్టుకు ఈ నెల 22 నుంచే న్యూజిలాండ్ గడ్డపై ఐదు టీ20ల సిరీస్ ప్రారంభమవుతుంది. న్యూజిలాండ్ పర్యటనతో భారత జట్టుకు మరో కీలక సవాలు ఎదురుకానుంది. క్రైస్ట్‌చర్చ్‌లో తొలి రెండు మ్యాచ్‌లు పూర్తయ్యాక మూడో టీ20 కోసం వెల్లింగ్టన్ వెళ్లాలి. ఆ తర్వాత ఆక్లాండ్, హామిల్టన్‌లో చివరి రెండు మ్యాచ్‌లు జరుగుతాయి. న్యూజిలాండ్ పరిస్థితుల్లో పేస్ బౌలింగ్, బౌన్స్, స్వింగ్‌ను ఎదుర్కోవడం భారత బ్యాటర్లకు పరీక్షగా మారొచ్చు.

అదే సమయంలో భారత పేసర్లు కూడా అక్కడి పరిస్థితులను సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా వెస్టిండీస్ సిరీస్ ముగిసిన వెంటనే న్యూజిలాండ్‌కు వెళ్లాల్సి రావడంతో వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ కీలకంగా మారుతుంది. యువ ఆటగాళ్లకు ఎక్కువ అవకాశాలు ఇవ్వడం, సీనియర్ ఆటగాళ్లకు అవసరమైన విశ్రాంతి ఇవ్వడం టీమ్ మేనేజ్‌మెంట్ ముందున్న ప్రధాన అంశాలుగా కనిపిస్తున్నాయి. రాబోయే టీ20 మ్యాచ్‌లు భారత జట్టు బెంచ్ బలాన్ని పరీక్షించేందుకు కూడా ఉపయోగపడనున్నాయి.



## చైనా ఓపెన్‌లో సెమీఫైనల్స్‌కు జోకోవిచ్

**బీజింగ్:** చైనా ఓపెన్ 2026లో జోకోవిచ్ తన ప్రత్యర్థి జ్వెరెవ్‌ను ఓడించాడు. ఆరుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన నోవాక్ జోకోవిచ్, తనదైన శైలిలో మరోసారి అద్భుతంగా టాప్ సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్‌ను 4-6, 6-4, 6-4 తేడాతో ఓడించి చైనా ఓపెన్ సెమీఫైనల్స్‌కు చేరుకున్నాడు. జర్మన్ ఆటగాడు మరింత బలంగా ప్రారంభించి జోకోవిచ్‌ను ఇబ్బంది పెట్టి, తద్వారా మొదటి సెట్‌ను 6-4తో గెలుచుకున్నాడు. రెండో సెట్ చివరిలో నిర్ణయాత్మక పాయింట్ చోటుచేసుకుంది. స్కోరు 4-4తో సమంగా ఉన్నప్పుడు, జోకోవిచ్ తన ఆటను మెరుగుపరుచుకుని, 10వ గేమ్‌లో జ్వెరెవ్ సర్వ్‌ను బ్రేక్ చేసి, ఆ తర్వాత సర్వ్ చేసి సెట్ గెలిచి మ్యాచ్‌ను సమం చేశాడు. ఫైనల్ సెట్‌లో ఇద్దరూ హోరాహోరీగా తలపడ్డారు, ఇద్దరిలో ఎవరూ స్పష్టమైన ఆధిక్యాన్ని సాధించలేకపోయారు. అయినప్పటికీ, మునుపటిలాగే, అత్యంత కీలకమైన సమయంలో జోకోవిచ్ తన అత్యుత్తమ టెన్నిస్‌ను ప్రదర్శించాడు. స్కోరు 4-4 వద్ద ఉండగా, సెర్బియా ఆటగాడు జ్వెరెవ్ సర్వ్‌ను బ్రేక్ చేసి, తద్వారా నిర్ణయాత్మక బ్రేక్‌ను సాధించాడు. ఆ తర్వాత అతను మ్యాచ్‌ను ముగించేందుకు సర్వ్ చేసి, 4-6, 6-4, 6-4 తేడాతో విజయాన్ని ఖాయం చేసుకున్నాడు.

# స్వియాటెక్ విజయం

**బీజింగ్‌బి:** ఆరుసార్లు గ్రాండ్ స్లామ్ ఛాంపియన్ అయిన ఇగా స్వియాటెక్, సోమవారం ఇక్కడ జరిగిన చైనా ఓపెన్ రౌండ్ ఆఫ్ 32లో ఒక సెట్ మరియు రెండు బ్రేక్‌లతో వెనుకబడినప్పటికీ అద్భుతంగా పుంజుకుని 30వ సీడ్ డోనా వెకిచ్‌ను ఓడించింది. స్వియాటెక్ మొదటి సెట్‌ను 4-6తో కోల్పోయి, రెండవ సెట్‌లో 2-5తో వెనుకబడి ఓటమి అంచున నిలిచింది. అయితే, ఈ పోలిష్ క్రీడాకారిణి అద్భుతమైన పునరాగమనం చేసి మ్యాచ్‌ను 4-6, 7-6 (0), 6-2 తేడాతో గెలిచి, రౌండ్ ఆఫ్ 16లోకి దూసుకెళ్లింది. మ్యాచ్‌లోని మూడవ గేమ్‌లోనే స్వియాటెక్ తన సర్వ్‌ను కోల్పోయి, వెకిచ్ సర్వ్‌ను బ్రేక్ చేయలేకపోయింది. ఎనిమిదో సీడ్ పోలిష్ క్రీడాకారిణి చివరికి మొదటి సెట్‌ను 4-6 తేడాతో కోల్పోయింది. రెండవ సెట్‌లో రెండుసార్లు తన సర్వ్‌ను కోల్పోయి 2-5తో వెనుకబడటంతో, తిరిగి పుంజుకోవాలన్న ఆమె ఆశలు మరింత దెబ్బతిన్నాయి. అయితే,




ఆమె తన అత్యుత్తమ ఆటను కనబరిచి, క్రొయేషియా క్రీడాకారిణి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసి స్కోరును 5-5తో సమం చేసింది. ఇద్దరు క్రీడాకారిణులు తమ సర్వ్‌లను నిలబెట్టుకోవడంతో రెండో సెట్ టైబ్రేక్‌కు దారితీసింది. స్వియాటెక్ ఒక్క పాయింట్ కూడా కోల్పోకుండా ఆధిపత్యం చెలాయించి ఆ సెట్‌ను కైవసం చేసుకుంది. ఇద్దరూ మూడవ సెట్‌ను చెరొక సర్వ్ బ్రేక్‌తో ప్రారంభించారు. కానీ 3-2 వద్ద పోలాండ్ క్రీడాకారిణి ఒక బ్రేక్ సాధించింది. ఆమె తన సర్వ్‌లను నిలబెట్టుకుని, వెకిచ్ సర్వ్‌ను బ్రేక్ చేసి, మూడవ సెట్‌ను 6-2తో కైవసం చేసుకుంది. తద్వారా 2 గంటల 40 నిమిషాలలో ఒక అద్భుతమైన పునరాగమన విజయాన్ని పూర్తి చేసింది.

# నష్టాలకు చెక్..లాభాల్లో సెన్సెక్స్,నిఫ్టీ




**ముంబయి, అక్టోబరు 5:** వరుస నాలుగు సెషన్ల నష్టాలను చవిచూసిన దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టడం, అమెరికా ఉద్యోగాల డేటా అంచనాల కంటే బలహీనంగా ఉండటం, అన్ని రంగాల్లో కొనుగోళ్లు పెరగడం వంటి అంశాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను పెంచాయి. ఎఫ్ఎంసీజీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ షేర్లు రాణించగా హెల్త్‌కేర్, ఫార్మా రంగాల షేర్లు నష్టపోయాయి. ఇదే సమయంలో రిజర్వుబ్యాంకు ద్రవ్య విధాన కమిటీ సమావేశంపై ఇన్వెస్టర్లు దృష్టి సారించారు. సోమవారం ప్రారంభమైన ఈ సమావేశంతో పాటు అంతర్జాతీయ బాండ్ ఈల్డ్స్‌ను కూడా మార్కెట్లు నిశితంగా పరిశీలిస్తున్నాయి. ఎస్అండ్‌పీ బీఎస్ఈ సెన్సెక్స్ 472.77 పాయింట్లు లాభపడి 72,382.47 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సూచీ 133.80 పాయింట్లు పెరిగి 22,555.75 వద్ద స్థిరపడింది. అంతకుముందు వరుసగా నాలుగు సెషన్లలో సెన్సెక్స్ 2.69 శాతం, నిఫ్టీ 3.11 శాతం చొప్పున క్షీణించాయి. నిఫ్టీ లాభాల్లో ఐటీసీ, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ కీలక పాత్ర పోషించాయి. ఐటీసీ షేరు 5.08 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 1.63 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.60 శాతం చొప్పున పెరిగాయి. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.38 శాతం లాభపడగా, బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.31 శాతం పెరిగింది. ఎన్ఎస్ఈలో 1,745 షేర్లు లాభాల్లో ముగియగా, 1,844 షేర్లు నష్టాల్లో ముగిశాయి. మరో 117 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. కమోడిటీ మార్కెట్లో డిసెంబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ ధర 51 సెంట్లు లేదా 0.50 శాతం పెరిగి బ్యారెల్‌కు 102.76 డాలర్లకు చేరింది. భారతదేశ 10 ఏళ్ల బెంచ్‌మార్క్ ప్రభుత్వ బాండ్ రాబడులు 0.31 శాతం పెరిగి 7.231కి చేరింది. గత సెషన్ ముగింపులో ఇది 7.209గా ఉంది. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి స్వల్పంగా బలహీనపడింది. డాలర్‌తో పోలిస్తే పాక్షికంగా కన్వర్టబుల్ రూపాయి 96.3000 వద్ద కొనసాగింది. గత సెషన్‌లో ఇది 96.2500 వద్ద ముగిసింది. ఎంసీఎక్స్‌లో డిసెంబర్ 4, 2026 డెలివరీ బంగారం ఫ్యూచర్స్ 0.36 శాతం తగ్గి 10 గ్రాములకు రూ.1,49,850కి చేరాయి. అమెరికా 10 ఏళ్ల బాండ్ ఈల్డ్ 0.15 శాతం పెరిగి 5.288కి చేరింది.

# ఇన్వెస్టర్లలో అవగాహనకు సెబీ ప్రాజెక్టు జాగరూక్..

## చండీగఢ్‌లో ప్రారంభించిన సెబీ చైర్మన్ తుహిన్‌కాంత పాండే



**చండీగఢ్, అక్టోబరు 5:** పెట్టుబడిదారుల్లో ఆర్థిక అవగాహన పెంచేందుకు భారత సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు సెబీ దేశవ్యాప్తంగా కొత్త అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించింది. సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే సోమవారం ప్రాజెక్ట్ జాగ్రూక్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ప్రచారం మార్చి 2027 వరకు కొనసాగనుంది. గ్రామీణ ప్రాంతాలు, విద్యా సంస్థల్లో ఆర్థిక అక్షరాస్యతను పెంచడంతో పాటు పెట్టుబడిదారులకు మోసాలపై అవగాహన కల్పించనున్నారు. ముఖ్యంగా అనామక పెట్టుబడి టిప్స్, ఫిన్‌ఫ్లుయెన్సర్లు, అధిక రాబడులపై వ్యాపార ప్రకటనలపరంగా జాగ్రత్తగా ఉండాలని సెబీ సూచించింది. ప్రాజెక్ట్ జాగ్రూక్‌లో సెబీతో పాటు స్టాక్ ఎక్స్ఛేంజీలు, డిపాజిటరీలు, అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్‌లు భాగస్వామ్యం కానున్నాయి. పలు భాషల్లో పెట్టుబడిదారుల అవగాహన సందేశాలను ప్రచారం చేయనున్నారు. సెబీ చీఫ్ పాండే మాట్లాడుతూ పెట్టుబడిదారులు నియంత్రిత పెట్టుబడి ఉత్పత్తులు, అధికారిక మార్గాలు, నియంత్రణలో ఉన్న సంస్థలనే ఆశ్రయించాలని సూచించారు. తమకు పూర్తిగా అర్థమయ్యే పెట్టుబడి ఉత్పత్తుల్లోనే డబ్బు పెట్టాలని, పెట్టుబడులను విభిన్నంగా విస్తరించాలని చెప్పారు. స్థిరమైన రాబడి ఉందంటే అది రిస్క్ లేని పెట్టుబడి అని భావించవద్దని హెచ్చరించారు. ఎవరైనా చెప్పారని పెట్టుబడి పెట్టొద్దు. అందరూ పెట్టుబడి పెడుతున్నారని మీరు కూడా పెట్టొద్దు. మీరు అర్థం చేసుకున్నందుకే పెట్టుబడి పెట్టాలన్నారు. పెట్టుబడిదారుల విద్యకు ఒక సాధారణ మార్గదర్శకాన్ని అందించేందుకు నేషనల్ సెక్యూరిటీస్ మార్కెట్ అవేర్‌నెస్ కరిక్యులమ్ను కూడా సెబీ ప్రవేశపెట్టనుంది. దీనికి అనుబంధంగా ఉచిత సెబీ ఇన్వెస్టర్ అవేర్‌నెస్ టెస్టు అందుబాటులోకి తీసుకురానుంది. వివిధ వర్గాల అవసరాలకు అనుగుణంగా ఈ పాఠ్యాంశాన్ని మార్చుకునే అవకాశం ఉంటుంది. సెక్యూరిటీస్ మార్కెట్లో పెట్టుబడుల భాగస్వామ్యం పెరుగుతున్నప్పటికీ, పెట్టుబడిదారుల ఆర్థిక అవగాహన విషయంలో ఇంకా అంతరం ఉందని సెబీ ఇన్వెస్టర్ సర్వే 2025 వెల్లడించింది. ఈ సర్వే ప్రకారం కేవలం 36 శాతం మంది పెట్టుబడిదారులకు మాత్రమే సెక్యూరిటీస్ మార్కెట్‌పై అధిక లేదా మోస్తరు స్థాయి అవగాహన ఉంది.

# 10గ్రాముల బంగారం రూ.1,49,180

## కిలో వెండి రూ.2.45 లక్షలు



**ముంబయి, అక్టోబరు 5:** దేశంలోని బులియన్ వ్యాపారం అత్యధికంగాజ రిగే నగరాల్లో బంగారం ధరలు కొంతమేర దిగివచ్చినట్లు తెలుస్తోంది. ముంబయి నగరంలో పదిగ్రాముల 24 కేరట్లు బంగారం 1,49,180, 22 కరట్లు 1,36,750గాను, 18 కేరట్లు 1,12,350గాను కొనసాగాయి. కాగా ఢిల్లీలో 1,49,330గా ఉంది. అదే ఈఈ కేరట్లు 1,36,900, రూ.1,12,040గాను ధరలు కొనసాగడం గమనార్హం. చెన్నై నగరంలో పదిగ్రాముల 24 కేరట్లు బంగారం 1,49,180గాను,22 కేరట్లు రూ. 1,36,750గాను, 18 కేరట్లు రూ.1,12,350గాను కొనసాగాయి. బెంగళూరులో పదిగ్రాములు బంగారం రూ.1,49,180, 22 కేరట్లు 1,36,750, 18 కేరట్లు 1,11,80గా ఉన్నాయి. ఇక తెలుగురాష్ట్రాల్లోధరలు కూడా ఇంచుమించు ఒకేవిధంగా ఉన్నాయి. 24 కేరట్ల బంగారొ పదిగ్రాములు రూ.1,49,180, 22కేరట్లు రూ. 1,36,750, 18 కేరట్లు రూ.1,11,890గా కొనసాగడం గమనార్హం. అదేవిధంగా వెండిధరలు చెన్నైలో కిలో ఒక్కంటికి రూ.2.45 లక్షలు, ముంబయిలో రూ.2.35 లక్షలు, ఢిల్లీలో రూ.2.35 లక్షలు కోల్‌కత్తాలో రూ.2.35 లక్షలు, బెంగళూరులో కూడా రూ.2.35 లక్షలుగానే కొనసాగింది. ఎంసిఎక్స్‌లో పదిగ్రాముల బంగారం ధరలు రూ.0.7శాతం తగ్గినట్లు సమాచారం. పదిగ్రాముల బంగారం రూ.1.51 లక్షలుగా కొనసాగింది. అయితే ఈ ధరలు ఇతర పన్నులుఅన్నింటితో కలిపి ఉంటాయి.

# ప్రయాణీకులపై ఇండిగో ఛార్జీల బాదుడు



**ముంబయి, అక్టోబరు 5:** దేశీయ విమానయాన రంగంలో అగ్రగామి సంస్థ అయిన ఇండిగో, ప్రయాణికులపై అదనపు భారాన్ని మోపనుంది. విమాన ఇంధనం (ఏటీఎఫ్) ధరలు భారీగా పెరగడంతో ఫ్యూయల్ సర్‌చార్జ్‌ను పెంచుతున్నట్లు సోమవారం ప్రకటించింది. ఈ నూతన ఛార్జీలు అక్టోబర్ 6వ తేదీ నుంచి చేసే అన్ని కొత్త బుకింగ్‌లకు వర్తిస్తాయని సంస్థ స్పష్టం చేసింది. గత కొన్ని నెలలుగా ఏటీఎఫ్ ధరలు నిరంతరాయంగా పెరుగుతున్నాయని, గత నెలతో పోలిస్తే తాజాగా 14 శాతానికి పైగా ధర పెరిగిందని ఇండిగో ఒక ప్రకటనలో తెలిపింది. గడిచిన దశాబ్ద కాలంలో ఇదే అత్యధికమని పేర్కొంది. విమానయాన సంస్థల నిర్వహణ వ్యయంలో ఇంధన ఖర్చులే కీలకమని, ఈ పెరుగుదల తమ సంస్థతో పాటు మొత్తం ఏవియేషన్ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించింది. నూతన ఛార్జీల ప్రకారం దేశీయ మార్గాల్లో 500 కిలోమీటర్ల వరకు ప్రయాణించే వారిపై రూ. 375లు, 501 నుంచి 1,000 కిలోమీటర్ల వరకు రూ. 600 వసూలు చేయనున్నారు. అదేవిధంగా, 1,0011,500 కి.మీ. ప్రయాణానికి రూ. 900లు,1,501 2,000 కి.మీ. దూరానికి రూ. 1,150లు, 2,000 కిలోమీటర్లు దాటిన ప్రయాణాలకు రూ. 1,300 చొప్పున ఫ్యూయల్ సర్‌చార్జ్ వర్తిస్తుంది. అంతర్జాతీయంగా సార్క్ దేశాలకు రూ. 1,000 నుంచి రూ. 3,000 వరకు, సౌత్ ఈస్ట్ ఆసియా, గల్ఫ్, మిడిల్ ఈస్ట్ దేశాలకు రూ. 5,500, ఆఫ్రికా, యూరప్ దేశాలకు రూ. 6,000 ఫ్యూయల్ ఛార్జ్‌ను నిర్ణయించారు. వాస్తవానికి పెరిగిన ఇంధన వ్యయాన్ని భర్తీ చేయడానికి ఇంకా అధిక మొత్తంలో ఛార్జీలు పెంచాల్సి ఉన్నప్పటికీ, ప్రయాణికులపై భారాన్ని తగ్గించే ఉద్దేశంతోనే పరిమితంగా సర్దుబాటు చేసినట్లు ఇండిగో వెల్లడించింది.

# ఎఫ్‌డిలపై వడ్డీరేట్లు మరింతపెరిగే ఛాన్స్



**ముంబయి, అక్టోబరు 5:** దేశంలో ద్రవ్యోల్బణం క్రమంగా పెరుగుతుండడంతో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసే వారికి రాబోయే రోజుల్లో అధిక వడ్డీ రేట్లు లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ద్రవ్యోల్బణం ఒత్తిళ్ల కారణంగా భారతీయ రిజర్వ్ బ్యాంక్ తన తాజా ద్రవ్య పరపతి విధాన కమిటీ సమీక్షా సమావేశంలో రెపో రేటును పెంచవచ్చని ఆర్థిక రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనికి తోడు ప్రభుత్వ బాండ్ల రాబడులు, చిన్న పొదుపు పథకాల ఆకర్షణీయమైన వడ్డీ రేట్లు బ్యాంకులపై డిపాజిట్ రేట్లు పెంచేలా ఒత్తిడి తేవచ్చు. దీంతో ఫిక్స్‌డ్ డిపాజిట్ల వడ్డీ రేట్లను పెంచాల్సి రావచ్చని తెలుస్తోంది.కొన్ని నెలలుగా రిటైల్ ద్రవ్యోల్బణం క్రమంగా పెరుగుతోంది. ద్రవ్యోల్బణం ఆర్‌బిఐ గరిష్ఠ పరిమితి 6 శాతానికి చేరువవుతున్న తరుణంలో దానిని అదుపు చేసేందుకు రెపో రేటును 25 బేసిస్ పాయింట్ల వరకు పెంచవచ్చని నిపుణులు భావిస్తున్నారు. రెపోరేటు పెరిగితే బ్యాంకులు ఎఫ్‌డీవడ్డీ రేట్లను పెంచడానికి మార్గం సుగమమవు తుంది. ప్రస్తుతం 1 సంవత్సరం బ్యాంక్ టర్మ్ డిపాజిట్ రేట్లు 6 శాతం నుంచి 6.75 శాతం పరిధిలో ఉంటే, ప్రభుత్వ బాండ్ల రాబడులు అంతకంటే ఎక్కువగా ఉన్నాయి. 3 ఏళ్ల బాండ్లు 6.79 శాతం, 5 ఏళ్ల బాండ్లు 6.93 శాతం, 10 ఏళ్ల బాండ్లు 7.20శాతం రాబడులు ఇచ్చాయి. అదే సమయంలో సీనియర్ సిటిజన్ సేవింగ్స్‌స్కీమ్, సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాలు 8.20 శాతం వరకు వడ్డీని అందిస్తున్నాయి. ఈపోటీని తట్టుకుని నిధులు సమీ కరించాలంటే బ్యాంకులు ఎఫ్‌డీరేట్లను సవరించాల్సి రావచ్చు.మార్కెట్లో రుణాలకు డిమాండ్ఎక్కువగా ఉండి, బ్యాంకింగ్ వ్యవస్థలో డిపాజిట్ల ప్రవాహంతగ్గినప్పుడు, కొత్త డిపాజిట్లను ఆకర్షించేందుకు బ్యాంకులు వడ్డీ రేట్లను పెంచుతాయి.

# కోటక్ మహీంద్రా బ్యాంక్ డిపాజిట్లలో 23.2శాతం వృద్ధి



**ముంబయి, అక్టోబరు 5:** కోటక్ మహీంద్రా బ్యాంక్ మొత్తం డిపాజిట్లు జూలై–సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.6.51 లక్షల కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ.5.29 లక్షల కోట్లతో పోలిస్తే డిపాజిట్లు 23.2 శాతం పెరిగాయి.సోమవారం బ్యాంక్ వెల్లడించిన డేటా ప్రకారంగత త్రైమాసికంలో బ్యాంక్ మొత్తం డిపాజిట్లు రూ.5.73 లక్షల కోట్లుగా ఉన్నాయి. దీంతో ప్రస్తుత త్రైమాసికంలో వరుసగా 13.7 శాతం వృద్ధి నమోదైంది. జూలై–సెప్టెంబర్ త్రైమా సికంలో బ్యాంక్ నికర అడ్వాన్సులు ఏడాది ప్రాతిపదికన 24.7శాతం పెరిగి రూ.5.77 లక్షల కోట్లకు చేరాయి. అం తకుముందు త్రైమాసికంలో నమోదైన రూ.5.12 లక్షల కోట్లతో పోలిస్తే వరుసగా 12.7శాతం వృద్ధి సాధించింది. బ్యాంక్ కరెంట్ అకౌంట్–సేవింగ్స్ అకౌంట్ డిపాజిట్లు కూడా పెరిగాయి. గత ఏడాది ఇదే కాలంలోని రూ.2.24 లక్షల కోట్లతో పోలిస్తే ఈసారి 11.3 శాతం పెరిగి రూ.2.49 లక్షల కోట్లకు చేరాయి. తొలిత్రైమాసికంలో కాసా డిపాజిట్లు రూ.2.31 లక్షల కోట్లుగా ఉండగా, త్రైమాసిక ప్రాతిపదికన 7.8 శాతం వృద్ధి నమోదైంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్వాప్ విండో ద్వారా సెప్టెంబర్ 30నాటికి కోటక్ మహీంద్రా బ్యాంక్ 5.78 బిలియన్ల విలువైనఎఫ్‌సి ఎన్నార్‌బి డిపాజిట్లను సమీకరించింది. స్థూల నిరర్థకఆస్తులు మొత్తం అడ్వాన్సుల్లో 1.18 శాతానికి తగ్గాయి. అంతకుముందు త్రైమాసికంలో ఇవి 1.20 శాతంగా ఉన్నాయి. నికర ఎన్పీలు అంతకుముందు త్రైమాసికంలోని 0.25శాతం నుంచి 0.27 శాతానికి పెరిగింది. ప్రొవిజన్లు వరుసగా పెరిగి రూ.668 కోట్లకు చేరాయి. అంతకుముందు త్రైమాసికంలో ఇవి రూ.516 కోట్లుగా ఉన్నాయి. అయితే ఏడాది ప్రాతిపదికన చూస్తే ప్రొవిజన్లు రూ.1,208 కోట్ల నుంచి గణనీయంగా తగ్గాయి. కోటక్ బ్యాంక్ షేర్ ధర సోమవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి 0.56 శాతం తగ్గి రూ.416 వద్ద ముగిసింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.